జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఆదిలాబాద్, హైదరాబాద్ | శుక్రవారం 10 జూలై 2026 | సంపుటి: 19 | సంచిక: 125 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799
పరాభవ నామ సంవత్సరం , ఆషాఢ మాసము , తిథి: అష్టమి - 12:24:15 వరకు నక్షత్రంరేవతి - 16:01:03 వరకు కరణంకౌలవ - 12:24:15 వరకు, తైతిల - 23:37:15 వరకు పక్షంకృష్ణ యోగంఅతిగణ్డ - 12:37:21 వరకు
Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## నేడు రాష్ట్రవ్యాప్తంగా విద్యా సంస్థల బంద్

**బంద్‌కు పిలుపునిచ్చిన వామపక్ష విద్యార్థి సంఘాలు**

**విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన**

హైదరాబాద్,జూలై9(ప్రజాజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను తగ్గించాలన్న ప్రయత్నాలను

మిగతా1 2లో..

## బిఆర్ఎస్ రాజ్యసభ నేతగా వద్దిరాజు

**సురేశ్ రెడ్డి పదవీకాలం ముగియడంతో నిర్ణయం**

హైదరాబాద్,జూలై9(ప్రజాజ్యోతి): రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఫ్లోర్ లీడర్ గా నియమితులయ్యారు. రాజ్యసభ సభ్యుడుగా, బీఆర్ఎస్

మిగతా 2లో..



## మ్యాన్ ఫ్యాక్చరింగ్ ఎకోసిస్టమ్‌ను తీర్చిదిద్దుతున్నాం

- 2030 నాటికి 500 గిగావాట్ల ఇంధన పునరుత్పాదక
- 2070 నాటికి 'నెట్ జీరో' ఉద్గారాలను సాధిస్తాం
- ప్రవాస భారతీయుల కార్యక్రమంలో ప్రధాని మోదీ
- అణు ఇంధనం నుంచి రక్షణ వరకు ఒప్పందాలు
- భారత్-ఆస్ట్రేలియా ప్రధానుల ద్వైపాక్షిక చర్చలు

న్యూఢిల్లీ,జూలై9(ప్రజాజ్యోతి): 'గొప్పగా ఎదగండి, ఎక్కువ విజయాలు సాధించండి' అంటూ మెల్‌బోర్న్‌లోని ప్రవాస భారతీయులకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఒక లక్ష్యం పూర్తయితే మరో సంకల్పం తీసుకని ముందుకెళ్లాలని తెలిపారు. ప్రపంచంలో వేగవంతమైన ఆర్థిక వ్యవస్థతో భారత్ వేగంగా అడుగులో వేస్తోందని, త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ ఎదుగుతుందని పేర్కొన్నారు. చంద్రయాన్ ద్వారా తొలిసారి చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టామని, అంతరిక్షంలోకి గగన్‌యాన్ పంపేందుకు భారత్ సిద్ధమవుతోందని తెలిపారు. అలాగే, భారత్ సొంత స్పేస్ స్టేషన్ ఏర్పాటుకు సిద్ధమవుతోందని మోదీ స్పష్టం చేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ఆయన మెల్‌బోర్న్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఈ మేరకు ప్రసంగించారు. భారత్‌లో హైడ్రో ప్రాజెక్టులు, గ్రీన్ హైడ్రోజన్, సోలార్ మాడ్యూల్స్, విండ్ మిల్స్ కోసం మేము ఒక బలమైన మ్యాన్‌ఫ్యాక్చరింగ్ ఎకోసిస్టమ్‌ను తీర్చిదిద్దుతున్నాం. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని, 2070 నాటికి 'నెట్ జీరో' ఉద్గారాలను సాధించాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఆస్ట్రేలియాకు చెందిన సాంకేతికత, పెట్టుబడులు, వనరులు ఈ పరివర్తనను మరింత వేగవంతం చేయగలవు. కొన్ని నెలల క్రితమే శాంతియుత ప్రయోజనాల చట్టం ద్వారా భారత్ అణు రంగాన్ని ప్రైవేట్ కంపెనీలకు కూడా భారత్ అందుబాటులోకి తెచ్చింది. 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని

మిగతా 2లో..

## పశ్చిమాసియా రణరంగం

- ఇరాన్‌పై అమెరికా వైమానిక దాడులు
- అమెరికా దాడుల్లో 8మంది మృతి
- చాబహార్ పోర్టుపై అమెరికా దాడి
- నిలిచిపోయిన విద్యుత్ సరఫరా
- 10 రెట్ల బలంగా సమాధానమిస్తాం
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి



న్యూఢిల్లీ,జూలై9(ప్రజాజ్యోతి): అమెరికా- ఇరాన్ పరస్పర దాడులతో పశ్చిమాసియా మరోసారి రణరంగంగా మారింది. ఇరాన్‌పై అమెరికా మరోసారి వైమానిక దాడులు ప్రారంభించింది. అమెరికా అధ్యక్షుడి ఆదేశాల మేరకు ఈ తాజా సైనిక చర్యలు చేపట్టినట్లు సెంట్‌కామ్ వెల్లడించింది. మరోవైపు ఇరాన్‌తో ఇకపై ఎలాంటి దౌత్య చర్చలు ఉండవని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్ హిట్ లిస్ట్‌లో తానే నెంబర్ వన్ అన్న ట్రంప్ ఈసారి కథ ముగిస్తామని పేర్కొన్నారు. ఇరాన్ కూడా ప్రతీకార దాడులకు దిగింది. గల్ఫ్ ప్రాంతాల్లోని అమెరికా స్థావరాలను టార్గెట్ చేస్తోంది. మరోవైపు తమ దేశంవైపు వస్తోన్న డ్రోన్లు, క్షిపణులను అడ్డుకుంటున్నామని

మిగతా 2లో..

## 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్
# ఆర్థిక వ్యవస్థ

- దేశ ఆర్థిక వ్యవస్థలో 10శాతం వాటా సాధించేలా ప్రణాళికలు
- తెలంగాణను అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ఓఆర్ఆర్ లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలింపు
- హైదరాబాద్‌ను కాలుష్యం నుంచి తప్పించే చర్యలు తీసుకుంటున్నాం
- స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పాం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఇండియాస్ నెక్ట్స్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్ ప్రారంభం

**ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విషం చిమ్మడం ఆపి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హితవుపలికారు. కాలుష్యపు కోరల నుంచి నగరాన్ని రక్షించేందుకు పరిశ్రమల్ని ఓఆర్ఆర్ వెలుపలకు తరలిస్తామని పునరుద్ఘాటించారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం షాబాద్ మండలం సీతారాంపురంలో ప్రీమియర్ ఎనర్జీస్ యూనిట్‌ను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి శ్రీకారంచుట్టారు. పరిశ్రమల అవసరాలకు అనగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలు ఉండాలని సీఎం ఆకాంక్షించారు.**



హైదరాబాద్,జూలై9(ప్రజాజ్యోతి): 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థగా ఎదుగు తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. షాబాద్ మండలం సీతారాంపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియాస్ నెక్ట్స్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కోసమే.. స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పాం. ఏటా 1.10 లక్షల మంది యువత ఇంజినీరింగ్ పట్టాలతో బయటకి వస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరిశ్రమలు రావాలి. బ్లూకాలర్ ఎంప్లాయిస్‌లో కొత్త స్కిల్స్ పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. సీతారాంపురం ప్రజల త్యాగాల వల్లే ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటయ్యాయని తెలిపారు. గతంలోనూ రంగారెడ్డి జిల్లా ప్రజల త్యాగాల వల్లే ఓఆర్ఆర్, పరిశ్రమలు వచ్చాయన్నారు. అత్యంత నివాస అనుకూల నగరాల జాబితాలో హైదరాబాద్ ముందుంటుంది. అయినప్పటికీ హైదరాబాద్‌ను కూడా కాలుష్య సమస్య వేధిస్తోంది. 1.34 కోట్ల మంది ఓఆర్ఆర్ లోపల నివసిస్తున్నారు. ఓఆర్ఆర్ లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్

మిగతా 12లో..

## హైదరాబాద్ ఒలింపిక్స్ క్రీడలు నిర్వహించాలి

- 2034లో ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం ఇస్తుంది
- హైదరాబాద్ వేదిక కావాలని కోరుకుంటున్నాను
- అదే నా డ్రీమ్ : సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,జూలై9(ప్రజాజ్యోతి): ఆటల కోసం తెలంగాణ ప్రభుత్వం ముందడుగు వేసిందన్న సీఎం రేవంత్ రెడ్డి మహాత్మ గాంధీ నుంచి యంగ్ ఇండియా స్ఫూర్తి పొందామని తెలిపారు. మహాత్మాగాంధీ యంగ్ ఇండియా అనే వార్తా పత్రికను నడిపేవారని

మిగతా 12లో..





## మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తొలిదశ పనులకు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్,జూలై9(ప్రజాజ్యోతి): మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తొలి దశ పనులకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు ఇస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. జోన్-1ఏ, జోన్-1బీ ప్రాధాన్య కారిడార్లలో మూసీ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9.20 కి.మీ., ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.80 కి.మీ. మేర అభివృద్ధి పనులు కొనసాగనున్నాయి. మొత్తం 21 కి.మీ. ప్రాధాన్య స్ట్రెచ్‌లో రివర్‌ఫ్రంట్ పనులు జరుగనున్నాయి. భూసేకరణ వ్యయం మినహా రూ.7,345.12 కోట్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో ఏడీబీ నుంచి రూ.4,500 కోట్ల రుణాన్ని తీసుకోనుండగా..మిగతా .2,845.12 కోట్లు ఊఓఆం లేదా ఃఉఎఎఅ నుంచి రుణం తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మూసీ రివర్‌ఫ్రంట్ పనులను ఈపీసీ (ఇఖఅ) విధానంలో నిర్వహించనున్నారు. ప్రాజెక్టు పర్యవేక్షణకు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ(ఖఓఅ) నియామకానికి సర్కార్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని ఎమ్ఆర్‌డీసీఎల్(ఓఖీఆఅఒ)కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## వ్యవసాయ రంగానికి
# పెద్దపీట



- రెండున్నరేళ్లలోనే 35వేల కోట్లు రైతులకు అందచేత
- రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నాం
- బీఆర్ఎస్ పాలనలో క్రాప్ డ్యామేజ్‌కు కేసీఆర్ ఒక్క పైసా ఇవ్వలేదు
- ఖమ్మం పర్యటనలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ఖమ్మం,జూలై9(ప్రజాజ్యోతి): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. రైతాంగానికి అవసరమైన సహాయ సహకారాలు అన్ని విధాలుగా అందిస్తున్నామని పేర్కొన్నారు. గురువారం ఖమ్మం జిల్లా చింతకాని మండలం లచ్చగూడెంలో డిప్యూటీ సీఎం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. చింతకాని మండలం

మిగతా 12లో..

## మరోమారు కలవర పెడుతున్న కోవిడ్

- రాజంపేటకు చెందిన వ్యక్తి కోవిడ్‌తో మృతి
- అప్రమత్తం అయిన వైద్యారోగ్య శాఖ



తిరుపతి,జూలై9(ప్రజాజ్యోతి): కోవిడ్ మరోమారు కలవర పెడుతోంది. కడప జిల్లా రాజంపేటకు చెందిన ఒక వ్యక్తి(52) కొవిడ్ కారణంగా చనిపోవడంతో వైద్యశాఖ అప్రమత్తమైంది. అన్ని జిల్లాల్లో ఆరా తీయగా కడప, తిరుపతి జిల్లాల్లో 5 కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదైనట్టు గుర్తించింది. దీంతో మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ) రాష్ట్రంలోని ప్రధాన ప్రభుత్వ

మిగతా 2లో..

## 1,500 కండక్టర్
# కొలువుల భర్తీ

**భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్**



హైదరాబాద్,జూలై9(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 1,500 కండక్టర్ కొలువుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) యాజమాన్యమే ఈ ఉద్యోగాల భర్తీని చేపట్టనుంది. టెన్త్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ఈ పోస్టులకు ఉద్యోగుల్ని ఎంపిక చేయనున్నట్లు సమాచారం. ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో ఈ ఉద్యోగాలకు అభ్యర్థుల నియామక ప్రక్రియపై ఆర్టీసీ యాజమాన్యం దృష్టి సారించింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అనంతరం టీజీఎస్ ఆర్టీసీ ఆవిర్భవించిన తర్వాత ఇప్పటి వరకు కండక్టర్ కొలువులను భర్తీ చేయలేదు. ఉన్న ఉద్యోగులే పదవీ విరమణ చేస్తుండటంతో ప్రతి ఏటా ఖాళీలు పెరుగుతూ వస్తున్నాయి. ఈ మేరకు కొంతకాలం క్రితం ఔట్ సోర్సింగ్ పద్ధతిన తాత్కాలికంగా హైదరాబాద్, సికింద్రాబాద్ సహా పలు రీజియన్ల పరిధిలోని డిపోల్లో సిబ్బందిని నియమించింది. ఇప్పుడు

మిగతా 2లో..

# సంపాదకీయం

## గందరగోళంలో వ్యవసాయం

ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఆందోళన మరింత ఎక్కువయ్యింది. తాగు,సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడబోతున్నాయి. ఈయేడు సాగు సాగడమెలా అన్న ఆందోళనలో రైతులు ఉన్నారు. జులై మధ్యలోకి వచ్చినగా గట్టి వర్షాలు లేవు. దీంతో వరిసాగు సాగదని రైతులే చెబుతున్నారు. నారు ఎండిపోతోంది. మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు గోదావరిలో కొత్తో గొప్పో నీళ్లు వస్తున్నాయి తప్ప, కృష్ణా పివాహక పూర్తిగా ఎండిపోయినట్లే. ఇప్పటికే వ్యవసాయ రంగం ఎన్నో సవాళ్లతో సతమతమవుతోంది. దేశానికి అన్నం పెట్టే రైతు అనేక సమస్యలమధ్య జీవన పోరాటం సాగిస్తున్నాడు. ప్రకృతి వైపరీత్యాలు, పెరుగుతున్న పెట్టుబడులు, నకిలీ విత్తనాల మోసం, ఎరువుల కొరత, పంటలకు మద్దతు దక్కకపోవడం వంటి సమస్యలు రైతుల ఆర్థిక స్థితిని మరింత దెబ్బతీస్తున్నాయి. రైతుకు ప్రకృతి శాపంగా మారుతోంది. ఒకవైపు కరవు, మరోవైపు ఆకాల వర్షాలు, వరదలు, వడగండ్ల వానల కారణంగా పంటలు నాశనమవుతున్నాయని అనుకుంటే ఇప్పుడు ఎల్‌నినో వాతావరణ మార్పుల ప్రభావంతో పంటల సాగు అనిశ్చితంగా మారింది. రైతు ఎంత కష్టపడి పంట పండించినా ప్రకృతి వైపరీత్యాలు అతని ఆశలను ఆవిరి చేస్తున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభ మైన వ్యవసాయరంగం ప్రస్తుతం అనేక సవాళ్లతో కొట్టుమిట్టాడుతోంది. ప్రకృతి వైపరీత్యాల నుండి మొదలై మార్కెట్ మాయాజాలం వరకు ప్రతి ఒక్కటి రైతును అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. రైతు పెట్టుబడి పెట్టే కాలం నుండి పంట చేతికి వచ్చే వరకు అంతా ప్రకృతి చేతుల్లోనే ఉంటుంది. వాతావరణ మార్పుల వల్ల ఒక ఏడాది తీవ్రమైన కరువు ఏర్పడితే, మరో ఏడాది అకాల వర్షాలు, తు ఫానులు, వరదలు పంటలను ముంచెత్తుతున్నాయి. చేతికి వచ్చిన పంట కళ్లముందే నీటిపాలు కావడం తో రైతులకు కోలుకోలేని దెబ్బతగులుతోంది. ఎల్‌కనినో తట్టుకునేలా రైతులకు అత్యవసర సాయానికి ప్రభుత్వాలు రంగంలోకి దిగాలి. ఇకపోతే వ్యవసాయంలో పెట్టు బడులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు భారీగా పెరిగాయి. పంటదిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోవడం, మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదు. దీంతో అప్పులు చేయడం తప్ప రైతుకు మరో మార్గం కనిపించడం లేదు. పంటించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదు. ధాన్యం కొంటారన్న గ్యారెంటీ లేదు. దీనికితోడు నకిలీ విత్తనాల సమస్య రైతులను తీవ్రంగా వేధిస్తోంది. అధిక దిగుబడి వస్తుందని నమ్మించి విక్రయించే నకిలీ విత్త నాల వల్ల మొలక శాతం తగ్గిపోవడం, పంటలు దెబ్బతిన డంతో రైతు కుదేలవుతున్నాడు. మరోవైపు ఎరువుల కొరత రైతులకు తలనొప్పిగా మారింది. సీజన్ సమయంలో ఎరు వుల కోసం గంటల తరబడి క్యూలలో నిలబడాల్సిన పరి స్థితి ఏర్పడుతోంది. అవసరమైన సమయంలో ఎరువులు అందకపోవడంతో పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. నేడు వ్యవసాయం అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారింది. కూలీల ఖర్చులు, ట్రాక్టర్ల అద్దెలు, డీజిల్ ధరలు, విత్తనాలు, ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పెట్టుబడి రెట్టింపవుతున్నా దానికి తగ్గట్టుగా పంటకు మద్దతుధర లభించడం లేదు. మార్కెట్ల లో దళారుల వ్యవస్థ, సిండికేట్లుగా మారిన వ్యాపారులు రైతు శ్రమను దోచుకుంటున్నారు. ఎంతో కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి రైతుది. పెట్టుబడులు పెరిగి, పంట చేతికిరాక, వచ్చిన పంటకు సరైన ధర దక్కకపోయేసరికి రైతు పూర్తిగా అప్పుల్లో మునిగిపోతాడు. బ్యాంకుల నుండి రుణాలు దొరకని చిన్న, సన్న కారు రైతులు గ్రామీణ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తారు. వారు విధించే చక్రవడ్డీలు చెల్లించలేక, తెచ్చిన అప్పులు తీరే మార్గం కనిపించక సమాజంలో గౌరవం కోల్పోతామనే భయంతో ఎంతో మంది రైతులు పురుగుల మందుతాగి తనువు చాలిస్తున్నారు. ఇంకొందరు ఉరివేసుకుని బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. రుణాల విధానం సక్రమంగా లేకపోవడంతో బ్యాంకులతో పాటు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులు తీసుకుంటున్నారు. వంట నష్టాలు, ఆదాయం లేక పోవడం వల్ల అప్పులు తీర్చలేక మానసిక ఒత్తిడికి గురవు తున్నారు. మనోవేదనతో కొంతమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతూ వారి కుటుంబాలను రోడ్డు పాల్జేస్తున్నారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభంనుంచి గట్టెక్కించా లంటే ప్రభుత్వాలు రైతు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి. న కిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకో వాలి. ఎరువుల సరఫరాను సకాలంలో అందుబాటులో ఉంచాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలి. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు అమలు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకైన వ్యవ సాయరంగం బలోపేతం కావాలంటే రైతు బాగుండాలి. రైతు సంక్షేమమే దేశాభివృద్ధికి మూలాధారం అనే విషయాన్ని పాలకులు గుర్తించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎల్‌నినో నుంచి గట్టెక్కేందుకు తగన వ్యవసాయ ప్రణాళికలు అమలు చేయాలి.

### 1,500 కండక్టర్

# కొలువుల భర్తీ

మొదటిపేజీ తరువాయి..

ప్రభుత్వం అనుమతించడంతో 1,500 కండక్టర్ ఉద్యోగాల భర్తీకి ఆర్టీసీ సిద్ధమవుతోంది. కండక్టర్ జాబ్‌లకు టెన్త్‌లో వచ్చిన మార్కుల శాతాన్ని ఆధారంగా తీసుకుని ఎంపిక చేసే విధానం ఆర్టీసీలో ఉంది. రీజియన్ల వారీగా ఖాళీలు, రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకుంటూ సెలక్షన్ ప్రాసెస్ జరిగేది. ఆ తర్వాత రాష్ట్రంలో టెన్త్‌లో గ్రేడింగ్ విధానం



అమల్లోకి వచ్చింది. మళ్లీ ఇప్పుడు గ్రేడింగ్ విధానం పోయి మార్కుల శాతం వచ్చింది. దీంతో కండక్టర్ కొలువులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల్లో కొంతమంది మార్కుల శాతంతో, మరికొందరు గ్రేడ్ పాయింట్లతో దరఖాస్తు చేసే పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు ఈ రెండు విధానాలను ఎలా పరిగణనలోకి తీసుకోవాలనే అంశంపై కసరత్తు చేస్తున్నట్లుగా ఆర్టీసీ అధికారి ఒకరు వివరించారు. ఈ మేరకు ఎస్సెస్సీ బోర్డుకు ఆర్టీసీ యాజమాన్యం తాజాగా లేఖ రాసింది. గ్రేడింగ్‌ను మార్కుల శాతంగా ఎలా లెక్కించాలి అనే విషయంపై ఎస్సెస్సీ బోర్డు నుంచి స్పష్టత తీసుకుని, కండక్టర్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని ఆర్టీసీ యోచిస్తున్నట్లుగా సమాచారం . ఆర్టీసీలో సిబ్బంది కొరత నానాటికీ తీవ్రమవుతోంది. ముఖ్యంగా కండక్టర్ పోస్టులో ఈ సమస్య ఎక్కువగా ఉంది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సుమారు 2,059 మంది కండక్టర్ల కొరత ఉంది. ఈ ఏడాది మార్చినాటికి 140 మంది ఉద్యోగ విరమణ చేశారు. మరోవైపు గత కొద్ది నెలల్లో కొత్తగా మరిన్ని బస్సులను రోడ్డెక్కించిన నేపథ్యంలో మరింత మంది కండక్టర్లు కావాలని అధికారులు గుర్తించారు. మొత్తంగా 3,208 మంది అవసరం ఉంది. తక్షణం 1500 పోస్టుల భర్తీకి అనుమతివ్వాలని ఆర్టీసీ యాజమాన్యం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి కొద్దిరోజుల క్రితం తీసుకెళ్లిన విషయం తెలిసిందే.

## మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

### తెలంగాణ రవాణా శాఖ హెచ్చరిక

హైదరాబాద్,జూలై9(ప్రజాజ్యోతి): వాహనదారులకు తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ కీలక హెచ్చరిక జారీ చేసింది. మైనర్లకు వాహనాలు నడపడానికి ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. మైనర్లతో పాటు వాహన యజమానులపైనా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది.మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 199 ప్రకారం.. మైనర్ వాహనం నడిపినట్లు తేలితే ఆ వాహనం రిజిస్ట్రేషన్‌ను 12 నెలల పాటు రద్దు చేస్తామని అధికారులు తెలిపారు. అంతేకాకుండా, ఆ మైనర్‌కు 25 ఏళ్ల వయస్సు వచ్చే వరకు డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేయబోమని వెల్లడించారు. గత ఏడాది మైనర్లకు వాహనాలు ఇచ్చిన కేసుల్లో 4,070 వాహనాల రిజిస్ట్రేషన్లు రద్దు చేసినట్లు రవాణా శాఖ వెల్లడించింది. పిల్లల భద్రతతో పాటు ప్రజల ప్రాణాలను కాపాడే ఉద్దేశంతో మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు అధికారులు విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వాహన రిజిస్ట్రేషన్ రద్దుతో పాటు ఇతర చట్టపరమైన చర్యలను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రస్తుతం మైనర్లు వాహనాలు నడపడం ఆందోళనకరంగా మారింది. కొందరు ఇద్దరు, ముగ్గురు కలిసి బైక్‌లపై స్టంట్లు చేస్తూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేస్తున్నారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం 18 ఏళ్లు పూర్తి చేసిన వారికే డ్రైవింగ్‌కు అర్హత ఉంటుంది. అయితే, పదో తరగతి చదివే వయస్సులోనే చాలామంది బైక్‌లు నడుపుతూ రోడ్లపై నిర్లక్ష్యంగా దూసుకెళ్తున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణనష్టం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పోలీసులు ఇప్పటికే విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండగా.. తాజాగా తెలంగాణ రవాణా శాఖ కూడా నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మరోసారి హెచ్చరించింది.

# పశ్చిమాసియా రణరంగం



మొదటిపేజీ తరువాయి..

కువైట్ వెల్లడించింది. హర్మూజ్‌లో వాణిజ్య నౌకలపై దాడులు చేసిందంటూ ఇరాన్‌పై అమెరికా సైన్యం క్షిపణులతో విరుచుకుపడుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాల మేరకు యూఎస్ సెంట్రల్ కమాండ్ దళాలు దక్షిణ ఇరాన్ అంతటా భీకర దాడులు జరుపుతున్నాయి. ఇరాన్‌కు కీలకమైన బుషెహర్ అణు విద్యుత్ ప్లాంట్, చాబహార్ నగరాలు భారీ పేలుళ్లతో దద్దరిల్లాయి. హర్మూజ్‌లో వాణిజ్య నౌకలు, పౌర సిబ్బందిపై ఇరాన్ జరిపిన దాడులకు ప్రతీకారంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు అమెరికా తెలిపింది. ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, రాడార్లు, ఐఆర్‌జీసీ బోట్లను లక్ష్యంగా చేసుకుంటున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం పశ్చిమాసియాలో 20కి పైగా అమెరికా యుద్ధనౌకలు గస్తీ కాస్తున్నాయి. అమెరికా దాడుల్లో ఇప్పటివరకు 8 మంది ఇరాన్ సైనికులు మరణించినట్లు సమాచారం. తీర ప్రాంత నగరాలు, కీలక మౌలిక సదుపాయాలుసహా మొత్తం 90 లక్ష్యాలపై దాడులు చేసినట్లు అమెరికా సైన్యం ప్రకటించింది. భారత్‌కు ఎంతో కీలకమైన చాబహార్ పోర్టుపైనా బాంబులు వేసింది. ఇరాన్ కూడా అమెరికాకు దీటుగా బదులిచ్చింది. కువైట్, బహ్రెయిన్, ఖతార్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై ఆత్మాహుతి డ్రోన్లతో దాడులు చేసింది. పేట్రియాట్ క్షిపణి వ్యవస్థలను టార్గెట్ చేసింది. దీనితో పశ్చిమాసియా మళ్లీ బాంబుదాడులతో దద్దరిల్లుతోంది. ఇరాన్‌పై రెండో రోజు మరింత తీవ్రంగా దాడులు ఉంటాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించినట్లుగానే అగ్రరాజ్యం సైన్యం భీకరదాడులు చేసింది. బుషెహర్ అణు విద్యుత్ కేంద్రం టార్గెట్‌గా వైమానిక దాడులు జరిపింది. ఈ దాడులను ఇరాన్ కూడా ధ్రువీకరించింది. బుషెహర్ అణు విద్యుత్ కేంద్రం సమీపంలో అమెరికా దాడులు చేసినట్లు ఇరాన్ ఆరోపించింది. అయితే నష్టం వాటిల్లిందా? లేదా అనే విషయాన్ని వెల్లడించలేదు. ప్రస్తుతం ఇరాన్‌లో బుషెహర్ విద్యుత్ ప్లాంట్ మాత్రమే పనిచేస్తోంది. రష్యా సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో ఉన్న ఈ ప్లాంట్ పరిసర ప్రాంతాలపై యుద్ధం ఆరంభమైనప్పటి నుంచి పలుసార్లు దాడులు జరిగాయి. ఇటీవల జరిగిన దాడిలో క్షిపణి శకలం తగిలి ప్లాంటు సిబ్బందిలో ఒకరు చనిపోయారని ఇరాన్ వెల్లడించింది. సమీపంలోని భవనం కూడా దెబ్బతిన్నట్లు తెలిపింది.

అయితే, అణుకేంద్రం లక్ష్యంగా జరిగిన దాడులపై ఆందోళనలు వ్యక్తమైనప్పటికీ, రేడియేషన్ విడుదల కాలేదని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ తెలిపింది. ఇరాన్‌లోని 90 సైనిక లక్ష్యాలపై దాడులు జరిపినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది. దాడులు జరిగిన వాటిలో ఇరాన్ తీరప్రాంతంలోని వైమానిక రక్షణ వ్యవస్థలు, తీర ప్రాంత నిఘాఆస్తులు, క్షిపణి, డ్రోన్ నిల్వ కేంద్రాలు ఉన్నాయి. బందర్ అబ్బాస్, కొనార్క్, చాబహార్ ఓడరేవు నగరాల్లో పేలుళ్లు జరిగినట్లు ఇరాన్ మీడియా తెలిపింది. భారత్‌కు ఎంతో కీలకమైన చాబహార్ పోర్టుపై కూడా అమెరికా దాడి చేసింది. కలంతారి పోర్టు, మారిటైమ్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్ దెబ్బతిన్నట్లు ఇరాన్ మీడియా తెలిపింది. అమెరికా దాడులతో చాబహార్ నగరంతోసహా కొన్నిప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గోలెస్తాన్ ప్రావిన్స్‌లోని అక్వాలా నగర శివార్లలో ఉన్న ఒక రైల్వే వంతెనపై అమెరికా బలగాలు దాడి చేశాయని ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది. అక్ టెకే ఖాన్ వంతెన లక్ష్యంగా 7శత్రు క్షిపణులు దూసుకొచ్చాయని పేర్కొంది. వాటిలో రెండు రైల్వే పట్టాలపై పడినట్లు వెల్లడించింది. అహ్వాజ్ నగర శివార్లో జరిగినదాడిలో ముగ్గురు పౌరులు మృతి చెందినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా పేర్కొంది. ఇరాన్ షహర్‌లో జరిగిన దాడిలో మరొకరు ప్రాణాలు కోల్పోయారు. పవిత్రనగరం మషద్‌కు వెళ్లే రెండు వంతెనలను అమెరికా పేల్చేసినట్లు ఐఆర్‌జీసీ ఆరోపించింది. అమెరికా దాడులతో టెహ్రాన్ నుంచి మషద్‌కు వెళ్లే రైలు సర్వీసులను నిలిపివేశారు. రెండ్రోజుల్లో అమెరికా జరిపిన దాడుల్లో 14మంది మృతి చెందగా మరో 78మంది గాయపడినట్లు ఇరాన్ ప్రకటించింది. ఇరాన్ పాలకులను పిచ్చివాళ్లు, దుర్మార్గులుగా అభివర్ణించారు డొనాల్డ్ ట్రంప్. ఇకపై ఎలాంటి దౌత్యపరమైన చర్చలు లేదా ఒప్పందాలు చేసుకునే ఉద్దేశం తనకు లేదన్నారు. చర్చల పేరుతో సమయం వృథా చేయదలుచుకోలేదని, ఈసారి ఆ దేశానికి చెక్ పెట్టి, పని ముగిస్తామని హెచ్చరించారు. అవసరమైతే ఇరాన్ పౌర మౌలిక సదుపాయాలైన పవర్ గ్రిడ్లు, వాటర్ ప్లాంట్లతో పాటు ఖర్గ్ ఐలాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. ఇరాన్ ఒకటి రెండు నౌకలపై దాడి చేస్తే తాము 10 రెట్లు బలంగా బుద్ధి చెప్తామన్నారు. ఈ ఘర్షణలు చాలా వేగంగా ముగిసిపోతాయని, భవిష్యత్తులో చమురు రవాణా స్వేచ్ఛగా, సురక్షితంగా సాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఇదే సమయంలో ఇరాన్ హిట్ లిస్ట్‌లో తానే నంబర్ వన్ టార్గెట్‌గా ఉన్నానని ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే ఇరాన్ బెదిరింపులను తాను అసలు పట్టించుకోనని తేల్చిచెప్పారు. ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం ముగిసినప్పటికీ, ఈ ఉద్రిక్తతలు పూర్తి స్థాయి యుద్ధానికి దారితీయవని ట్రంప్ స్పష్టం చేశారు. హర్మూజ్ జలసంధి విషయంలో ఇరాన్‌ను అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మరోసారి హెచ్చరించారు. అమెరికా మరింత గట్టిగా ప్రతీకారం తీర్చుకుంటుందని వ్యాఖ్యానించారు. హర్మూజ్‌లో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు కొనసాగిస్తే తదుపరి సైనిక చర్య మరింత తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. నౌకాయాన స్వేచ్ఛ, ఇంధన ప్రవాహాలను పరిరక్షించేందుకు అమెరికా మునుపెన్నడూ లేనంత గట్టిగా ప్రతిస్పందిస్తుందన్నారు. ఒప్పందం కూడా ఇదే విధంగా చేసుకున్నట్లు చెప్పారు.అమెరికా దాడుల ప్రకటన అనంతరం ఇరాన్ దక్షిణ తీర నగరం చాబహార్‌లో పలు పేలుళ్లు సంభవించినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. చాబహార్‌తో పాటు సమీపంలోని కొనారక్ ప్రాంతంలో దాదాపు పది పేలుళ్ల శబ్దాలు వినిపించినట్లు తెలిపింది. ఘటన అనంతరం చాబహార్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని పేర్కొంది. అమెరికా దాడులపై ఇరాన్ జాతీయ భద్రతా మండలి తీవ్రంగా స్పందించింది. తాము అత్యంత ఘోరమైన రీతిలో ప్రతీకారం తీర్చుకుంటామని, ప్రపంచంలో ఎక్కడున్నా అమెరికన్లకు రక్షణ లేకుండా చేస్తామని హెచ్చరించింది.

### మ్యాన్ ఫ్యాక్చరింగ్ ఎకోసిస్టమ్‌ను

# తీర్చిదిద్దుతున్నాం




మొదటిపేజీ తరువాయి..

లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆస్ట్రేలియాలో ఉన్న అపారమైన యురేనియం నిల్వలు భారత్ అణు ఇంధన ప్రయాణంతో ప్రత్యక్షంగా ముడిపడి ఉన్నాయని అన్నారు. దీర్ఘకాలిక పెట్టుబడులకు భారత్ అత్యుత్తమ గమ్యస్థానమని, భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ఆస్ట్రేలియా వ్యాపారవేత్తలను మోదీ కోరారు. భారత్‌లో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇండోనేసియా పర్యటన ముగించుకొని ప్రధాని మోదీ ఆస్ట్రేలియా వెళ్లారు. మెల్‌బోర్న్‌కు చేరుకున్న ప్రధానికి అక్కడి ప్రవాసభారతీయులు ఘన స్వాగతం పలికారు. ఇరు దేశాల ఉమ్మడి వారసత్వాన్ని చాటిచెప్పేలా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రధాని వీక్షించారు. తర్వాత మెల్‌బోర్న్‌లో జరిగిన ఆసీస్‌లో ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్‌తో కలిసి ఆస్ట్రేలియా-ఇండియా సీఈఓ ఫోరమ్ సదస్సులో పాల్గొన్నారు. విమాన, రవాణా, లాజిస్టిక్స్, ఆర్థిక సేవలు, కీలక ఖనిజాలు, టెక్నాలజీ, ఆహార భద్రత వంటి రంగాల్లో ఉన్న అవకాశాలను సీఈఓలతో మోదీ చర్చించారు. ఈ సందర్భంగా అల్బనీస్, మోదీ సరదాగా సెల్ఫీ తీసుకున్నారు. అనంతరం మాట్లాడిన ప్రధాని ద్వైపాక్షిక వాణిజ్యాన్ని కొత్త శిఖరాలకు చేర్చే ప్రతిపాదిత సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందాన్ని త్వరగా ఖరారు చేయాలని అల్బనీస్‌ను కోరారు. భారత్, ఆస్ట్రేలియాలు సహజమైన, విశ్వసనీయ భాగస్వాములుగా ముందుకు సాగడం ఎంతైనా అవసరం ఉందన్నారు.ఇదిలా ఉండగా, గత 12 ఏళ్లలో తాను ఆస్ట్రేలియాలో పర్యటించడం ఇది మూడోసారని మోదీ తెలిపారు. గడిచిన కాలంలో భారత్-ఆస్ట్రేలియా సంబంధాలు గొప్ప శిఖరాలకు చేరుకున్నాయని, ఇందులో ప్రవాస భారతీయులు కీలక పాత్ర పోషించారని అన్నారు. ప్రవాస భారతీయుల దినచర్య వారిని భారతదేశంతో అనుసంధానించి ఉంచుతుందని, అలాగే వారు ఆస్ట్రేలియా అభివృద్ధికి కూడా దోహదపడుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమం హౌస్‌ఫుల్ అయింది. ఇది ఒక బ్లాక్‌బస్టర్. దీనికి ముందు, నేను సిడ్నీలో మీ అందరినీ రెండుసార్లు కలిశాను. నేను మెల్‌బోర్న్ ప్రజలను కలవడానికి కూడా ఎదురుచూస్తున్నాను. అందుకే ఈసారి మెల్‌బోర్న్ ప్రజలతో కలిసి ఫ్లాట్ వైట్ కాఫీ తాగాలని అనుకున్నాను. ఇక్కడ మీ అందరినీ చూసి నాకు గర్వంగా ఉంది. ఆస్ట్రేలియా అభివృద్ధికి పూర్తి శక్తితో తోడ్పడుతున్నారు. మనం భారతీయులం, పాలలో కరిగే చక్కెరలాంటి వాళ్లం. అది పాలను మరింత మధురంగా చేస్తుంది. మన ప్రేమ సారాన్ని ప్రపంచంలోకి నిరంతరం పంచుతూనే ఉంటాం. ఇంట్లో పాలు ఆస్ట్రేలియన్ కావచ్చు, కానీ తయారుచేసే టీ మాత్రం భారతీయమైనది. పప్పులు, కూరగాయలు ఆస్ట్రేలియన్వే అయినప్పటికీ వాటికి అసలైన భారతీయ మసాలాలతో తాలింపు వేస్తాం" అని మోదీ పేర్కొన్నారు. మెల్‌బోర్న్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో భారతీయ స్ఫూర్తితో నిండిన అనేక ప్రదేశాలు, మార్కెట్లు ఉన్నాయని, కొందరు వాటిని 'లిటిల్ ఇండియా' అని పిలిస్తే, మరికొందరు 'మినీ ఇండియా' అని పిలుస్తారని మోదీ పేర్కొన్నారు. పేరు ఏదైనప్పటికీ, అవి భారతీయ సంస్కృతిలో పూర్తిగా అనుసంధానమై ఉంటాయని, అక్కడ అమ్మకాలు నిరంతరం జరుగుతూ ఉంటాయని చెప్పారు. అంతేకాదు, ఈ అమ్మకాల కొనుగోలు చేయడంలో ప్రజలు ఆసక్తి కనబరుస్తారని తెలిపారు. ఒకవేళ షాపింగ్ చేయాలనే మూడ్ లేకపోయినా, చివరికి ఏదో ఒకటి కొనేస్తారని చెప్పారు.

మరోవైపు పౌర అణుశక్తి, సముద్ర భద్రత, కీలక ఖనిజాలు వంటి పలు కీలక రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేసేందుకు భారత్-ఆస్ట్రేలియా పలు ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. వాణిజ్యం, రక్షణ సంబంధాలను పెంపొందించే లక్ష్యంతో చేపట్టిన మూడు దేశాల పర్యటనలో భాగంగా ఇండోనేషియా నుంచి ఆస్ట్రేలియా చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో విస్తృత స్థాయి చర్చలు జరిపారు. అనంతరం భారత్-ఆస్ట్రేలియా సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ఆ తర్వాత ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, భారత్-ఆస్ట్రేలియా ద్వైపాక్షిక సంబంధాలను క్రికెట్‌తో పోలుస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు,. రెండు దేశాల మధ్య సంబంధాలకు క్రికెట్ ఒక దౌత్య భాషలా పనిచేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మెల్‌బోర్న్‌ను ప్రపంచ క్రీడా రాజధానిగా భావిస్తారని, ఇక్కడ క్రీడల గురించి మాట్లాడకపోవడం అంటే క్రికెట్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించకపోవడమే అని అన్నారు. భారత్-ఆస్ట్రేలియా సమావేశాల తీరును క్రికెట్‌లోని మూడు ఫార్మాట్లతో పోల్చిన ప్రధాని, మన కార్యాచరణ వన్డే మ్యాచ్‌లా స్పష్టమైన లక్ష్యంతో ఉంటుందని తెలిపారు. అలాగే నిర్ణయాలు టీ20 మ్యాచ్‌లా వేగంగా ఉంటాయని, భాగస్వామ్యం మాత్రం టెస్ట్ మ్యాచ్‌లా బలంగా, చిరస్థాయిగా కొనసాగుతుందని అన్నారు. ఇరు దేశాలు సంయుక్త రక్షణ, భద్రతా సహకార ప్రకటనను ఆమోదించాయి. దీని ద్వారా రక్షణ పరిశ్రమల్లో భాగస్వామ్యం, ఉమ్మడి ఆవిష్కరణలు, సమాచార మార్పిడి, విపత్తుల సమయంలో మానవతా సహాయం, సహాయక చర్యల్లో సహకారం మరింత బలోపేతం కానుంది. అలాగే సముద్ర భద్రత సహకార రోడ్‌మ్యాప్‌పై అంగీకారం కుదిరింది.

దీనివల్ల తీర ప్రాంత నిఘా, సమాచార మార్పిడి, సముద్ర కాలుష్య నియంత్రణ, శోధన-రక్షణ చర్యలు, సామర్థ్యాల పెంపుపై కలిసి పనిచేయనున్నారు. భారత తీర రక్షక దళం, ఆస్ట్రేలియా మారిటైమ్ బోర్డర్ కమాండ్ మధ్య అవగాహన ఒప్పందం కూడా కుదిరింది. ఇంధన భద్రతపై ఇరు దేశాలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ఆస్ట్రేలియా నుంచి భారత్‌కు యురేనియం సరఫరా జరిగేలా పౌర అణు ఒప్పందం కింద పరిపాలనా ఏర్పాటుపై అంగీకారం కుదిరింది. దీని ద్వారా భారత్ ఇంధన వనరులు మరింత విస్తరించడంతో పాటు శక్తి భద్రత బలోపేతం కానుంది. సైబర్ భద్రత, కీలక సాంకేతికతలు, సరఫరా గొలుసుల బలోపేతానికి 'ఆస్ట్రేలియా-ఇండియా పార్ట్‌నర్‌షిప్ ఫర్ సైబర్, క్రిటికల్ టెక్నాలజీస్ అండ్ సప్లై చైన్స్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే ఖనిజ అన్వేషణ, కీలక ఖనిజాల రంగంలో భూగర్భ సర్వే సంస్థల మధ్య సహకారానికి కూడా ఒప్పందాలు కుదిరాయి. భువనేశ్వర్‌లోని జాతీయ నైపుణ్య శిక్షణ సంస్థలో మైనింగ్, మైనింగ్ పరికరాలపై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయనున్నారు. బెంగళూరులో ఫ్లిండర్స్ యూనివర్సిటీ, గురుగ్రామ్‌లో విక్టోరియా యూనివర్సిటీ క్యాంపస్‌ల ఏర్పాటుకు అనుమతులు లభించాయి. వృత్తి విద్య ప్రమాణాల మెరుగుదల, నైపుణ్యాభివృద్ధి కోసం భారత జాతీయ వృత్తి విద్యా మండలి (ఎన్‌సీవీఈటీ), ఆస్ట్రేలియన్ స్కిల్స్ క్వాలిటీ అథారిటీ (ఏఎస్‌క్యూఏ) మధ్య పత్రాల మార్పిడి జరిగింది.

## హరీష్ రావుపై కెసిఆర్‌కు నమ్మకం లేదు

హైదరాబాద్,జూలై9(ప్రజాజ్యోతి): ఇరిగేషన్‌లో హరీశ్‌రావు నిష్ణాతుడైతే వాళ్ల మామ కేసీఆర్ ఆయనను మంత్రి పదవి నుంచి మొదట్లో ఎందుకు తొలగించారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. హరీశ్‌రావుపై కేసీఆర్‌కు నమ్మకం లేకనే మంత్రి పదవి నుంచి తీసేశారని విమర్శించారు. ఈ మేరకు మాజీ మంత్రి హరీశ్‌రావుకి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. గురువారం సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ చిట్‌చాట్ చేశారు.మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో వచ్చే వేసవి వరకు రిపేర్లు పూర్తి అవుతాయని తెలిపారు. బ్యారేజీలో డ్యామేజీల మరమ్మతులు చేయడానికి తాము చిత్తశుద్ధితో పని చేస్తున్నామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు తనకు మంత్రి పదవి ఇవ్వాలని అంటున్నారని.. కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి చెప్పినట్లుగా హరీశ్‌రావు తమ పార్టీలో చేరుతారా? అని ప్రశ్నించారు. హరీశ్‌రావు వ్యాఖ్యలపై సరైన సమయంలో సవివరంగా తాము సమాధానం చెబుతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఇకపోతే ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా జిల్లాల వారీగా కార్యాచరణకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. ప్రతి పరిస్థితినీ ప్రభుత్వం పర్యవేక్షిస్తోందన్నారు. గ్రామసభల ద్వారా ఎల్‌నినోపై చైతన్యం కల్పిస్తామన్నారు. శాస్త్రవేత్తల సూచనలతో పంటల ఎంపిక చేసుకోవాలని, ప్రతి రైతుకు సాంకేతిక సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రిజర్వాయర్ల నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు మంత్రి తెలిపారు. సాగునీటి వినియోగం శాస్త్రీయంగా నిర్వహిస్తామన్నారు. ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ప్రతి జిల్లాలో నిరంతరం సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. వదంతులను నమ్మొద్దని.. అధికారుల సూచనలు పాటించాలని రైతులకు సూచించారు. ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వర్చువల్‌గా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు.

## నేడు రాష్ట్రవ్యాప్తంగా విద్యా సంస్థల బంద్

మొదటిపేజీ తరువాయి..

మానుకోవాలని, విద్యాశాఖకు మంత్రిని కేటాయించటం సహా పలు విద్యారంగ సమ్యలను పరిష్కరించాలంటూ వామపక్ష విద్యార్థి సంఘాలు బంద్ కి పిలుపునిచ్చాయి. శుక్రవారం రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలు బంద్ పాటించాలని ప్రకటించాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 27వేల ప్రభుత్వ పాఠశాలలు ఉంటే వాటి సంఖ్యను 4వేలకు తగ్గించాలని సర్కారు భావిస్తోందని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. ఈ ప్రయత్నాన్ని మానుకోవాలని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రిస్తూ చట్టం చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న టీచర్, ఎంఈఓ, డీఈఓ , లెక్చరర్ పోస్టులను భర్తీ చేయటం సహా అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న పాఠశాలలు, హాస్టల్స్ , గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని వామపక్ష విద్యార్థి సంఘాలు కోరాయి. ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని తక్షణం అమలు చేయాలని విద్యాహక్కు చట్టం అమలు చేసి అన్ని విద్య సంస్థల్లో పేదలకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాలని డిమాండ్ చేస్తునట్టు వామపక్ష విద్యార్థి సంఘాలు ప్రకటించాయి. ఎన్‌ఈపీని అమలు చేయటం లేదని అసెంబ్లీలో తీర్మానం చేయాలని స్పష్టం చేసిన ఆయా విద్యార్థి సంఘాలు ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా పుస్తకాలు, నోట్ బుక్స్ విక్రయాన్ని అడ్డుకోవాలని స్పష్టం చేశాయి. ఆయా డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ పాటించనున్నట్టు ప్రకటించాయి.వామపక్షాల బంద్ నేపథ్యంలో చాలా పాఠశాలలు ముందుగానే స్పందిస్తున్నాయి. రేపు బంద్ పాటిస్తున్నట్లు ప్రకటించాయి. ఈ మేరకు మధ్యాహ్నం నుంచే విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్లకు మెసేజ్‌లు వస్తున్నాయి. రేపు శుక్రవారం బంద్, ఎల్లుండి రెండో శనివారం.. దీంతో చాలా విద్యాసంస్థలకు 3 రోజుల పాటు సెలవులు రానున్నాయి. కాలేజీలకు కూడా రేపు బంద్ పాటిస్తూ సెలవు ఇచ్చినట్లు మెసేజ్‌లు వస్తున్నాయి.

## బిఆర్ఎస్ రాజ్యసభ నేతగా వద్దిరాజు

మొదటిపేజీ తరువాయి..

ఫ్లోర్ లీడర్‌గా ఉన్న కేఆర్ సురేష్ రెడ్డి పదవీకాలం ముగియడంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా వద్దిరాజు రవిచంద్రను ఫ్లోర్ లీడర్‌గా నియామకం పట్ల తెలంగాణ మున్నూరు కాపు సంఘం నాయకులు పార్టీ అధినేత కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. వద్దిరాజు నియామకం బీసీల,




తెలంగాణ హక్కుల సాధనలో కీలకంగా మారుతారని సంఘం అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం పటేల్ అన్నారు. వద్దిరాజు రవిచంద్ర సేవలను గుర్తించి కీలకమైన బాధలు అప్పగించిన కేసీఆర్‌కు మున్నూరు కాపు సమాజం కృతజ్ఞతలు తెలుపుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రావలసిన రాజ్యాంగపరమైన హక్కుల సాధనలో వద్దిరాజు కృషి మరింత పెరగడానికి అవకాశం దక్కిందని పేర్కొన్నారు.

## మరోమారు కలవర పెడుతున్న కోవిడ్

మొదటిపేజీ తరువాయి..

ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు లేఖలు రాశారు. కొవిడ్ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్న ఐసోలేషన్ బెడ్లు, ఐసీయూ పడకలు, ఆక్సిజన్ సౌకర్యం, వెంటిలేటర్లు, మందులు, ర్యాపిడ్ కిట్లు, అంబులెన్స్ వంటి వైద్య సిబ్బంది వివరాలతో నివేదిక పంపాలని ఆదేశించారు. ఇటీవల నమోదైన కేసుల నేపథ్యంలో అవసరమైతే వెంటనే చికిత్స అందించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని వైద్యాధికారులకు సూచించినట్టు సమాచారం.కడప జిల్లా రాజంపేటకు చెందిన ఒక వ్యక్తి (52) తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ గత నెల 24న వేలూరు సీఎంసీలో చికిత్స నిమిత్తం చేరారు. నిమోనియా వ్యాధిని గుర్తించారు. అనుమానంతో కొవిడ్ పరీక్ష చేయగా



26వ తేదీ పాజిటివ్ వచ్చింది. చికిత్స పొందుతూ 28న మృతిచెందడంతో వైద్యశాఖ అప్రమత్తమైంది. కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదైన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని డీఎంఈ ఆదేశిచ్చారు. రుయాలో కొవిడ్ ఐసోలేషన్ వార్డు ఏర్పాటుచేశాం. కొవిడ్ టెస్ట్ కిట్లు, సిబ్బంది, అవసరమైన మందులతో సిద్ధంగా ఉన్నాం. రుయాలో ఇప్పటివరకు ఎలాంటి కేసులు నమోదుకాలేదు. ప్రస్తుతం నమోదైన కేసుల్లో తీవ్రమైన లక్షణాలు లేవని, అయినప్పటికీ అప్రమత్తంగా ఉండాలని భావిస్తున్నాం. కరోనాతో గతంలో లాగా భయపడాల్సిన పనిలేదు. వాతావరణంలో మార్పుల కారణంగా రోగనిరోధక శక్తి తగ్గినవారు అశ్రద్ధ చేయకూడదు. జ్వరం, దగ్గు, గొంతునొప్పి వంటి లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

## సమాచార హక్కు అమలుకు పటిష్ట చర్యలు తీసుకోవాలి



**సమాచార హక్కు వికాస సమితి ఆధ్వర్యంలో జిల్లా అధికారులకు ఘన సన్మానం**

**మంచిర్యాల, 9, జూలై (ప్రజాజ్యోతి) :** మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సమాచార హక్కు వికాస సమితి ప్రతినిధులు పలువురు జిల్లా ఉన్నతాధికారులను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) అమలును మరింత పటిష్టం చేయడం, ప్రజలకు సమాచారాన్ని సులభంగా అందుబాటులో ఉంచే అంశాలపై అధికారులతో చర్చించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నూతనంగా పరిపాలనాధికారి (ఏఓ) మరియు సహాయ ప్రజా సమాచార అధికారి (ఏపీఐఓ)గా బాధ్యతలు స్వీకరించిన దేశ్‌పాండే శ్రీనివాసరావును కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) మరియు కలెక్టరేట్ ప్రజా సమాచార అధికారి (పీఐఓ) మోతీరాంను వారి చాంబర్‌లో కలిసి, కలెక్టరేట్‌లో సమాచార హక్కు చట్టానికి సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేయాలని, చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రజలకు అవసరమైన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచి చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) నరేందర్ రాథోడ్‌ను సన్మానించి, డీఎంహెచ్ఓ కార్యాలయంతో పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమాచార హక్కు చట్టం బోర్డులను ఏర్పాటు చేసి, సెక్షన్ 4(1)(బి) నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని కోరారు. ఈ విజ్ఞప్తులపై అధికారులు సానుకూలంగా స్పందించి, కార్యాలయాల్లో సమాచార బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు సెక్షన్ 4(1)(బి) నిబంధనలను పటిష్టంగా అమలు చేస్తామని హామీ ఇచ్చినట్లు సమాచార హక్కు వికాస సమితి ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు వికాస సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉప్పుల రాంకిషన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్ విమానాశ్రయంలో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డికి కోల్ బెల్ట్ ప్రాంత బీజేపీ నాయకుల ఘన స్వాగతం

**- సింగరేణికి తాడిచెర్ల--2 బొగ్గు బ్లాక్ కేటాయింపుపై కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి**



**మంచిర్యాల, 9, జులై (ప్రజాజ్యోతి) :** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కేంద్ర బొగ్గు గనులు మరియు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి కోల్ బెల్ట్ ప్రాంతానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, బీఎంఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. సింగరేణి సంస్థకు తాడిచెర్ల--2 బొగ్గు బ్లాక్‌ను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ, తాడిచెర్ల--2 బొగ్గు బ్లాక్ కేటాయింపు సింగరేణి సంస్థ భవిష్యత్తుకు ఎంతో కీలకమైందని, బొగ్గు ఉత్పత్తి పెరుగుదలతో పాటు సంస్థ ఆర్థిక బలోపేతానికి, వేలాది మంది కార్మికుల ఉపాధి భద్రతకు, కొత్త ఉద్యోగ అవకాశాల కల్పనకు దోహదపడుతుందని పేర్కొన్నారు. సింగరేణి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్, మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, రామకృష్ణాపూర్‌తో పాటు ఇతర సింగరేణి కోల్ బెల్ట్ ప్రాంతాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, బీఎంఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సింగరేణి కార్మికులను ప్రతిబింబించే రక్షణ హెల్మెట్లు ధరించి, బొగ్గు తట్టలు, గనుల పనిముట్లను చేతబట్టి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి వినూత్నంగా ఘన స్వాగతం పలికారు. డప్పు చప్పుళ్లు, జైకారాలు, నినాదాలతో శంషాబాద్ విమానాశ్రయ పరిసరాలు మార్మోగాయి. పుష్పగుచ్ఛాలు అందజేసి కేంద్ర మంత్రిని సాదరంగా ఆహ్వానించారు. కాషాయ కండువాలతో విమానాశ్రయ ప్రాంతం కళకళలాడగా, "కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి జిందాబాద్", "సింగరేణికి జై" అంటూ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, దుర్గం అశోక్, కందుల సంధ్యారాణి, సునీల్ రెడ్డి, ముకేశ్ గౌడ్, అందుగుల శ్రీనివాస్, పూనమ్ చంద్తో పాటు పలువురు బీజేపీ, బీఎంఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఓటు హక్కుతోనే సమాజంలో మార్పుఓటును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది

**సర్ సర్వే పగడ్బందీగా నిర్వహించాలి ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్**





**ఖానాపూర్ జులై 9(ప్రజాజ్యోతి) :** ఓటు హక్కుతోనే సమాజంలో మార్పు సంభవిస్తుందని ఆ ఓటును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఖానాపూర్ శాసనసభ్యులు వెడమ బొజ్జు పటేల్ అన్నారు. ఖానాపూర్ పట్టణంలోని 11వ వార్డులో ఎస్ ఐ ఆర్ ఓటు సవరణ హెల్ప్ డెస్క్ ను 11 వార్డ్ కౌన్సిలర్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఏర్పాటయింది ఈ సందర్భంగా ఎమ్మెల్యే హెల్ప్ డెస్క్‌లో పాల్గొని బిఎల్ఓకు భర్తీ చేసిన ఓటర్ ఫారాలను జాగ్రత్తగా అందించాల్సిన బాధ్యత పార్టీలపరంగా బాధ్యతలు అప్పగించిన బిఎల్ఏ 2లపై లకు ఉందని సూచించారు ఓటర్ల సౌకర్యార్థం సహాయక కేంద్రాలు ఏర్పాటు స్లాగనీయం మైనప్పటికిని సక్రమంగా వాటిని నిర్వహించి ఆయాబూత్ లెవల్లో ఉన్న ఓటర్లందరి ఫారాలు భర్తీ అయ్యేంతవరకు బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే అన్నారు ఈ కార్యక్రమంలో 11వ వార్డు అధికారి దాదే రామకృష్ణ బిఎల్ఓ బూతు అధికారి కాంగ్రెస్ నాయకులతో పాటు ఓటర్ల సవరణ చేయించుకునే ఓటు హక్కుదారులు తోపాటు ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గౌర్రె గంగాధర్ బూతు నాయకులు ధ్యావతీ రాజేశ్వర్ షబ్బీర్ పాషా జాహిర్ అహ్మద్ కంఠం రవి జన్నారపు శంకర్ ఆసిఫ్ విశ్రాంత ఎంపీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు సర్ ప్రక్రియ సర్వే ఖానాపూర్ పట్టణంలో అన్ని బూతులకు సంబంధించిన దాంట్లో పార్టీలకతీతంగా హెల్ప్ డెస్కు ఏర్పాటు చేయడం హర్షనీయం అయితే ప్రతి ఒక్క ఓటర్ను గుర్తించి వాళ్లు ఉండేది లేనిది పక్క ఊరికి బూతులోకి పోయినవి స్పష్టంగా పరిగణించాలన్నారు అలాగే మరణించిన ఓటర్లను తొలగించి స్వచ్ఛందంగా పనిచేయాల్సిన బాధ్యత ఉందని పలువురు వ్యాఖ్యానించారు.

## కేంద్రంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు





**ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఆదేశాలతో ప్రత్యేక బృందం ఫుట్పాత్ల తొలగింపు**

**ఖానాపూర్ జూలై 9(ప్రజా జ్యోతి) :** నిర్మల్ జిల్లా కేంద్రంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఆదేశాల మేరకు ప్రత్యేక ట్రాఫిక్ నిర్వహణ బృందం ఏర్పడి ఫుట్పాట్లతో పాటు నిబంధనలకు వ్యతిరేకంగా ఆపిన ఆటోలు ఇతర వాహనాలను తొలగించే చర్యలు గురువారం బస్టాండ్ ప్రాంతంలో చేపట్టారు. ఈ సందర్భంగా నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం పట్టణంలోని ప్రధాన కూడళ్లు, అధిక రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టనుందన్నారు. ప్రత్యేకంగా నిర్మల్ బస్టాండ్ పరిసరాలు, ఆటో స్టాండ్, అంబేద్కర్ చౌక్, మయూరి హోటల్ సమీపం, కిసాన్ షాపింగ్ మాల్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ఆక్రమణలు, రహదారులపై వ్యాపారం నిర్వహిస్తున్న చిరు వ్యాపారులతో చర్చించి ట్రాఫిక్ సజావుగా సాగేలా అవసరమైన చర్యలు తీసుకోన్నారు. అలాగే రహదారులపై అక్రమ పార్కింగ్‌ను నివారించి వాహనాలను నిర్దేశిత పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపేలా చర్యలు తీసుకున్నారు ప్రతిరోజు ఈ పద్ధతిలోనే కొనసాగించాలని చిరు వ్యాపారులను ఆటో డ్రైవర్లను సమావేశపరచి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐలు కృష్ణ, సమ్మయ్య, ఆర్ఐలు రామ్ నిరంజన్, రామక్రిష్ణ, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు ఇతర పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**నిబంధనలు పాటించాలి ఎస్పి జానకి షర్మిల :**

ఈ ప్రత్యేక ట్రాఫిక్ నిర్వహణ కార్యక్రమం గురువారం నుంచి నుంచి అమల్లోకి వస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని, వాహనాలను నిర్దేశిత పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపివేయాలని, రహదారులను ఆక్రమించకుండా సహకరించాలని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్‌తో ప్రజలకు ఇబ్బందులు కలిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఆర్మూర్‌లో ఘనంగా జాతీయ విద్యార్థి దినోత్సవం







**ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిందర్**

**మామడ జూలై 10 (ప్రజా జ్యోతి) :** విద్యార్థుల భారీ ర్యాలీ ప్రదర్శన నిజామాబాదు , జూలై 9:అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆవిర్భావ దినోత్సవం మరియు జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్మూర్ నగరంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం ఏబీవీపీ నాయకులు మరియు విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు చేతుల్లో ఏబీవీపీ పరిషత్ జెండాలు పట్టుకుని "భారత్ మాతా కీ జై", క్షణం క్షణం మా కణం క్షణం భరతమాతకే సమర్పణం అంటూ చేసిన నినాదాలతో నిజామాబాదు పురవీధులు మారుమోగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఏబీవిపి ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిందర్ మాట్లాడుతూ.. 1949 జూలై 9న ప్రారంభమైన ఏబీవీపీ, నేడు ప్రపంచం లోనే అతిపెద్ద విద్యార్థి శక్తుగా ఎదిగిందని కొనియాడారు. కేవలం విద్యా రంగ సమస్యలపైనే కాకుండా, విద్యార్థుల్లో జాతీయ భావాలు, సమాజం పట్ల బాధ్యతను పెంపొందించడంలో ఏబీవీపీ ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. "జ్ఞానం - శీలం - ఏకత" అనే నినాదంతో కోట్లాది మంది విద్యార్థులను దేశ నిర్మాణంలో భాగస్వాములను చేస్తోందని అన్నారు ఖానాపూర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ, మరియు ప్రభుత్వ హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏబీవీపీ నిరంతరం రాజీలేని పోరాటాలు చేస్తోందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో విద్యార్థి లోకాన్ని ఏకం చేసి మరిన్ని ప్రజాస్వామ్య పోరాటాలకు సిద్ధమవుతామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రితం, సాయికుమార్, రక్షిత్,దినేష్, భాస్కర్, బాలకృష్ణ, సన్నీ, స్నేహిత్,చెర్రీ,లక్కీ, దీపన్, రాజకుమార్, దినేష్, రిచిత్, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపు చారిత్రాత్మక నిర్ణయం

**- సంస్థ భవిష్యత్, కార్మికుల ఉపాధి భద్రతకు మరిన్ని బొగ్గు బ్లాకులు కేటాయించాలి**

**- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డా. జనక్ ప్రసాద్**



**మంచిర్యాల, 9, జులై (ప్రజాజ్యోతి) :** సింగరేణికి తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్ కేటాయింపు చారిత్రాత్మక నిర్ణయం అని, సంస్థ భవిష్యత్, కార్మికుల ఉపాధి భద్రతకు మరిన్ని బొగ్గు బ్లాకులు కేటాయించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డా. జనక్ ప్రసాద్ అన్నారు . సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం కేటాయించడం సంస్థ భవిష్యత్ అభివృద్ధి, బొగ్గు ఉత్పత్తి పెంపు, కార్మికుల ఉద్యోగ భద్రతకు చారిత్రాత్మక నిర్ణయమని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డా. జనక్ ప్రసాద్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థ దీర్ఘకాలిక అభివృద్ధి, తెలంగాణ పారిశ్రామిక ప్రగతి, కార్మికుల ఉద్యోగ భద్రతను దృష్టిలో ఉంచుకొని తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్ కేటాయింపును సాధించేందుకు ఐఎన్‌టీయూసీతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరిందని తెలిపారు. ఆ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడం హర్షణీయమన్నారు. తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్‌లో సుమారు 182 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని, ఈ గనిలో నుంచి సంవత్సరానికి 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధ్యమవుతుందని తెలిపారు. దీని ద్వారా రాబోయే 40 నుంచి 50 సంవత్సరాల వరకు సింగరేణికి అవసరమైన బొగ్గు నిల్వలు అందుబాటులో ఉండి, సంస్థ ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది ఏర్పడుతుందని వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు రూ.64,000 కోట్ల ఆదాయం సమకూరే అవకాశముందని, వేలం లేకుండా బొగ్గు బ్లాక్ కేటాయించడం వల్ల సింగరేణికి రూ.2,550 కోట్ల అదనపు భారం తప్పిందని పేర్కొన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి రాయల్టీలు, పన్నులు తదితర రూపాల్లో ప్రతి సంవత్సరం సుమారు రూ.16,000 కోట్ల వరకు ఆదాయం లభించే అవకాశముందని తెలిపారు. తాడిచర్ల--2 ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా సుమారు 1,200 మందికి ఉపాధి లభించనుండగా, రవాణా, యంత్ర పరికరాలు, సేవారంగం, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, అనుబంధ రంగాల్లో వేలాది మందికి పరోక్ష ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు. ఈ బొగ్గు బ్లాక్ సింగరేణి సంస్థ స్థిరత్వం, బొగ్గు ఉత్పత్తి పెంపు, కార్మికుల ఉద్యోగ భద్రతతో పాటు తెలంగాణ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కూడా ఎంతో దోహదపడుతుందని డా. జనక్ ప్రసాద్ తెలిపారు . భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కోయగూడెం బ్లాక్--3, సత్తుపల్లి బ్లాక్--3తో పాటు గోదావరి లోయలోని ఇతర బొగ్గు బ్లాకులను కూడా సింగరేణికి కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఐఎన్‌టీయూసీ తరపున ఆయన విజ్ఞప్తి చేశారు. తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్ కేటాయింపునకు సహకరించిన కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకు సింగరేణి కార్మికులు, ఐఎన్‌టీయూసీ పక్షాన ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.డి. చంద్రశేఖర్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు ధర్మపురి, త్యాగరాజన్, కాంపెల్లి సమయ్య, జెట్టి శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సైని కలిసిన హ్యూమన్ రైట్స్ మండల అధ్యక్షుడు

**జన్నారం, జూలై 9 (ప్రజాజ్యోతి) :** హ్యూమన్ రైట్స్ జన్నారం మండల అధ్యక్షుడు దావుల మల్లేష్ గురువారం రోజున ఎస్.ఐ ఉదయ్ కిరణ్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ చట్టానికి లోబడి అందరికీ సమాన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. హ్యూమన్ రైట్స్



మండల అధ్యక్షుడు దావుల మల్లేష్ మాట్లాడుతూ హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో ప్రజలకు చట్టపరమైన అవగాహన కల్పిస్తామని పోలీసు శాఖకు అన్ని రకాలుగా సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొండకూరి ప్రభుదాస్, ఆదర్శ ఫౌండేషన్ ప్రెసిడెంట్ లింగంపల్లి రాజలింగం, మామిడి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్ దంపతులు



**ఖానాపూర్ జూలై 9(ప్రజా జ్యోతి) :** కడెం మండలం ఉడుంపూర్ గ్రామంలో గురువారం పోచమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ద్రుపద దంపతులు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని ప్రజలు,రైతులు ఆనందంగా సుఖ సంతోషాలతో ఉండాలని పోచమ్మ తల్లినీ వేడుకున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక తరలింపుపై డిఎఫ్ఓకు ఫిర్యాదు

**తర్లపాడు ఉపసర్పంచ్ సార్ల నరసయ్య**



**ఖానాపూర్ జూలై 9 (ప్రజా జ్యోతి) :** ఖానాపూర్ మండలంలోని తర్లపాడ్ గ్రామం నుంచి అక్రమంగా ఇసుక తరలింపు పట్ల గ్రామ ఉపసర్పంచ్ సార్ల నరసయ్య ఖానాపూర్ అటవీశాఖ డిఎఫ్ఓ కు ఫిర్యాదు చేశారు అడ్డు అదుపు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీ పాలకవర్గం నుంచి కానీ రెవెన్యూ అటవీ శాఖ అధికారుల అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుక మాఫియా పై చర్యలు తీసుకోవాలని ఉప సర్పంచ్ అటవీ శాఖ అధికారికి వినతిపత్రం సమర్పించారు.

## వడూర్‌లో నూతన మీసేవ కేంద్రాన్ని ప్రారంభించిన ఆడే గజేందర్



**నేరడిగొండ, జూలై 09 (ప్రజాజ్యోతి) :** గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా, పారదర్శకంగా అందుబాటులోకి రావడంలో మీసేవ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. మండలంలోని వడూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మీసేవ కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రజలు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, జనన--మరణ ధ్రువపత్రాలతో పాటు పింఛన్లు, వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల దరఖాస్తులను ఒకే చోట పొందేందుకు ఈ మీసేవ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మీసేవ కేంద్ర నిర్వాహకులు మరియు వడూర్ గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వర్షపు నీటి నిల్వకు తక్షణ పరిష్కారం





**మంచిర్యాలరూరల్ జులై 09 (ప్రజాజ్యోతి) :** మంచిర్యాల పట్టణంలోని అత్యంత రద్దీ ప్రాంతమైన ఐబీ చౌరస్తాలో కురిసిన వర్షానికి డ్రైనేజీలు చెత్తతో మూసుకుపోవడంతో రహదారిపై భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా రద్దీ సమయంలో నీరు నిల్వ ఉండ టంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ పరిస్థితిని గమనించిన మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ వైకుంఠం వెంటనే స్పందించారు. ఆలస్యం చేయకుండా జేసీబీని సంఘటనా స్థలానికి రప్పించి డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త,మట్టిని తొలగించి శుభ్రపరిచే పనులను చేపట్టించారు. డ్రైనేజీలను శుభ్రం చేయడంతో వర్షపు నీరు వేగంగా బయటకు వెళ్లి రహదారిపై నిల్వ పూర్తిగా తొలగిపోయింది. సమస్యను గుర్తించిన వెంటనే చర్యలు తీసుకోవడంతో వాహనదారులు,స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ వైకుంఠం చొరవను పలువురు అభినందించారు. వర్షాకాలంలో డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

## నర్వలో ఓటర్లకు ఆర్వోల పత్రాలను అందజేస్తున్న బిఎల్ ఓ

నర్వ,జులై 9 ప్రజా జ్యోతి
నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలోని ఆయా వాడలలో ఓటర్లకు బి ఎల్ ఓ లు ఆర్వోల పత్రాలను అందించారు, ఓటర్లతో మాట్లాడుతూ, ఆర్వోల 1 పత్రాలను చదివి సంబంధిత ఓటరు యొక్క ఆధార్ కార్డు నెంబరు అడ్రస్సు పూర్తి వరాలను పూరించి ఇవ్వాలని ఓటర్లకు తెలిపారు, ఈ పత్రాలను వ్రాయడానికి తెలియ పోవడంతో



చదువుకున్న యువకులం సహాయం తీసుకుని వివరాలను రాసి ఇవ్వాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలి: ఎమ్మార్పీఎస్,డిమాండ్

చిన్నంబావి,జులై 9 (ప్రజాజ్యోతి)
చిన్నంబావి మండల పరిధిలోని కొప్పునూర్ గ్రామ శివారులో జరిగిన కులం పేరుతో దూషిస్తూ దాడికి యత్నించిన ఘటనపై ఎమ్మార్పీఎస్, మాదిగ దండోరా నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నంబావి మండల ఎమ్మార్పీఎస్ కమిటీ ఆహ్వానం మేరకు వనపర్తి జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి దాడి జరిగిన ఘటన స్థలాన్ని పరిశీలించిన అనంతరం జరిగిన సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు.బాధితుని తండ్రి చిన్న నరసింహ తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల 20వ తేదీ రాత్రి సమయంలో చిన్నంబావి నుంచి కొప్పునూర్ గ్రామానికి వస్తున్న నా కుమారుడు తగరం వెంకటస్వామి రెండు లగేజీ బ్యాగులు, ఒక వాటర్ బాటిల్‌తో కాలినడకన వెళ్తూ మొబైల్ ఫోన్ టార్చ్ వెలుతురుతో నడుచుకుంటూ. కొప్పునూర్ గ్రామ శివారులో ఉన్న అంగడి స్వామిరెడ్డి బావి సమీపానికి చేరుకోగానే అదే గ్రామానికి చెందిన సుదర్శన్ రెడ్డి, పశుల భరత్ యాదవ్ రోడ్డు సమీపంలో మద్యం సేవిస్తూ ఉన్నారు చిన్నంబావి నుండి వస్తున్న తగరం వెంకటస్వామిని ఎవడురా నీవు నీ పేరు చెప్పురా అంటూ అసభ్య పదజాలంతో అన్నారు. నేను ఉప సర్పంచ్ తమ్ముని అని చెప్పగానే "మాదిగ లంజా కొడకా" మీ పని అయిపోయింది రా అంటూ కులం పేరుతో దూషిస్తూ నా మీదికి డీజిల్ చల్లే ప్రయత్నం చేసి దాడికి యత్నించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మాట్లాడుతూ, దళితులను కులం పేరుతో అవమానించడం, బెదిరించడం రాజ్యాంగ విరుద్ధమని, ఇలాంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమ న్నారు. వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు.బాధిత కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించడంతో పాటు గ్రామంలో శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మ శ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు బాధిత కుటుంబాన్ని పరామర్శించి నట్లు తెలిపారు.స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడిచినా దళితులు, మాదిగలపై కుల వివక్ష, దాడులు కొనసాగడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో చైతన్యవంతంగా ఎదుగుతున్న దళితులను లక్ష్యంగా చేసుకుని దాడులు జరగడం.ఆందోళనకరమ న్నారు.వనపర్తి జిల్లాలోని దళితులపై ఎక్కడో ఒకచోట దాడులు జరుగు తున్నాయి వాటిని అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, సంబంధిత అధికారులు ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఆర్డీవో, తహసీల్దార్, స్థానిక ప్రజాప్రతినిధులు బాధిత కుటుంబాన్ని స్వయంగా పరామర్శించి ధైర్యం చెప్పాలని కోరారు. ప్రతి నెల 30 వ తేదీన నిర్వహించే పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా గ్రామాలను సందర్శించి పరిస్థితులను సమీక్షించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.మూడు దశాబ్దాలుగా ఎమ్మార్పీఎస్ సామాజిక న్యాయం కోసం నిరంతర పోరాటం చేస్తోందని, దళితులు, బడుగు బలహీన వర్గాలు, వికలాంగులు, వితంతువులు సహా అన్ని పేద వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమం కొనసాగిస్తోం దని తెలిపారు.



బాధిత కుటుంబానికి ఎమ్మార్పీఎస్ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడు దేవని రమేష్ మాదిగ, కొప్పునూరు గ్రామ అధ్యక్షులు తగరం గోపాల్ మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మొలకలపల్లి పరశురాం మాదిగ, ఎమ్మార్పీఎస్ కొల్లాపూర్ తాలూకా ఇన్చార్జి వీరపాగ రాముడు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బత్తిని పరమేష్ మాదిగ, పెంట్లవెల్లి మండల అధ్యక్షుడు కురుమయ్య మాదిగ, కొల్లాపూర్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు సంకటి కురుమయ్య మాదిగ, స్థిరంగాపూర్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు జై పర్వతాలు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు అజయ్ మాదిగ, పెంట్లవెల్లి ఎమ్మార్పీఎస్ ఇన్చార్జి శ్రీనివాసులు మాదిగ, తగరం నాగరాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు తగరం ఉగ్ర నరసింహ మాదిగ, మండల నాయకులు తగరం గోపాల్ మాదిగ,తగరం హిట్లర్ నరసింహ మాదిగ, మండల నాయకులు కత్తి నరసింహ మాదిగ, మాజీ సర్పంచ్ ఆంజనేయులు నాగేంద్రం మాదిగ, తదితరులు పాల్గొన్నారు

# రైతు సంక్షేమానికి మరో ముందడుగు.. రైతుల ప్రయోజనాలే లక్ష్యం..

- వ్యవసాయ మార్కెట్ యార్డుల పాలకవర్గాల ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి, జూలై 9 (ప్రజాజ్యోతి): వనపర్తి నియోజకవర్గంలో దశాబ్దాలుగా రైతులు ఎదురుచూస్తున్న వ్యవసాయ మార్కెట్ యార్డుల కల కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేసిందని ఎమ్మెల్యే తూడి





మేఘారెడ్డి అన్నారు. గురువారం గోపాల్పేట మండలం బుద్ధారం గండి ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఉమ్మడి గోపాల్పేట–రేవల్లి–ఏదుల వ్యవసాయ మార్కెట్ యార్డు పాలకవర్గం, ఖిల్లా ఘణపురం మండల కేంద్రంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో ఖిల్లా ఘణపురం–పెద్దమందడి వ్యవసాయ మార్కెట్ యార్డు పాలకవర్గాల ప్రమాణ స్వీకార కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. రెండు కార్యక్ర మాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై నూతన పాలకవర్గ సభ్యులను శాలువాలతో సన్మానించి అభినం దించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సుమారు 25 ఏళ్లుగా మార్కెట్ యార్డుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారని, రైతుల అవసరాలను గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం గోపాల్పేట–రేవల్లి–ఏదుల మండలాలకు ఒకటి, ఖిల్లా ఘణపురం–పెద్దమందడి మండలాలకు మరో కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డును మంజూరు చేసి రైతుల కలను నిజం చేసిందన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క కొత్త మార్కెట్ యార్డును కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. నూతన మార్కెట్ యార్డుల ద్వారా వేలాది మంది రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను సమీపంలోనే విక్రయించుకునే అవకాశం కలుగుతుం దని, రవాణా ఖర్చు, సమయం ఆదా కావడంతో పాటు గిట్టుబాటు ధరలు పొందేందుకు వీలు ఉంటుందని తెలిపారు. రైతులు మధ్యవర్తుల దోపిడీకి గురికాకుండా పారదర్శక మార్కెటింగ్ వ్యవస్థను ప్రభుత్వం అందుబా టులోకి తీసుకొస్తోందన్నారు. మార్కెట్ యార్డుల్లో ఆధునిక గోదాములు, షెడ్లు, తాగునీటి సౌకర్యం, విద్యుత్, అంతర్గత రహదారులు, తూకం యంత్రాలు, రైతుల విశ్రాంతి గదులు తదితర మౌలిక వసతులను దశలవారీగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైతులు పంటను వెంటనే విక్రయించాల్సిన అవసరం లేకుండా నిల్వ చేసుకునేందుకు అత్యాధునిక గోదాములను త్వరలో నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి పథకం, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులు, మార్కెటింగ్ సౌకర్యాల విస్తరణ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర లభించే వరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. రెండు మార్కెట్ యార్డుల పాలకవర్గాలకు మార్కెట్ యార్డు జిల్లా అధికారి పుష్పలత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లను ఎమ్మెల్యే సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ యార్డు అధికారులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో అప్పుల బాధలు.. రైతు సంక్షేమంపై కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ కౌంటర్

- సిద్ధి రాము కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ డిమాండ్

వనపర్తి, జూలై 9 (ప్రజాజ్యోతి): రైతు సంక్షేమమే లక్ష్యమని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నా, క్షేత్రస్థాయిలో రైతులు, పేదల పరిస్థితి దయనీయంగా ఉందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ విమర్శించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నివాసంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటన ఆత్మస్తుతి, పరనిందకే పరిమితమైందని, గత ప్రభుత్వ హయాంలో మంజూరైన అభివృద్ధి పనులకే మళ్లీ శంకుస్థాపనలు చేయడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని అన్నారు.
ఐటీ టవర్, పాలిటెక్నిక్ ఆధునీకరణ వంటి పనులకు గతంలోనే నిధులు మంజూరై శంకుస్థాపనలు జరిగాయని, ఇప్పుడు వాటినే మళ్లీ ప్రారంభించడం ప్రజలను తప్పుదారి పట్టించడమేనని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు విడుదల కాకపోవడంతో అప్పుల పాలవుతున్నారని, ఖిల్లా ఘణపూర్ మండలం వెంకటాంపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారుడు సిద్ధి రాము ఆత్మహత్య ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయడంతో పాటు కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్ర



ేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం ఏమాత్రం సరిపోదని, దానిని రూ.10 లక్షలకు పెంచాలని కోరారు. రైతు నష్టాలు, ఇంటి నిర్మాణ అప్పుల భారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రెండున్నరేళ్లలో భారీగా అప్పులు చేసిన ప్రభుత్వం ప్రజలకు చెప్పుకోదగ్గ అభివృద్ధి ఏం చేసిందో వివరించాలని సవాల్ విసిరారు. ప్రకటనలు, విమర్శలు మానేసి అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ సమావేశంలో గంధం పరంజ్యోతి, హేమంత్ ముదిరాజ్, జోహెబ్ హుస్సేన్, సునీల్ వాల్మీకి, సయ్యద్ జమీల్, నీలస్వామి, అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావం.. ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించండి

- వ్యవసాయ అధికారులకు కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం
- జూరాల, రామన్‌పాడు జలాశయాల నీటి లభ్యతపై సమీక్ష

వనపర్తి ప్రతినిధి, జూలై 9 (ప్రజాజ్యోతి): ఎల్ నినో ప్రభావంతో జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలున్న నేపథ్యంలో




రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ఇరిగేషన్, సివిల్ సప్లై శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వర్షపాతం, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, రైతులకు ఇవ్వాల్సిన సూచనలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో ఇప్పటివరకు లోటు వర్షపాతం నమోదైందని, రానున్న మూడు నెలల్లోనూ ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసే అవకాశాలు తక్కువగా ఉన్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో జిల్లా వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు రైతులతో నిరంతరం సమావేశాలు నిర్వహించి పంటల మార్పిడిపై తగిన సూచనలు అందించాలని కలెక్టర్లకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారు లతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. జూరాల, రామన్‌పాడు జలాశయాల్లోని నీటి నిల్వలు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రవాహంపై అధికారులను అడిగి తెలుసుకు న్నారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి నీటి ప్రవాహం లేదని, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసి ఆల్మట్టి నుంచి నీరు విడుదలైతే మాత్రమే కొంత నీరు వచ్చే అవకాశం ఉందని, ప్రస్తుతం ఉన్న నిల్వలు తాగునీటి అవసరాలకు సరిపోతాయని ఇరిగేషన్ సీఈ రహీముద్దీన్ వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ నీటి లభ్యత, ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని మండలాల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుపై అవగాహన కల్పించాలని, బోరు సౌకర్యం ఉండి రెండెకరా లకు పైగా భూమి ఉన్న రైతులు పామాయిల్ సాగుపై దృష్టి పెట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే మినుములు, కందులు వంటి తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని వ్యవసాయ అధికా రులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, ఇరిగేషన్ సీఈ రహీముద్దీన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయులు, ఉద్యానవన శాఖ అధికారి విజయభాస్కర్, ఇరిగేషన్ ఈఈలు, డీఈలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి సర్పంచులు–కార్యదర్శుల సమన్వయమే విజయమంత్రం: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్, జూలై 9 ( ప్రజా జ్యోతి బ్యూరో ): గ్రామాల సమగ్ర అభివృద్ధిని సాధించాలంటే సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించా లని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులకు అభినంద నలు తెలియజేసిన కలెక్టర్, ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబె ట్టుకోవడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని అన్నారు. గ్రామాలకు సంబంధించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, నిధులు, ప్రభుత్వ మార్గదర్శకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రజలు అడిగే ప్రతి ప్రశ్నకు సమగ్రంగా సమాధానం చెప్పగలిగే స్థాయిలో సర్పంచులు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. గ్రామపంచాయతీల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మంజూరైన పనులు, నిధులు, పూర్తయిన పనులు, పెండింగ్ పనులు, చెల్లింపుల వివరాలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావడానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రొఫార్మాలను పంచాయతీ కార్యదర్శులు వారం రోజుల్లో పూర్తి చేసి సమర్పించాలని ఆదేశించారు. అనంతరం వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి గ్రామాల అభివృద్ధి పురోగతిని సులభంగా పర్యవేక్షించ నున్నట్లు వెల్లడించారు. rకొత్తగా అమల్లోకి వచ్చిన వీబీజీ–రామ్ జీ చట్టంతో పాటు పనుల ఎంపిక, వేతనాల చెల్లింపులు, పరిహారం, ఇతర నిబంధనలపై శిక్షణలో సమగ్ర అవగాహన కల్పిస్తున్నందున ప్రతి ఒక్కరూ శ్రద్ధగా పాల్గొనాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామసభలు, వార్డు సభల ద్వారా ప్రజలకు వివరించి సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు.





వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పరిశుభ్ర తకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. చెత్త నిర్వహణ సక్రమంగా లేకపోతే డెంగ్యూ, డయేరియా, వైరల్ జ్వరాలు వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని హెచ్చరిస్తూ, ఘన వ్యర్థాల నిర్వహణ, డ్రైనేజీల పరిశుభ్రత, తాగునీటి వనరుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రీ–ప్రైమరీ, ప్రభుత్వ పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, వ్యవసాయ సేవల పనితీరును సర్పంచులు నిరంతరం పర్యవేక్షించా లని తెలిపారు. చిన్నారుల విద్య, పోషకాహారం, గ్రామ ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ కనబరిస్తే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజాప్రతినిధులతో సమన్వయంగా పనిచేసి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా వ్యవహరించాలని సూచించారు. ఈ శిక్షణలో వీధి దీపాలు, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పనులు, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం తదితర అంశాలపై నిపుణులు ప్రత్యేక అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జడ్పీ సీఈఓ ఇన్‌చార్జి/డీపీఓ వెంకట్ రెడ్డి, డీఆర్‌డీఓ నరసింహులు, మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ జయబాయి, భూత్పూర్, కౌకుంట్ల, హన్వాడ, మిడ్జిల్, నవాపేట్, బాలానగర్, మూసాపేట్, మహబూబ్‌నగర్ మండలాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓలు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

నాగర్ కర్నూల్ : జులై 09 (ప్రజా జ్యోతి)
కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్,పెంట్లవెల్లి మండలాలకు చెందిన రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న పోడు భూములు,వ్యవ సాయ భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారంచూపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలను వేగవంతం చేసిందని రైతులు తమ మస్యలను కార్యాలయాల్లో కాక క్షేత్రస్థాయి లోనే పరిష్కరించాలనే లక్ష్యంతో ఉందని అన్నారు. గురువారం సోమశిలలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్‌తో కలిసి సమావేశం సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అటవీ,రెవెన్యూ అధికా రులతో సుదీర్ఘంగా చర్చిస్తూ సమస్యల పరిష్కారంలో జాప్యానికిగల కారణాలను అడిగి తెలుసుకుని రైతుల సమక్షంలోనే సమస్యను పరిశీలిస్తూ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఉన్నతాధికారులు,ప్ర జాప్రతినిధుల సమక్షంలో రైతుల భూ సమస్యలను నేరుగా వివరించే అవకాశం కల్పించడం సమావేశానికి ప్రత్యేకతగా నిలిచింది.ఒక్కో గ్రామానికి చెందిన రైతులను విడివిడిగా పిలిచి వారి సమస్యలను మంత్రి స్వయంగా విని కేసులు ప్రస్తుతం ఏదశలో ఉన్నాయి,రెవె న్యూశాఖలో పెండింగ్‌లో ఉన్నాయో అటవీ శాఖ పరిధిలో ఉన్నాయా,సర్వే పూర్తికాక నిలిచిపోయాయా,లేక రికార్డుల్లో వ్యత్యాసాల కారణంగా నిలిచిపోయాయా అనే అంశాలను అధికారులతో సమీక్షించగా కొన్ని చోట్ల అటవీ శాఖ అభ్యంతరాల కారణంగా,మరికొన్ని చోట్ల రెవెన్యూ రికార్డుల్లో లోపాలతో ఇంకొన్ని ప్రాంతాల్లో సర్వే నంబర్ల వివాదాల కారణంగా దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూములకు హక్కులు పొందలేక రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాలను మంత్రి దృష్టికి తీసుకురాగా ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన మంత్రి, సంబంధిత అధికారు లను అక్కడికక్కడే వివరణకోరి సమస్యల మూలాలను గుర్తించే ప్రయత్నంచేశారు.రైతుల భూ సమస్యల పరిష్కా రానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని,భూమి రైతులకు జీవనాధారమ ని అలాంటి భూములకు సంబంధించిన వివాదాలు ఏళ్ల తరబడి కొనసాగడం వల్ల రైతులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులే నేరుగా గ్రామాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి పరిష్కరించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.ఏళ్ల తరబడి భూ సమస్యలు పెండింగ్‌లో ఉండటం ఏమిటని రైతులు పదేపదే కార్యాలయాలకు తిరగాల్సిన పరిస్థితి ఎందుకొస్తోందని మంత్రి అధికారులను ప్రశ్నించారు.రైతులు దరఖాస్తు చేసిన తర్వాత నెలలు,సంవత్సరాలపాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండకూడదని,ప్రతి రైతు దరఖాస్తును అధికారులు బాధ్యతాయుతంగా పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్క రించాలని,సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని ప్రభుత్వం ఏమాత్రం సహించబోదని హెచ్చరించారు.
రెవెన్యూ,అటవీ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల అనేక భూ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, ఇక నుండి రెండుశాఖలు పరస్పర సహకారంతో పనిచేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని,వివాదా స్పద భూముల్ని సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించి,భూరికార్డులు,అటవీ సరిహద్దులు,రైతుఆధీ నంలోని భూముల వివరాలను సమగ్రంగా పరిశీలించా లన్నారు.ఏ శాఖ పరిధిలో ఏ సమస్య ఉందో వెంటనే గుర్తించి పరస్పరం సమాచారాన్ని పంచుకోవాలని,ఫైళ్లను ఓ శాఖ నుంచి మరోశాఖకు పంపి కాలయాపన చేయకుండా సమన్వయంతో నిర్ణయం తీసుకోని సమస్యలను పరిష్కరించాలని,పోడు భూములు, పట్టాదారు పాస్‌బుక్ సమస్యలు,సర్వే నంబర్ల వివాదాలు,రికార్డుల్లోని తప్పులు,సరిహద్దు,సాగు భూములపై నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిశీలించిన మంత్రి,అర్హులైన రైతులకు ఎలాంటి అన్యాయం చేయక సమస్యలు పరిష్కరించాలని, అధికార భూ సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరిగితే రైతుల ఆర్థిక పరిస్థితులపై తీవ్ర ప్రభావం పడుతుందని,అధికారులు ప్రజల సమస్యలను కేవలం ఫైళ్లకే పరిమితం చేయకుండా బాధ్యత, జవాబుదారీతనంతో వ్యవహరించాలని,ప్రతి దరఖాస్తును మానవీయ కోణంలో పరిశీలించి అర్హులైన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.అనంతరం కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ రైతుల భూ సమస్యల పరిష్కారానికి జిల్లాయంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని రైతులు భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్, పాత పట్టాలు,సర్వే నంబర్లు,హద్దుల వివరాలు, అందుబాటులోఉన్న రికార్డులను సంబంధిత ఆర్డీవో కార్యాలయంలో అందించాలని,పూర్తి రికార్డులు అందుబాటులో ఉంటే సమస్యల పరిష్కారం మరింత వేగవంతం అవుతుందని తెలిపారు.రెవెన్యూ,అటవీ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించి, భూమి వాస్తవ పరిస్థితి,భూ రికార్డులు,అటవీ సరిహద్దులు,రైతు సాగు ఆధారాలను సమగ్రంగా పరిశీలిస్తారని,సర్వేలో అర్హత ఉన్నట్లు నిర్ధారణ అయిన రైతుల భూములను నిబంధనలకు అనుగుణంగా భూ భారతి పోర్టల్‌లో నమోదు చేసి,వారికి చట్టబద్ధమైన హక్కులు కల్పించే చర్యలు చేపడతామని పెండింగ్‌లోఉన్న ప్రతి కేసును ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ,గడువులోగా పరిష్కరించేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోందని,రైతులు



కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామాలకే వెళ్లి పరిశీలనలు నిర్వహించాలని ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందని,అర్హులైన రైతులకు అన్యాయం జరగకుండా చట్టబద్ధంగా,పారదర్శకం గా వ్యవహరించి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో కట్టుబడి పనిచేస్తోందని కలెక్టర్ తెలిపారు.

## కారుణ్య నియామకాలతో తొమ్మిది మందికి ఉద్యోగాలు

మహబూబ్‌నగర్, జూలై 9 ( ప్రజా జ్యోతి బ్యూరో ): కారుణ్య నియామకాల కింద ఆరుగురు జూనియర్ అసిస్టెంట్లు, ముగ్గురు ఆఫీస్ సబార్డినేట్లకు వివిధ ప్రభుత్వ శాఖల్లో నియామకాలు కల్పిస్తూ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగాన్ని ప్రజాసేవగా భావించి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని నియామకాలు పొందిన వారికి సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా అంకితభా వంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, కలెక్టరేట్ పరిపాలన అధికారి సువర్ణ రాజ్ తదితరులు పాల్గొన్నారు.



## పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆర్డీఓ



**భూపాలపల్లి టౌన్, ప్రజా జ్యోతి, జూలై 9 :** భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌నగర్, రాంనగర్ కాలనీలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం రోజున ఆర్డీఓ హరికృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో పిల్లల హాజరు రిజిస్టర్లు, ప్రభుత్వం ద్వారా సరఫరా అవుతున్న బాలామృతం, కోడిగుడ్ల నాణ్యతను పరిశీలించారు. అలాగే సంబంధిత స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేసి, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న పోషకాహారాన్ని నాణ్యతతో, సమయానికి పంపిణీ చేయాలని అంగన్ వాడీ టీచర్లకు ఆదేశించారు. అలాగే పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద కేంద్రం పేరుతో బోర్డులు లేకపోవడాన్ని గమనించి, బోర్డులు లేని చోట వెంటనే ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో తహశీల్దార్ లక్ష్మి రాజయ్య, జి.పి.ఓ కిరణ్, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## హసన్‌పర్తి ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు కల్పించాలి



**హసన్‌పర్తి, జులై 9(ప్రజాజ్యోతి) :** హసన్‌పర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో తక్షణమే శస్త్రచికిత్స విభాగాన్ని ఏర్పాటు చేసి, ఇరవై నాలుగు గంటల అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని, చింతగట్టు, హసన్‌పర్తి సబ్ సెంటర్ లలో శాశ్వత వైద్యులను నియమించాలని సీపీఎం జిల్లా నాయకుడు జి.రాములు, మండల నాయకుడు మంద సుచందర్ ప్రభుత్వాన్ని కోరారు. పార్టీ కార్యక్రమంలో భాగంగా గురువారం హసన్‌పర్తి ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. ఆసుపత్రిలో పలు మౌలిక వసతుల కొరత ఉందని, ముఖ్యంగా శస్త్రచికిత్స విభాగం లేకపోవడం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని తెలిపారు. గర్భిణులకు శస్త్రచికిత్స అవసరమైన సందర్భాల్లో హసన్‌పర్తి ఆసుపత్రిలో చికిత్స అందక, వరంగల్ ప్రభుత్వ ఆసుపత్రి లేదా ప్రైవేటు ఆసుపత్రులకు తరలించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీనివల్ల అత్యవసర సమయాల్లో ప్రాణాపాయం ఏర్పడటంతో పాటు కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చింతగట్టు, హసన్‌పర్తి సబ్ సెంటర్ లలో వైద్యులు లేకపోవడంతో గ్రామీణ ప్రజలు సాధారణ అనారోగ్య సమస్యలకే దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ రెండు కేంద్రాల్లో వెంటనే వైద్యులను నియమించి నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. హసన్‌పర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో శస్త్రచికిత్స విభాగాన్ని ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమించి ఇరవై నాలుగు గంటల అత్యవసర వైద్య సేవలు అందించాలని, సబ్ సెంటర్ లలో కూడా తక్షణమే వైద్యుల నియామకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఎస్ఐఆర్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫార్ముల పంపిణీ

- అర్హత కలిగిన ప్రతి ఓటర్ ఎస్ఐఆర్ ప్రక్రియలో నమోదు చేసుకోవాలి
- బిఆర్ఎస్ మండల పార్టీ నాయకులు





**రాయపర్తి, జూలై 9, ప్రజాజ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం ఊకల్ గ్రామంలో స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా గురువారం బిఎల్ఓ తో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఎన్యూమరేషన్ ఫార్ముల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న రాయపర్తి మండల మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, పాక్స్ చైర్మన్ కుందూరు రామ్ చంద్రా రెడ్డి, గ్రామ పార్టీ ఇంచార్జి ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి, బూత్ కన్వినర్ లు, పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొని ఫోరం లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి అర్హత కలిగిన ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకొని, అవసరమైన పత్రాలతో ఎన్యూమరేషన్ ఫార్మును పూర్తి చేసి బి ఎల్ ఓ కు అందించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

## సీతక్క జన్మదిన వేడుకలు

- ములుగు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు
- రెవరెండ్ పి.ఎలీషా



**ఏటూరు నాగారం జూలై 09 ప్రజా జ్యోతి :** తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దానసరి అనసూయ (సీతక్క) జన్మదినాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ అధ్యక్షులు రెవరెండ్ పి. ఎలీషా మంత్రి సీతక్క కి బొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా ములుగు జిల్లా అభివృద్ధికి అంకితభావంతో సేవలందిస్తున్న సీతక్కకి దేవుడు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించి మరింత కాలం ప్రజాసేవ చేసే శక్తిని ఇవ్వాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మంత్రి సీతక్క సేవలు తెలంగాణ రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా మరింత విస్తరించాలని ఆకాంక్షిస్తూ, ములుగు జిల్లా క్రైస్తవ సమాజం తరపున జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి దేవుని ఆశీర్వాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్వసాయి తేజ గోపాల్ గంపల శివకుమార్ తో పాటు ఇతర స్నేహితులు, దేవుని సేవకులు పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించబడింది.

# పిఆర్‌టీయుటిఎస్ తోనే సమస్యల పరిష్కారం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి





**రాయపర్తి జూలై 9 ప్రజా జ్యోతి :** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే పి ఆ ర్టి యు. టిఎస్ లక్ష్యమని ఉపాధ్యాయ ఎం ఎల్ సి పింగిలి శ్రీపాల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాయపర్తి మండల కేంద్రంలోని టీఎస్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో గురువారం పిఆర్‌టియుటిఎస్ మెంబర్ షిప్ కార్యక్రమములో ఎం ఎల్‌సి పింగిలి శ్రీపాల్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. 55 ఏళ్ల క్రితం ఆవిర్భవించిన డిఆర్టియు ద్వారా ఉపాధ్యాయుల అనేక సమస్యలు పరిష్కారం అయినాయి అన్నారు. గురుకులాల కామన్ టైం టేబుల్ సాధించామని అన్నారు. గురుకుల సిబ్బంది కి త్వరలో 010 విధానం అమలులోకి వస్తుందని అన్నారు. అలాగే హెల్త్ కార్డ్స్ ఇప్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు టి ఎస్ వరంగల్,హన్మకొండ జిల్లా అధ్యక్షులు రవీందర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరెడ్డి మహేందర్, వరంగల్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కటకం రఘు మండల ప్రధాన కార్యదర్శి గాదె ప్రవీణ్ రెడ్డి,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ప్రసాద్ రావు, ఉగ్గే రమేష్, కర్ర యాకుబ్ రెడ్డి మండల అసోసియేట్ అధ్యక్షులు స్వామి సోషల్ వెల్ఫేర్ ఇంచార్జ్ ప్రిన్సిపాల్ సృజనతోపాటు పీఆర్టీయూ రాష్ట్ర,జిల్లా,మండల బాధ్యులు పాల్గొన్నారు.

## బీ.జే.పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎరుకల గణపతి నియామకం



**భూపాలపల్లి టౌన్, ప్రజా జ్యోతి, జూలై 9 :** ఘట్‌కేసర్‌లో నిర్వహించిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో భూపాలపల్లి జిల్లాకు చెందిన ఎరుకల గణపతిని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించినట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు ప్రకటించారు. తనపై విశ్వాసం ఉంచి రాష్ట్ర నాయకత్వంలోకి తీసుకున్నందుకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటెల రాజేందర్ భూపాలపల్లి నియోజకవర్గ ఇంచార్జి కీర్తిరెడ్డి, సీనియర్ నాయకులు వెన్నంపల్లి పాపయ్య, రాంచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషిధర్ రెడ్డి వీరికి గణపతి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 1999లో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి)లో చేరడం ద్వారా ఆయన ప్రజా జీవితంప్రారంభమైంది. విద్యార్థి సమస్యలు,ఫీజుల భారం, హాస్టల్ సౌకర్యాల కొరత వంటి అంశాలపై నిరంతరం పోరాటం చేశారు. పట్టణ కార్యదర్శి నుంచి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడి వరకు పలు పదవుల్లో పనిచేసి విద్యార్థి ఉద్యమాల్లో విశేష అనుభవం సంపాదించారు. విద్యార్థి ఉద్యమాల ద్వారా ప్రజల్లో గుర్తింపు పొందిన గణపతి అనంతరం ప్రజా రాజకీయాల్లోకి అడుగుపెట్టి భారతీయ జనతా పార్టీ ద్వారా తన సేవలను విస్తరించారు. బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వంటి బాధ్యతలు నిర్వహిస్తూ పార్టీ విస్తరణలో కీలక పాత్రపోషించారు. భూపాలపల్లి ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుని మున్సిపల్ కౌన్సిలర్‌గా భారీ మెజారిటీతో ఎన్నికై, అనంతరం వైస్ చైర్మన్‌గా ఐదేళ్ల పాటు సేవలందించారు. పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి, నీటి సమస్యల పరిష్కారం, పారిశుద్ధ్యం, పేదల సంక్షేమం వంటి అంశాల్లో ఆయన కృషి విశేషంగా నిలిచింది. ఇటీవల జరిగిన భూపాలపల్లి మున్సిపల్ ఎన్నికల్లో తన భార్య ఎరుకల రేణుక కౌన్సిలర్‌గా గెలిపించడం ద్వారా మహిళల రాజకీయ భాగస్వామ్యానికి ప్రోత్సాహం ఇచ్చారు.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో గణపతి చురుకుగా పాల్గొని అనేక నిరసనలు,ఆందోళనలకు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా అరెస్టులు, జైలు జీవితం కూడా అనుభవించారు. అదేవిధంగా విద్యార్థి, జిల్లా, పట్టణ సమస్యలపై పోరాడుతూ ఎన్నో సందర్భాల్లో అరెస్టులకు గురయ్యారు. రాష్ట్ర రాజకీయాల్లో కూడా ఆయన చురుకైన పాత్ర పోషిస్తూ పార్టీ పిలుపు మేరకు, గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ఎన్నికలు, దుబ్బాక, హుజురాబాద్, మునుగోడు ఉపఎన్నికల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం నిరుద్యోగం, రైతు సమస్యలు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు, కాలుష్యం వంటి ప్రధాన సమస్యల పరిష్కారంపై దృష్టి సారించిన గణపతి భూపాలపల్లి జిల్లా అభివృద్ధి కోసం కృషి చేయాలని సంకల్పించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో తన వంతు పాత్ర పోషించేందుకు కట్టుబడి ఉన్నారు.

## ప్రణాళికాబద్ధమైన పాలనతోనే గ్రామాభివృద్ధి సాధ్యం








- గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాలి
- గ్రామాభివృద్ధిలో సర్పంచులదే కీలక పాత్ర
- 16వ ఆర్థిక సంఘం నిధులను నిబంధనల ప్రకారం వినియోగించాలి
- పంచాయతీరాజ్,స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క

**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) :** గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాలని,ప్రణాళికాబద్ధ మైన పాలనతోనే గ్రామ అభివృద్ధి సాధ్యమవు తుందని,గ్రామాభివృద్ధిలో సర్పంచులే కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని, 16వ ఆర్థికసంఘం నిధులను నిబంధనల ప్రకారమే విని యోగించాలని పంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా,స్త్రీ,శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. గ్రామ పంచాయతీలను బలోపేతం చేసి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే లక్ష్యంతో గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని లీలా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ సమగ్రాభివృద్ధి ప్రణాళిక, సర్పంచుల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఇటీవల ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామపాలన, చట్టాలు, విధివిధానాలు, గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పన,నిధుల వినియోగం,గ్రామ పంచాయతీ స్థిరమైన యాక్షన్ ప్లాన్ అమలు,ఆర్థిక నిర్వహణ,పారదర్శక పాలనపై సమగ్ర అవగాహన కల్పించేందుకే ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధులు గ్రామ పంచాయతీ చట్టాలు,తమ అధికారాలు, బాధ్యతలు, విధులు, ఆర్థిక నిబంధనలు, పరిపాలనా విధానాలపై పూర్తి అవగాహనతో పని చేయాలని సూచించారు. గ్రామాభివృద్ధి పనులు ప్రజల అవసరాలనుదృష్టిలో ఉంచు కొని వార్షిక కార్యాచరణ ప్రణాళిక ఆధారంగా చేపట్టాలని,గ్రామసభలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల భాగ స్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని అన్నారు. 16వ ఆర్థిక సంఘం నిధులు అమల్లోకి వస్తున్న తరుణంలో ప్రతి సర్పంచ్ నిధుల మార్గదర్శకాలు, వినియోగ విధానం, అనుమతించబడిన పనులు, వ్యయనియమాలను పూర్తిగా తెలుసుకోవాలని తెలిపారు. గతంలో అవగాహనలోపంతో కొందరు సర్పంచులు నిబంధనలకు విరుద్ధంగా నిధులు వినియోగించి ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. టైడ్ ఫండ్స్, అన్‌టైడ్ ఫండ్స్, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు, గ్రామపంచాయతీల స్వంత ఆదాయ వనరులకు వంటి ప్రతి యొక్క నిధికి ప్రత్యేక నిబంధనలు ఉంటాయని, ఆయా నిబంధనలకు అనుగుణం గానే ఖర్చు చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీల స్వంత ఆదా యాన్ని పెంపొందిం చేందుకు పన్నులు,ఫీజుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి ఆర్థికంగా గ్రామ పంచాయతీలను బలోపేతం చేయాలని తెలిపారు. జిపి - సాప్ ద్వారా గ్రామ అవసరాలను గుర్తించి, త్రాగునీటి సరఫరా,పారి శుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ,వీధి దీపాల నిర్వహణ, హరితహారం, పర్యావరణ పరిరక్షణ, గ్రామ రహదారులు,మురుగు నీటి పారుదల, ప్రజా ఆరోగ్యం, పరిశుభ్రత,మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి పనిని నాణ్యతతో, పారదర్శకంగా, ప్రజలకు జవాబుదారీతనంతో అమలుచేయాలని అన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు ఇతర ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే ప్రత్యేక నిధులకు ప్రత్యేక విధానాలు ఉంటాయని,వాటిని గ్రామ పంచాయతీ నిధులతో కలిపి వినియోగించరాదని స్పష్టం చేశారు. ప్రతినిధిని దాని ఉద్దేశానికి అనుగుణంగా మాత్రమే వినియోగిస్తూ ప్రభుత్వ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు సమన్వయం తో పనిచేస్తేనే ప్రభుత్వ లక్ష్యాలు ప్రజలకు చేరువ అవుతాయని,గ్రామ పంచాయతీలను స్వయం సమృద్ధిదిశగా తీర్చిది ద్దేందుకు ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యతాయుతంగా పని చేయాలని స్పష్టం చేశారు. అంతకు ముందు అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు,స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్ ములుగు జిల్లా ప్రత్యేక అధికారి సురేష్ బాబు సర్పంచులకు శిక్షణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి,వైస్ చైర్మన్ సారంగం,డిపిఓ వెంకయ్య, పంచాయతీరాజ్ ఈఈ అజయ్ కుమార్,ఎంపిడిఓ లు,ఎంపిఓలు,అన్ని గ్రామాల సర్పంచులు,కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు,మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల దత్తత కార్యక్రమం





**హసన్‌పర్తి, జులై 9(ప్రజాజ్యోతి) :** హసన్‌పర్తి మండలంలోని వంగపహాడ్ గ్రామంలో ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను దత్తత తీసుకునే కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధికి తోడ్పాటందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు అవసరమైన విద్యతో పాటు కళలు, ఆరోగ్యం, విజ్ఞాన ప్రయోగశాల, గణన యంత్రాల వినియోగం, ఆంగ్ల భాషా మాట్లాడే నైపుణ్యం, వ్యక్తిత్వ వికాస శిక్షణ వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపడం వారి భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఎర్త్ ఫౌండేషన్ డైరెక్టర్ వెన్నెల మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వారి సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన సేవలను నిరంతరం అందిస్తామని తెలిపారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత మాట్లాడుతూ పాఠశాలను దత్తత తీసుకుని విద్యార్థుల అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం సంతోషకరమని అన్నారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆటవస్తువులు అందించడంతో పాటు స్వచ్ఛంద సేవకుడిని నియమించడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక పూర్వ విద్యా తరగతిని మండల విద్యాధికారి ప్రారంభించి చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మన ఊరు--మన బడి నియోజకవర్గ సమన్వయకర్త దోమకుమార్, ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, సంస్థ సమన్వయకర్త రాజు, నృత్య శిక్షకుడు కుమార్, స్వచ్ఛంద సేవకురాలు శృతి, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ





**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూలై 09 (ప్రజా జ్యోతి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జె.జీవన్ కుమార్ ను గురువారం రోజు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న వివిధ కోర్టు కేసుల పురోగతిపై చర్చించారు.

కేసులు త్వరిత గతిన పరిష్కారానికి, న్యాయ ప్రక్రియ మరింత వేగవంతం కావడానికి జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి జి.అఖిల తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

తన జన్మదినం పురస్కరించుకొని మొక్కను నాటిన మంత్రి సీతక్క




**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) :** మంత్రి దనసరి అనసూయ సీతక్క తన జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం ములుగు మున్సిపాలిటీ పరిధిలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూబు భాగస్వాములు కావాలని, ప్రతి శుభకార్యాన్ని ఒక మొక్క నాటడంతో ప్రారంభించే అలవాటు పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. నేటి అవసరాలకే కాకుండా భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అన్నారు. జన్మదినాలు,వివాహ వార్షికోత్సవాలు వంటి ప్రత్యేక సందర్భాల్లోమొక్కలు నాటడం ద్వారా సమాజానికి స్ఫూర్తినివ్వాలని మంత్రి సీతక్క సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లాఅదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు,మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, మున్సిపల్ చైర్మన్ చింత నిప్పుల చంద్రకళ బిక్షపతి, మహిళలు, స్థానిక ప్రజాప్రతి నిధులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**రాయపర్తి జూలై 9 ప్రజా జ్యోతి :** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం నాంచారి మడూరు గ్రామ సర్పంచ్ రమేష్ వివాహ వేడుకలో గురువారం పాల్గొన్న ఎమ్మెల్ ఏ యశస్విని రెడ్డి. తొర్రూరు మండలం నాంచారి మడూరు గ్రామ సర్పంచ్ రమేష్ వివాహ మహోత్సవం ఘనంగా నిర్వహించబడగా, ఈ కార్యక్రమంలో పాలకుర్తి శాసనసభ్యులు యశస్విని రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో, సుఖ శాంతులతో నిండిపోవాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ వివాహ వేడుకలో గ్రామ సర్పంచ్ గారే సయేంద్ర బిక్షపతి,మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, మాజీ టీపీసీసీ కార్యదర్శి బిల్ల సుధీర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, సురేందర్ రావు,ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు, అభిమానులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## మృతుడికి నివాళులు అర్పించిన బీఆర్ఎస్ నేతలు



**దేవరుప్పుల జులై 9, (ప్రజాజ్యోతి) :** దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన బుర్ర సత్తయ్య అనారోగ్య కారణంతో గురువారం ఉదయం తెల్లవారు జామున మృతి చెందారు. మండల బీఆర్ఎస్ నేతలు వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం కల్పించారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్, కామారెడ్డి గూడెం సర్పంచ్ చింత రవి, సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏల సుందర్, మండల నాయకులు జోగు సోమనర్సయ్య, కారుపోతుల భిక్షపతి, తోటకురి కిష్టయ్య, దశరథ, గోలి చిన్నఉప్పల్ రెడ్డి, నీలారపు వేణు, రాంచెందర్, పలుసం నర్సింహులు, నర్రా సోమశేఖర్, జక్కుల కుమార్, మహేష్, తదితరులున్నారు.

## 26,వ వార్డు లో సమస్యలు పరిష్కారం చేయండి

### కౌన్సిలర్ చీమల రాజు

భువనగిరి,జులై 9(ప్రజాజ్యోతి): భువనగిరి మున్సిపాలిటీ,పరిధిలో ని 26వ,వార్డులో ఉన్న ప్రధాన సమస్యలను,పరిష్కారం చేయాలనీ,బి ఆర్ ఎస్ పార్టీ వార్డు,కౌన్సిలర్ చీమల



రాజు మున్సిపాలిటీ కమిషనర్ ని కోరగా వెంటనే స్పందించిన కమిషనర్ చంద్రప్రకాష్ రెడ్డి క్షేత్ర స్థాయి లో వార్డు లో పర్యటించడం జరిగింది.ఈ సందర్భంగా వార్డు లో ఉన్న ప్రధాన సమస్యలుగా ఉన్నటువంటి డ్రైనేజీ వ్యవస్థ,రోడ్లు,స్ట్రీట్ లైట్లు,నీటి సమస్యలు,లో వోల్టేజ్ సమస్యలు మరియు,మినీ వాటర్ ట్యాంక్ మరమ్మ త్తులు,పార్క్ అభివృద్ధి గురించి కౌన్సిలర్ కమిషనర్ దృష్టికి తీసుకవెళ్లడం జరిగింది,ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతు ఖచ్చితంగా వార్డు లో సమస్య లపై ప్రత్యేక ద్రుష్టి సారించి అన్ని పనులు జరిగేటట్లు చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమం లో కమిషనర్ వెంట సానిటరీ ఇన్స్పెక్టర్ జాఫర్ మున్సి పాలిటీ సిబ్బంది వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నార్కట్ పల్లి, రోడ్డు వెడల్పు పనులను వెంటనే పూర్తి చేయాలి

- కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనైనా రోడ్డు పనులు పూర్తయ్యేట్లేనా.....
- రోడ్డు భవనాల శాఖ మంత్రి సొంత మండలం పై పట్టింపు లేదా....
- 10న జరగబోవు బందుకు దుకాణా దారులు వ్యాపారస్తులు సహకరించాలి

నార్కట్ పల్లి, జూలై 9 ( ప్రజా జ్యోతి): నార్కట్ పల్లి రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని పోలీస్ స్టేషన్ కాంప్లెక్స్ లో ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. గత వారం రోజుల నుండి వివిధ కార్యక్రమాలు చేస్తున్న.. కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నీరు ఎక్కినట్లు వ్యవహరిస్తున్నట్లు రోడ్లు భవనముల శాఖ మంత్రి సొంతం



మండలంపై కనీసం మాట కూడా ఇవ్వకపోవడం సిగ్గుచేటు అని జేఏసీ నాయకులు చిరుమర్తి యాదయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఇప్పటికీ నలుగురు ప్రాణాలు కోల్పోయారని, చాలామంది కాలు చేతులు విరిగిపోయి, ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్న కాంగ్రెస్ పాలకులకుఏ మాత్రం మాత్రం చిత్తశుద్ధి లేకుండా వివరిస్తున్నారని జెఎసి నాయకులు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు దోసపాటి విష్ణు, బోయపల్లి శ్రీను, మేడ బోయిన శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ భాస్కరరావు, కొప్పు శ్రవణ్, ఎండి నజీర్, లింగాల యాదయ్య, వడ్డేపల్లి నాగరాజు, మారీదు శివకృష్ణ, పుల్లెంల మహేష్, పుల్లెంల వెంకన్న, చింత సైదులు, నడింపల్లి మహేష్, నరేష్, మెడబోయిన రాంబాబు, ఎండి వాజిద్, ఎస్ కే జానీ, మర్రి రామలింగం, మాంద్ర గోపి, మిరియాల రాములు, గద్దపాటి స్వామి, నడింపల్లి శ్రవణ్, పాలకుర్తి రమేష్, కోరి శంకర్, ముద్ద నరసింహ, వడ్డ గోని రామలింగం, చెన్నారపు సత్తయ్య, బొబ్బలి మల్లేష్, మేడ బోయిన అశోక్, రామలింగం, సూర్యచంద్ర పాల్గొన్నారు.

## నాగారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం

నాగారం జూలై 09 ప్రజా జ్యోతి. నాగారం మండలం నాగారం బంగ్లా గ్రామంలో నాగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట బిక్షం ఆధ్వర్యంలో తుంగతుర్తి శాసనసభ్యులు తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ కమిటీ సభ్యులుగా ఎన్నిక పట్ల హర్షం



వ్యక్తం చేశారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తుంగతుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటినుండి తుంగతుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నారని అని ఆయన అన్నారు. గత ప్రభుత్వం అభివృద్ధి పనులను విస్మరిస్తే తిరిగి నియోజకవర్గాన్ని అభివృద్ధి పదంలో నిత్యం శ్రమిస్తున్నారని ఆయన అన్నారు. నాగారం మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేక ప్రజలు అధికారులు ఇబ్బందులు పడుతుంటే తక్షణమే స్పందించి సీఎంతో మాట్లాడి సొంత భవనాలు మంజూరు చేయించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భయ్యం వెంకన్న, ఎలమ కంటి సోమయ్య, బెల్లి సైదులు, సర్పంచులు వంగూరి దామోదర్, బుక్క శీను, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రమేష్, ఉపసర్పంచ్లు భాను ప్రకాష్, మంజుల, యాకూబ్, గంగుల సైదులు, పరుశరాములు, లింగారెడ్డి, వీరాచారి, హుస్సేన్, కుమారస్వామి, వీరన్న, యాక స్వామి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు

# గొట్టిపర్తిలో విషాదం.. భార్యను హత్య చేసి భర్త ఆత్మహత్య

### కుటుంబ కలహాల నేపథ్యంలో దారుణ ఘటన.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

తుంగతుర్తి, జూలై 9 (ప్రజా జ్యోతి): తుంగతుర్తి మండలం గొట్టిపర్తి గ్రామంలో కుటుంబ కలహాలు విషాదానికి



దారితీశాయి. భార్యను హత్య చేసిన అనంతరం భర్త ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొట్టిపర్తి గ్రామానికి చెందిన కోట సత్యనారాయణ (66), ఆయన భార్య కనకలక్ష్మి (63) కొంతకాలంగా కుటుంబ వ్యవహారాల విషయంలో తరచూ గొడవపడు తున్నట్లు సమాచారం. అల్లం, ఎల్లిగడ్డ వ్యాపారం ద్వారా సంపాదించిన డబ్బును కుమారులకు ఇస్తున్నారని భావించిన సత్యనారాయణ ఈ విషయమై భార్యతో తరచూ వాగ్వాదానికి దిగేవాడని పోలీసులు తెలిపారు. భర్త వేధింపులు భరించలేక కనకలక్ష్మి కొంతకాలం పెద్ద కుమారుడి వద్దకు వెళ్లి ఉండగా, ఇటీవల పెద్దలు పంచాయతీ చేసి ఆమెను తిరిగి ఇంటికి తీసుకొచ్చినట్లు తెలిసింది. అయినప్పటికీ దంపతుల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. బుధవారం రాత్రి మరోసారి ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ విషయాన్ని కనకలక్ష్మి తన కుమారులకు ఫోన్ ద్వారా తెలియజేయగా, వారు కాన్ఫరెన్స్ కాల్‌లో మాట్లాడుతూ తాము వచ్చేవరకు గొడవ పడవద్దని సూచించినట్లు సమాచారం. అయితే తెల్లవారుజామున



సత్యనారాయణ ఇనుప రాడుతో కనకలక్ష్మి తలపై దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఇంట్లో ఒక లిఖితపూర్వక వాంగ్మూలం రాసి, ఇంట్లో ఉన్న సుమారు రూ.4.90 లక్షల అప్పు పత్రాలు, నగదు ఇద్దరు కుమారులు సమానంగా పంచుకోవాలని, ఎలాంటి గొడవలు పెట్టుకోవద్దని పేర్కొన్నాడు. ఆ తర్వాత ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం విషయం గుర్తించిన స్థానికులు వారి కుమారులకు సమాచారం అందించారు. వారు గ్రామానికి చేరుకుని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో తుంగతుర్తి సీఐ ఉపేందర్‌రావు, ఎస్సై క్రాంతి కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ కూడా ఘటనాస్థలాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రాథమిక విచారణలో కుటుంబ వివాదాలే ఈ విషాదానికి కారణమై ఉండొచ్చని పోలీసులు వెల్లడించారు.

# తుంగతుర్తి అభివృద్ధికి ఎమ్మెల్యే మందుల సామెల్ అహర్నిశలు కృషి

**ఎస్సీ సంక్షేమ కమిటీ సభ్యుడిగా నియామకంపై కాంగ్రెస్ నాయకుల హర్షం**

**జూనియర్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ స్కూల్, మున్సిపల్ అభివృద్ధి పనులతో నియోజకవర్గానికి కొత్త దిశ**

**రైతు భరోసా నిధుల విడుదలకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు**

తుంగతుర్తి(తిరుమలగిరి), జూలై 9 (ప్రజా జ్యోతి): తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే మందుల సామేలు నిరంతరం కృషి చేస్తున్నారని తిరుమలగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుంకరి జనార్ధన్ అన్నారు. ఎమ్మెల్యే సామేలు తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ కమిటీ



సభ్యుడిగా నియమితులైన సందర్భంగా గురువారం తిరుమలగిరి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన పత్రికా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుంకరి జనార్ధన్ మాట్లాడుతూ... తుంగతుర్తి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు ప్రతి అర్హత గల కుటుంబానికి చేరేలా ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు.విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. తిరుమల గిరి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు, తొండాల గ్రామపంచాయతీ పరిధిలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం, రూ.15 కోట్లతో తిరుమలగిరి మున్సిపల్ అభివృద్ధి పనులు చేపట్టడం వంటి కీలక కార్యక్రమాలు ఎమ్మెల్యే కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఏకకాలంలో రైతు భరోసా నిధులను విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్సోజు స్రవంతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మూల అశోక్ రెడ్డి, తిరుమల గిరి టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పేరాల వీరేష్, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్సోజు నరేష్,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జిమ్మిలాల్, కౌన్సిలర్లు తిరుమణి యాదగిరి, బత్తుల శ్రీనివాస్, కన్నెబోయిన మల్లయ్య, మాజీ ఎంపీపీ జేరిపోతుల శోభారాణి యాదగిరి, ప్రెస్ కన్వీనర్ కందుకూరు లక్ష్మయ్య, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పేరాల నరేష్, జలాల్పురం సర్పంచ్ బెట్టం జ్ఞానేశ్వరి రాజు, వెలిశాల సర్పంచ్ కుంభం మంజుల సతీష్ గౌడ్, మర్రికుంట తండా సర్పంచ్ బానోతు రోజా లక్ష్మణ్, కోక్యానాయక్ తండా సర్పంచ్ గుగులోతు ప్రేమ్ ప్రసాద్, సిద్ధి సముద్రం సర్పంచ్ ధరావత్ సుజాత రాజశేఖర్, తాటిపాముల గ్రామ శాఖ అధ్యక్షుడు నాయిని కృష్ణ యాదవ్, మామిడాల గ్రామ శాఖ అధ్యక్షుడు గజ్జి లింగయ్యతో పాటు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డి ఎస్ ఆర్ గ్రూపులో నూతన విత్తనాల ఆవిష్కరణ

### రైతుల ఆర్థిక అభివృద్ధి డి ఎస్ ఆర్ గ్రూప్ ధ్యేయం –డి ఎస్ ఆర్ గ్రూప్ ఎండి డాక్టర్ తాళ్లపాటి సుధాకర్

చండూరు జులై 9 (ప్రజా జ్యోతి): మనదేశంలో వ్యయసాయం మీద ఆధారపడి జీవిస్తున్న రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడం డి ఎస్ ఆర్



గ్రూపు ధ్యేయం అని ఆ గ్రూప్ ఎండి డాక్టర్ తాళ్లపాటి సుధాకర్ అన్నారు.

డి ఎస్ ఆర్ గ్రూపు లో 4 డివిజన్లు ఉండగా అందులో మిలానో సీడ్స్ అను డివిజన్ నుండి నూతన మొక్కజొన్న విత్తనము స్మార్ట్ ఎం ఎస్ 7009 అను విత్తనం హైదరాబాద్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిలానో సీడ్స్ లో స్మార్ట్ ఎంఎస్7009 అను విత్తనం రైతులకు అధిక దిగుబడి నిస్తూ ఈ ఖరీఫ్ మరియు రబీలో కూడా వేయవచ్చని ముఖ్యంగా తెలంగాణలో వర్షాధార పంటలు ఎక్కువగా వేస్తారు. నీరు తక్కువ ఉండటం వల్ల ఇలాంటి ఆరుతడి పంటలను వేసి రైతులు అధిక లాభం పొందే విధంగా వ్యవసాయం చేయాలంటూ ఆయన సూచించారు. మొక్కజొన్న యొక్క పంట కాల పరిమితి 115 రోజుల నుండి 140 రోజులు మాత్రమే ఉంటుంది. కేవలం 140 రోజుల లోపు మాత్రమే అధిక లాభం పొందే అవకాశం ఉన్న పంటగా ఆయన సూచించారు. రైతులకు డి ఎస్ ఆర్ గ్రూపులో పత్తి మరియు వరి కి కూడా తక్కువ రేటుతో మందులు లభిస్తాయని ఆయన సూచించారు. కార్యక్రమానికి పాల్గొన్న మార్కెటింగ్ జనరల్ మేనేజర్ అనిల్. ఏ ఎస్ ఎం జలంధర్ మరియు రైతులు డి ఎస్ ఆర్ గ్రూప్ ఎంప్లాయిస్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన బి లచ్చిరెడ్డి

మోతె జులై 9 ( ప్రజా జ్యోతి ): తన ఎస్సె గా మోతె పోలీస్ స్టేషన్‌లో బి. లచ్చిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చట్టాన్ని కాపాడడమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సత్వరమే స్పందించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, శాంతిభద్రతల పరిరక్షణకు అందరితో కలిసి పనిచేస్తానని తెలిపారు.



## సర్ అంశంపై నిర్వహిం చిన జూమ్ సమావేశంలో పాల్గొన్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

భువనగిరి,జులై 9(ప్రజాజ్యోతి): సర్ (స్పెషల్ )ఇంటెన్సివ్ (రివిజన్ ),అంశంపై నిర్వహించిన జూమ్ మీటింగ్ లో భువనగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సమావేశంలో ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి



నటరాజన్ టీపీసీసీ అధ్యక్షులు,బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఏఐసీసీ కార్యదర్శి,సచిన్ సావంత్ హాజరై పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు,పార్లమెంట్ కోఆర్డినేటర్లు,అసెంబ్లీ కోఆర్డినేటర్లు,అసెంబ్లీ ఈ ఆర్ ఓ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.సర్ అంశంపై పార్టీ చేపట్టాల్సిన కార్యాచరణ,సమన్వయం,ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు,భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించి పలు కీలక సూచనలు చేశారు.

## చేనేత అభివృద్ధికి కృషి చేస్తాం

– చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు కొంగరి జంగయ్య

భూదాన్ పోచంపల్లి, జూలై 9 (ప్రజాజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని రేవనపల్లి చేనేత కార్మిక సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికై, గురువారం ప్రమాణ స్వీకారం చేసింది. సంఘం అధ్యక్షుడిగా కొంగరి జంగయ్య, ఉపాధ్యక్షుడిగా మనం వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా కొంగరి వెంకటేష్, కోశాధికా



రిగా చెల్లిగారి గురుస్వామి ఎన్నికయ్యారు. సభ్యులుగా గుండు కృష్ణ, గంజి సుదర్శన్, రవ లక్ష్మణ్, సూరపల్లి లక్ష్మమ్మ, ఉద్యాన జయమ్మలను ఎన్నుకున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మూడో వార్డు కౌన్సిలర్ రావుల జంగయ్య, కాంగ్రెస్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు మర్రి నరసింహారెడ్డి, మాజీ కౌన్సిలర్ గుండు మధు ముఖ్య అతిథులుగా హాజరై నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అధికారి మురళీ మనోహర్ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సంఘం బలోపేతంతో పాటు చేనేత కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేస్తామని నూతన కార్యవర్గం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కడవేరు ఎల్లప్ప, రుద్ర యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల రవాణా కోసం ఆటో ఏర్పాటు చేసిన ఆరాధ్య ఫౌండేషన్

నాగారం జూలై 09 ప్రజా జ్యోతి: నాగారం మండలం మాచి రెడ్డిపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక



పాఠశాల మాత్రమే ఉండడంతో విద్యార్థి విద్యార్థులు సమీపంలోని ఈటూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సి వస్తుంది. ప్రతిరోజు విద్యార్థులు కాలినడకన నడవాల్సి వస్తుంది ఈ సమస్యను గుర్తించిన ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ తాడోజు వాణి శ్రీకాంత్ రాజ్ పుట్టినరోజు సందర్భంగా గురువారం ఈటూరు గ్రామంలో గ్రామపంచాయతీ ఆవరణంలో సర్పంచ్ వంగూరి దామోదర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో విద్యార్థుల రవాణా కోసం ఆటోను ఏర్పాటు చేయడంతో పాటు రవాణా ఖర్చుల నిమిత్తం ఒక లక్ష రూపాయలు విరాళాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో నాగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట బిక్షం, ఎంఈఓ ప్రభాకర్, ఉప సర్పంచ్ మంజుల, కార్యదర్శి బిమ్లా, రమేష్, గంట సోమిరెడ్డి, రామచంద్రు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నేరడిగుంటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనుల పరిశీలన



**అందోల్ (ప్రజాజ్యోతి):** అందోల్ మండలం నేరడిగుంట గ్రామంలో నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పనులను మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం. జగన్మోహన్ రెడ్డి గురువారం పరిశీలించారు. మాజీ సర్పంచ్ మైలు గుండ్ల వీరమల్లప్ప, పట్లోళ్ల రాజు పటేల్‌తో కలిసి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ



సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక చొరవతో నేరడిగుంట గ్రామానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు కావడం గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల అదృష్టమని అన్నారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికను నెరవేర్చిన మంత్రి దామోదర రాజనర్సింహ సేవలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు. గ్రామానికి మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం వల్ల ప్రజలు ఇక దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహకు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మైలు గుండ్ల వీరమల్లప్ప, పట్లోళ్ల రాజు పటేల్, సోషల్ వర్కర్ శ్రీధర్ రెడ్డి, కిష్టయ్య, శరణప్ప, కుమ్మరి సంగమేశ్, ఆశయ్య, మని, మధు, డప్పు శంకరయ్య, భాగయ్య, మల్లేశం, కోదండ నర్సింలు, మురుషత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రోళ్ల జోగినాథ్, వరప్రసాద్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మాణిక్ రావుకు శుభాకాంక్షలు వెల్లువ

☆ శుభాకాంక్షలు తెలియజేసిన బిఆర్ఎస్ జహీరాబాద్ నియోజకవర్గ నాయకులు





**జహీరాబాద్, జూలై 09(ప్రజాజ్యోతి)** శాసన సభ్యులు కొనింటీ మాణిక్ రావు జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిఅర్ఎస్ నాయకులు అభిమానులు కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజి డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్ పాల్గొన్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ జనహృదయ నేత జహీరాబాద్ నియోజవర్గ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే మాణిక్ రావు అష్టైశ్వర్య ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో కల కాలం జీవించాలని, ప్రజలకు మరిన్ని సేవలను అందించాలని ఆకంక్షిచి, కేక్ కట్ చేసి నాయకులు ఒకరి ఒకరు కేక్ తినిపించి ఎమ్మెల్యే కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆత్మ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ లు అల్లాడి నర్సింలు, తంజిం, మాజి కేతకీ సంగమేశ్వర ఆలయ చైర్మన్ వెంకటేశం, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, ఝరసంగం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, మాజి ఎంపీపీ బొగ్గుల సంగమేశ్వర్ నియోజకవర్గ ఎస్సి సెల్ అధ్యక్షులు బండి మోహన్ కౌన్సిలర్లు మహిపాల్, దీపక్, జాకీర్, విశ్వేశ్వర్, ప్రవీణ్, శంకర్ రెడ్డి, మాజి కౌన్సిలర్ లు, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపీటీసీ లు,.గ్రామపార్టీ అధ్యక్షులు, యువ నాయకులు, విద్యార్థి నాయకులు, బిఅర్ఎస్ కుటుంబ సభ్యులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణను పారదర్శకంగా చేపట్టాలి

☆ జహీరాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి



**జహీరాబాద్, జూలై 09( ప్రజా జ్యోతి న్యూస్ )** జహీరాబాద్ మండలంలోని గోవింద్ పూర్ గ్రామంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై గురువారం ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పట్లోళ్ళ నర్సింహారెడ్డి పాల్గొని మాట్లాడారు. బూత్ స్థాయి ఏజెంట్లు బీఎల్ఏ లు క్షేత్రస్థాయిలో అత్యంత అప్రమత్తంగా ఉంటూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని ఆయన సూచించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యే లా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, 2002 ఓటర్ల డేటా మ్యాపింగ్ మరియు సవరణలో కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సిడిసి డైరెక్టర్ మల్లారెడ్డి,సొసైటీ వైస్ చైర్మన్ ఇమామ్ పటేల్, సీనియర్ నాయకులు నర్సింహులు, జుబేర్ పటేల్, దిలీప్ కుమార్, గోపాల్, అంజన్న, వీరన్న బీఎల్వోలు, బీఎల్ఏలతో పాటు పలువురు గ్రామ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనహృదయ నేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన బిఆర్ఎస్ కోహిర్ మండల్ నాయకులు



**జహీరాబాద్, జూలై 09 (ప్రజా జ్యోతి న్యూస్)** శాసనసభ్యులు కొనింటీ మాణిక్ రావు జన్మదినం సందర్భంగా బడంపేట రాచన్న స్వామి దేవస్థానంలో మాణిక్యరావు పుట్టిన రోజు సందర్భంగా ఆలయంలో అభిషేకం చేయించి వారు నిండు నూరేళ్లు ఆరోగ్యంతో ఉండాలని మండల నాయకులు బడంపేట నాయకులు, అభిమానులు కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోహిర్ మండల్ బిఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ నర్సింలు పాల్గొన్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ జనహృదయ నేత జహీరాబాద్ నియోజవర్గ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే మాణిక్ రావు అష్టైశ్వర్య ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో కలకాలం జీవించాలని ,ప్రజలకు మరిన్ని సేవలను అందించాలని ఆకంక్షిచి, కేక్ కట్ చేసి నాయకులు ఒకరి ఒకరు కేక్ తినిపించి ఎమ్మెల్యేకి జన్మదిన శు భా కాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోహిర్ మండల్ పార్టీ అధ్యక్షులు నర్సింలు మాజీ కోయిల్ సర్పంచ్ ఖలీల్ మాజీ జెడ్పిటిసి అరవింద్ రెడ్డి సోదరుడు సాయి ప్రణీత్ రెడ్డి కోహిర్ సందీప్ కుమార్ బిలాల్పూర్ ఉపసర్పంచ్ గోపాల్ కోహిర్ మండల్ కౌన్సిలర్ ఎంపిటిసి సంపత్ కుమార్ బడంపేట గ్రామ అధ్యక్షులు రఘుపతి రెడ్డి రాచమల్ల వీరన్న బడం పేట గ్రామ ఉపసర్పంచ్ విజయ్ కుమార్ మాజీ టెంపుల్ చైర్మన్ శివరాజ్ స్వామి బడం పేట 5వ వార్డ్ నెంబర్ బ్యాగరి రమేష్ బిఆర్ఎస్ నాయకులు గడ్డమీది శ్రీనివాస్ యువ నాయకులు, విద్యార్థి నాయకులు, బిఅర్ఎస్ కుటుంబసభ్యులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పాల్వనూర్‌లో నూతన వాటర్ ట్యాంక్ శంకుస్థాపన

**హత్నూర 9 జులై (ప్రజాజ్యోతి)** మండల పరిధిలో ని పల్వనూర్ గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా నీటి ఎద్దడి మూలము శితిలావస్థలో పురాతన వాటర్ ట్యాంక్ ఉ ండడంవలన నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ముందుకోచ్చిన ఆపటోరియా యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపిన గ్రామ సర్పంచ్ ట్యాంక్ నిర్మాణం పూర్తయితే గ్రామంలో నీటి సమాష్య తీరినట్టే గ్రామ సర్పంచ్ బంటు రాయుడు మాట్లాడుతూ స్కూల్ ఆవరణలో 60వేల లీటర్ల వాటర్ ట్యాంక్ నిర్మాణానికి గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో నేడు శంకుస్థాపన చేయడం జరిగింది.గత కొన్ని సంవత్సరాలనుండి పాత వాటర్ ట్యాంక్ శితిలావస్థకు చేరడంతో గ్రామంలో నీటి ఎద్దడి నెలకొన్నదని,సమష్యను పరిష్కరించాలని ఆపటోరియా యాజమాన్యానికి విన్నవించగా కంపెనీ యాజమాన్యం ముందుకు రావడంతో వారి సహకారంతో 60లీటర్ల వాటర్ ట్యాంక్ నిర్మాణానికి నేడు శంకుస్థాపన చేశామని,నిర్మాణం పూర్తి అయ్యాక గ్రామంలో నీటి సమస్య తీరుతుందని ఆశ భావం వ్యక్తం చేశారు.అడగగానె స్పందించి, నిర్మాణానికి సహకరించిన ఆపటోరియా యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.కారిక్రమంలో ఉప సర్పంచ్ పెట్లోళ్ల అన్నపూర్ణ పంచాయతీ వార్డు మెంబర్లు, ఆపటోరియా ఎచ్ ఆర్ శోభన్ బాబు గ్రామ పెద్దలు కుల్పగూరి లక్ష్మణ్, బంటు మల్లేశం దశరత్, స్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

☆ ఈఎస్ఐ ఆసుపత్రులు, డిస్పెన్సరీల్లో అన్ని సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చర్యలు

☆ రాష్ట్ర మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, దామోదర్ రాజనర్సింహ





**సంగారెడ్డి ప్రజా జ్యోతి జూలై 9:--** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన, ఆధునిక వైద్య సేవలను ఉచితంగా అందించడంతో పాటు పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు సత్వర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ఈఎస్ఐ వైద్య సేవలను విస్తరిస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. గురువారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈఎస్ఐ డిస్పెన్సరీని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్‌తో కలిసి మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా అన్ని



మౌలిక వసతులు, వైద్య సదుపాయాలను కల్పిస్తూ ఈఎస్ఐ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. సంగారెడ్డి పారిశ్రామిక ప్రాంతంలో పనిచేసే కార్మికులు వైద్య చికిత్స కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే అన్ని రకాల వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో సంగారెడ్డిలో ఈఎస్ఐ డిస్పెన్సరీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.రాష్ట్రంలో సుమారు 80 లక్షల కుటుంబాలు ఈఎస్ఐ వైద్య సేవలపై ఆధారపడుతున్నాయని, ఈఎస్ఐ ఆసుపత్రులు, డిస్పెన్సరీల్లో అవసరమైన అన్ని సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ఇటీవల ఆర్‌సీ పురం ఈఎస్ఐ ఆసుపత్రిని సందర్శించిన సందర్భంగా కొన్ని ప్రత్యేక వైద్య సేవలు లేకపోవడంతో రోగులు సనత్‌నగర్‌కు వెళ్తున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. వచ్చే ఆరు నెలల్లో అక్కడ అన్ని ప్రత్యేక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి, కార్మికులు స్థానికంగానే పూర్తి స్థాయి చికిత్స పొందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. త్వరలో ఆర్‌సీ పురం ఈఎస్ఐ ఆసుపత్రిలో 20 పడకల డయాలసిస్ యూనిట్‌ను ఏర్పాటు చేయడంతో పాటు వచ్చే ఏడాదిలో కార్డియాలజి సెంటర్‌ను కూడా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. శంషాబాద్, రామగుండం, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రుల మంజూరుకు కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకే కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థిక భారం మోసుకోవద్దని, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంటూ కార్మికులు ఈఎస్ఐ డిస్పెన్సరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లా పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటికే ఏడు ఈఎస్ఐ డిస్పెన్సరీలు ఉండగా, సంగారెడ్డిలో ఎనిమిదో డిస్పెన్సరీని ప్రారంభించడం సంతోషకరమన్నారు.రూ.200 కోట్లతో సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తున్నామని



తెలిపారు. జహీరాబాద్, నారాయణఖేడ్, సదాశివపేట, ఆందోల్, జోగిపేట ప్రాంతాల ప్రజలకు కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, ఈఎన్‌టీ, క్యాన్సర్ చికిత్స, ట్రామా కేర్, నేత్ర వైద్య సేవలు వంటి సూపర్ స్పెషాలిటీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పీజీ సీట్లను కూడా కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని 104 ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకల సంఖ్యను పెంచుతూ వైద్య సేవలను మరింత విస్తరిస్తున్నామని తెలిపారు. ప్రజలకు అన్ని రకాల ఆధునిక వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. జిల్లాలో కార్మికుల వైద్య సేవల విస్తరణకు ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్ మాట్లాడుతూ, సంగారెడ్డి రాష్ట్రంలో



ప్రధాన పారిశ్రామిక జిల్లాగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో వేలాది మంది కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం మరింత వైద్య మౌలిక వసతులను కల్పించాలని కోరారు. ఈఎస్ఐ వైద్య సేవల విస్తరణ కార్మికులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఈఎస్ఐ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. గౌతమ్ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఎస్ఐ కార్మికుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తూ, వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కట్టుబడి పనిచేస్తున్న డాక్టర్ ఎన్. గౌతమ్ గారి సేవలను మంత్రివర్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు వనిత సంతోష్, అంజమ్మ సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఈఎస్ఐ జాయింట్ డైరెక్టర్ డా. గౌతమ్, వైద్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## 'సర్' విజయవంతానికి గ్రామాల్లో ముమ్మర ప్రచారం

☆ నేరడిగుంటలో ఇంటింటికీ అవగాహన

☆ ఓటరు జాబితా సవరణలో ప్రజల భాగస్వామ్యానికి పిలుపు



**అందోల్ (ప్రజాజ్యోతి):** రాష్ట్రంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గ్రామీణ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అందోల్ మండలం నేరడిగుంట గ్రామంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మక్త జగన్మోహన్ రెడ్డి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన, గ్రామ కార్యదర్శి వినీత్ కుమార్‌తో కలిసి నమోదవుతున్న దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు. బతుకుదెరువు కోసం పట్టణాలకు వెళ్లిన వారు, ఉద్యోగులు, ఉన్నత విద్య కోసం ఇతర ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులు, గ్రామం వెలుపల నివసిస్తున్న అర్హులందరూ తమ ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డుతో గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చి సంబంధిత వార్డు ఇన్‌చార్జిని సంప్రదించి ఫారాలను తప్పనిసరిగా నింపాలని ఆయన పిలుపునిచ్చారు.ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రజాస్వామ్యానికి ఎంతో కీలకమని పేర్కొన్న జగన్మోహన్ రెడ్డి, ప్రతి అర్హుడి పేరు జాబితాలో ఉ ండేలా ప్రజలు చొరవ చూపాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు సమన్వయంతో పనిచేస్తే సర్ కార్యక్రమం విజయవంతమవుతుందని అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా నేరడిగుంట గ్రామానికి ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన గ్రామ కార్యదర్శి వినీత్ కుమార్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మైలగుండ్ల వీరమల్లప్ప, పట్లోళ్ల వైద్యనాథ్, దొడ్డుల కిష్టయ్య, సోషల్ వర్కర్లు శ్రీధర్ రెడ్డి, శరణప్ప, బేగరి కిష్టయ్య, కుమ్మరి సంగమేశ్, ఆశయ్య, మనీ, ముర్షిత్, డప్పు శంకర్, ఆందోల్ మధు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రోళ్ల జోగినాథ్, వరప్రసాద్, పండరి, మైలగుండ్ల ప్రభాకర్, నాగేష్, నాగన్న స్వామి, మహేష్, మొగులయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా ఏబీవీపీ భారీ ర్యాలీ

☆ జాతీయవాద భావజాలమే సంస్థ బలం ☆ విద్యార్థుల భాగస్వామ్యానికి పిలుపు




**అందోల్, (ప్రజాజ్యోతి):** జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) వట్పల్లి మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం జెండా ఆవిష్కరణతో పాటు భారీ విద్యార్థి ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని దేశభక్తి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏబీవీపీ సంగారెడ్డి జిల్లా హాస్టల్ కన్వీనర్ గోల్కొండ సాయికృష్ణ మాట్లాడుతూ.. ఐదుగురు విద్యార్థులతో ప్రారంభమైన ఏబీవీపీ నేడు దేశవ్యాప్తంగా లక్షలాది మంది సభ్యులతో ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఎదిగిందన్నారు. విద్యార్థి సమస్యల పరిష్కారంతో పాటు జాతీయవాద భావజాలాన్ని బలోపేతం చేయడంలో ఏబీవీపీ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. జాతీయవాద సిద్ధాంతం కోసం ప్రాణత్యాగాలు చేయడానికి కూడా వెనుకాడని కార్యకర్తలను కలిగిన ఏకైక విద్యార్థి సంఘం ఏబీవీపీ అని ఆయన అన్నారు. దేశ సమైక్యత, జాతీయ భద్రత, విద్యార్థి హక్కుల కోసం సంస్థ నిరంతరం ఉద్యమిస్తోందని తెలిపారు. కాశ్మీర్ అంశం నుంచి అక్రమ వలసల వరకు అనేక జాతీయ సమస్యలపై ఏబీవీపీ చేపట్టిన ఉద్యమాలు దేశ విధానాలపై ప్రభావం చూపాయని పేర్కొన్నారు. భారత్‌ను విశ్వగురువుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏబీవీపీ చేస్తున్న సేవల్లో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని సాయికృష్ణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నిఖిల్, కో-కన్వీనర్ కార్తీక్, కార్యకర్తలు సతీష్, నితిన్, రాకేష్, సాయికిరణ్, రాము తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్, కార్పొరేట్ విద్య సంస్థలో ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలి

☆ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యాశాఖ మంత్రి నియమించాలి

☆ ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలి

☆ పెండింగ్‌లో ఉన్న స్కాల్స్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలి

☆ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టి రాజేష్




**జహీరాబాద్, జూలై 09 (ప్రజా జ్యోతి న్యూస్)** వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జహీరాబాద్ ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టి రాజేష్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితుల్లి అకాడమిక్ ఇయర్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్న వారికి పాఠ్య పుస్తకాలు నోట్బుక్లు యూనిఫామ్ లాంటి వస్తువులు అందించక పోవడం దుర్మార్గమని అన్నారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేక ఉపాధ్యాయులు, ఎంఈవో, డీఈఓ లు లేక విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించ లేకపోతున్నారని మండి పడ్డారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేసి పోస్టులను భర్తీ చేయాలి, విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలి. ప్రవేటు,కార్పొరేట్ విద్యా సంస్థలలో ఫీజు నియంత్రణ చట్టం లేక పుట్టగొడుగుల్లా ప్రవేటు కార్పొరేట్ విద్యా సంస్థలు పుట్టుకొస్తున్నాయి విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద విచ్చల విడిగా ఫీజులు వసూలు చేస్తూ వ్యాపారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. అదిలా ఉంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యా కేంద్రాలలో బుక్స్, యూనిఫాం, టై, బెల్ట్, షూస్ లు అమ్మకూడ దని ఉన్న వారు ఏకంగా విద్యా కేంద్రాలలోనే స్టేషనరీలు పెట్టీ బుక్స్, యూనిఫాం, టై, బెల్ట్, షూలు అమ్ముకుంటూ వ్యాపారాలు చేస్తున్న మండల, జిల్లా విద్యాధికారులు మాత్రం చర్యలు తీసుకొండా స్పందించ కుండా ఉంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలలో ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలి. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఇన్ని సంవత్సరాలు అవుతున్న ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని నియమించక పోవడం సిగ్గు చేటన్నారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు రావాల్సిన స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ దాదాపు 9వేల కోట్ల రూపాయలు పెండింగ్లో ఉన్నాయని పేర్కొన్నారు. కాబట్టి వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా తక్షణమే పెండింగ్లో ఉన్న స్కాల్స్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ధామాలు ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్య దర్శులు సందీప్, రిషి, నాయకులు విష్ణువర్ధన్, భాను, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యర్థాలు తగలబెట్టడంతో దుర్వాసన

☆ ఓ ఫుడ్ పరిశ్రమకు సంబంధించి ఎక్స్పైడ్ డేట్ అయిపోయిన ప్యాకింగ్ ప్యాకెట్లను తగలబెడుతున్నారు

☆ వ్యర్థాల దుర్వాసనతో రోడ్డు పక్క నుంచి వెళ్లలేక పోతున్నాం

☆ ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీలు శూన్యం




**మనోహరాబాద్, జూలై 09 ( ప్రజా జ్యోతి )** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని కళ్ళకల్, టి జి ఐ ఐ సి పారిశ్రామిక వాడలో బుధవారం రాత్రి ఓ ఫుడ్ పరిశ్రమకు చెందిన ఎక్స్పై డేట్ అయిపోయిన ప్యాకెట్లను రోడ్డు పక్కనే తగలబెట్టడంతో విపరీతమైన దుర్వాసన వెదజల్లుతుంది. ఈ వ్యర్థాలు రాత్రివేళలో




తగలబెట్టడంతో పరిశ్రమలలో పని చేసుకుని తిరిగి ఇంటికి వస్తున్న కార్మికులకు ఈ దుర్వాసనతో ముక్కు గొంతులు పట్టేసి తలనొప్పిగా ఏర్పడుతున్నదని కార్మికులు ఆరోపిస్తున్నారు. అసలే వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు తోడు ఈ దుర్వాసన వల్ల రోగాల బారిన పడుతున్నామని పాదాచార్యులు వాహనదారులు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటన్నిటికీ కారణం ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీలు శూన్యం వల్లే ఇలాంటివి జరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు. రాత్రి వ్యర్థాలను తగలబెడితే ఉదయం పరిశ్రమలకు ఉ



పాధి కోసం వెళుతుంటే దుర్వాసన తట్టుకోలేక పోతున్నామని కార్మికులు వాపోతున్నారు. ఇప్పటికైనా రోడ్డు పక్కన వ్యర్థాలను తగలబెట్టకుండా ఫుడ్ ఇన్స్పెక్టర్ టి జి ఐ సి వాళ్లు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

# వెంటనే స్టీల్ పరిశ్రమ ఎత్తివేయాలి: బిఆర్ఎస్ నాయకుల డిమాండ్

☆ పరిశ్రమ కాలుష్యం వల్ల రెండు గ్రామాల ప్రజలకు వ్యాధులు

☆ ప్రజాభిప్రాయ సేకరణ మరొక్కసారి నిర్వహించాలి

☆ పరిశ్రమ వల్ల నష్టపోతున్న రెండు గ్రామాల రైతులు

☆ మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి



**మనోహరాబాద్, జూలై 09 ( ప్రజా జ్యోతి)** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని రంగయ్యపల్లి చెట్ల గౌరారం గ్రామాలకు ఆనుకొని ఉన్న ఎమ్మెస్ ఫౌండేషన్ స్టీల్ పరిశ్రమను వెంటనే ఎత్తివేయాలని మాజీ ఎఫ్ డి సి చైర్మన్ ఒంటేరు ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం, విలేకరులతో మాట్లాడుతూ రంగయ్యపల్లి చెట్ల గ్రామాల రైతులు స్టీల్ పరిశ్రమ వల్ల వచ్చే పొల్యూషన్ వల్ల పంటలు పండించలేక వ్యాధి బారిన పడుతున్నారని ఈ రెండు గ్రామాల్లో బోరు నుంచి వచ్చే నీళ్లు తాగలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే స్టీల్ పరిశ్రమ ఎత్తివేసేంతవరకు ఉద్యమం ఆపకోమని ఒక్కరోజు నిరాహార దీక్ష కూడా చేస్తామని మాజీ ఎఫ్ డి సి చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి తెలిపారు. కాలుష్యం వల్ల ఇబ్బందులు జరుగుతూ పరిశ్రమలో సేఫ్టీ లేక ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు ప్రమాదాల బారిన పడ్డ పరిశ్రమ యజమాన్యం పట్టించుకోకపోవడంతో ఈ రెండు గ్రామాలకు చెందిన వారు పరిశ్రమ యజమాని అడగగా కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని రంగయ్యపల్లి చెట్ల గౌరవం ప్రజలు పరిశ్రమ వైపు చూస్తే చాలు కేసులు పెట్టే పరిస్థితి ఉందని ప్రజలు భయాందోళన గురవుతున్నారని ఆయన అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణకు పోలీసుల బందోబస్తుతో సేకర నిర్వహించారని ఇది తెలుసుకొని జిల్లా జాయింట్ కలెక్టర్కు రెండు గ్రామాల సమస్యలు తెలపడానికి వస్తే ఇక్కడ పోలీసులు అరెస్టు చేశారని ప్రతాప్ రెడ్డి వాక్యానించారు. వెంటనే స్టీల్ పరిశ్రమ మూసి వేయకపోతే ఉద్యమం తప్పదని ఒక్కరోజు నిరాహార దీక్ష కూడా చేస్తామని మాజీ ఎఫ్డిసి చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇమాంపూర్ శేఖర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, పంజాబీక్షపతి, లక్ష్మణ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రతే ముఖ్యం

☆ పాఠశాల బస్సులు, ఆటోలపై పోలీసుల స్పెషల్ డ్రైవ్

**చేర్యాల, జూలై 8 (ప్రజాజ్యోతి):** పాఠశాల విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని చేర్యాల పోలీసులు గురువారం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. పట్టణంలో స్కూల్ ఆటోలు, బస్సులు నడిపే డ్రైవర్లకు చేర్యాల ఎస్ఐ అపూర్వ రెడ్డి ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాలలకు చేరవేసే వాహనాల డ్రైవర్లకు,సంబంధిత స్కూల్ యాజమాన్యాలకు ఎస్ఐ పలు కీలక సూచనలు చేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఎస్ఐ అపూర్వ రెడ్డి మాట్లాడుతూ... అమాయకపు చిన్న పిల్లల ప్రాణాలు డ్రైవర్ల చేతుల్లోనే ఉంటాయని, బాధ్యతారహితంగా ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే సహించేది లేదని హెచ్చరించారు. డ్రైవర్లందరూ ట్రాఫిక్ నిబంధనల ప్రకారం,అత్యంత జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. మైనర్ విద్యార్థులు



ఎవరూ కూడా సొంతంగా ద్విచక్ర వాహనాలు నడుపుకుంటూ పాఠశాలలకు రాకుండా చూడాల్సిన బాధ్యత స్కూల్ యాజమాన్యాలదేనని స్పష్టం చేశారు. దీనిపై పాఠశాలల ప్రిన్సిపాల్స్, యాజమాన్యాలు ప్రత్యేక నిఘా ఉంచాలని కోరారు. విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఈ సందర్భంగా హెచ్చరించారు.

# జాతీయ పునర్నిర్మాణం ఏబీవీపీ లక్ష్యం

☆ ప్రాణాలు సైతం త్యాగం చేయడంలో గొప్ప నాయకులు

☆ ప్రతి విద్యార్థి ఏబీవీపీ సత్తాను చాటలి ☆ ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ సావుల ఆదిత్య

**దుబ్బాక ప్రతినిధి, జులై 09 ( ప్రజా జ్యోతి)** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దుబ్బాక నగర శాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా నగరంలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎబివిపి స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ సావుల ఆదిత్య మాట్లాడుతూ.... దేశ నిర్మాణంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకుందని 5 మంది విద్యార్థులతో ప్రారంభమై కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అటాక్ నుంచి కటక్ వరకు 78 లక్షల విద్యార్థుల సభ్యత్వం తో ప్రపంచములోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా నిలిచిందని ఎబివిపి నినాదాలు నేడు దేశానికి విధానాలుగా మారాయిఅని, కాశ్మీర్ ఆర్టికల్ 360 రద్దు కై నినదించి ఉద్యమించి విజయం సాధించిన ఘనత ఎబివిపి దని, అక్రమ వలసదారుల ఏరివేతకు సేవ్ అస్సాం టుడే సేవ్ ఇండియా టుమారో అని అక్రమ వలసదారుల వల్ల ఏర్పడే జాతీయ భద్రత విషయంలో ఎబివిపి చేసిన ఉద్యమాలు నేడు ఈశాన్య రాష్ట్రాలు భారత్ తో బలంగా నిలుచుటకు ఆధారం అయిందని, తెలంగాణ, బెంగాల్, కేరళ మరియు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో వామపక్ష విదేశీ కుట్రలను, నరహంతక నక్సలైట్ల తూటాలకు ఎదురించి, జాతీయ వాదాన్ని పెంపొందించటానికి భారత్ మాతాకి జై అంటూ అనేక మంది ఎబివిపి కార్యకర్తలు ప్రాణత్యాగాలు సైతం చేశారని, అటువంటి మహా వీరులు




పుట్టిన గడ్డ తెలంగాణ. జాతీయ వాదాన్ని దేశభక్తిని విద్యార్థులను తెలియచేయడంలో ఎబివిపి కార్యకర్తలు నిరంతరం పనిచేస్తూ వస్తున్నారు. నేడు దుబ్బాక లో ఇక్కడ కాగడా జండా పట్టుకొని భారత్ మాతాకి జై అని నినదిస్తున్న ఈ వేలాదిగా విచ్చేసిన విద్యార్థుల సంఖ్య వారి ఉచ్ఛాహం సాక్ష్యం అని వామపక్ష వాదుల వ్యక్తి నిర్మూల సిద్ధతం నేడు భారత పటంలో శాశ్వతంగా నిర్మూలింపబడిందని, జాతీయవాద వ్యక్తి నిర్మాణ సిద్ధాంతం పల్లె పల్లెలో ప్రతి ఇంటిలో విస్తరించిందని అన్నారు, భారత దేశంను ప్రపంచంలోనే విశ్వ గురువుగా నిలుపుటకు



ఎబివిపి 78 సంవత్సరాలుగా చేస్తున్న ఈ ప్రయాణంలో ప్రతి విద్యార్థి భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దిశా బోర్డు మెంబర్ సుంకోజ్ ప్రవీణ్ కుమార్, నగర కార్యదర్శి శేర్ల జశ్వంత్, నగర ఉపాధ్యక్షుడు కుమార్,పవన్ నగర కార్యవర్గ సభ్యులు అఖిల్,భరత్ విద్యార్థులు పూర్వ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

☆ సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొంగరి వెంకట మావో డిమాండ్

**ముస్త్యాల, జూలై 9:** చేర్యాల మండలంలోని ముస్త్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్,ఫార్మాసిస్ట్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొంగరి వెంకట మావో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం నాయకుల బృందం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కొంగరి వెంకట మావో మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్ పోస్టులతో పాటు అదనంగా మరో డాక్టర్ అవసరం ఎంతైనా ఉందన్నారు. హాస్పిటల్ నిర్వహణకు సంబంధించి గత రెండేళ్లుగా ప్రభుత్వం నుండి మెయింటెనెన్స్ చార్జీలు రావడం లేదన్నారు. సంవత్సరానికి రెండు లక్షల రూపాయల చొప్పున నిధులు రావాల్సి ఉండగా,నిధులు విడుదల కాకపోవడంతో కనీసం వాటర్ మెయింటెనెన్స్ కూడా నిలిచిపోయిందని మండిపడ్డారు. ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు కరువు అవ్వడం వల్ల ప్రతిరోజూ వైద్యం కోసం వచ్చే



చుట్టుపక్కల 20 గ్రామాల ప్రజలు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా వెంటనే స్పందించి, నిధులు విడుదల చేయడంతో పాటు ఖాళీలను భర్తీ చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు రేపాక కుమార్, పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి గుంద్ర రవీందర్, నాయకులు కొంగరి కృష్ణమూర్తి, కర్రీ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట తరువాతే ఏ జిల్లా అయినా

☆ సిద్దిపేట రైతులకే మొదలు మొక్కలు అందించాలి

☆ మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

**చిన్నకోడూరు, జులై 9,(ప్రజాజ్యోతి):-** పామ్ ఆయిల్ మొక్కలు తొలుత సిద్దిపేట జిల్లా రైతులకు అందించిన తర్వాతే మిగతా జిల్లాల రైతులకు ఇవ్వాలని మాజీమంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఫైర్ అయ్యారు. రంగనాయక సాగర్ వద్ద ఉన్న నర్సరీలో లారీల లో ఉన్న మొక్కలను చూసి పామాయిల్ మొక్కల పంపిణీపై ఆయిల్ ఫెడ్ అధికారి భాస్కర్ రెడ్డి తో ఫోన్ లో మాట్లాడారు. సిద్దిపేట రైతుల అవసరం తీరక ముందే ఇతర జిల్లాలకు మొక్కలు ఎలా తరలిస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు





చేసే రైతులకు మొక్కలు అందించారా... ఇక్కడి రైతులకు ఇవ్వకముందే ప్రాంతాల రైతులకు ఎలా ఇస్తారంటూ ప్రశ్నించారు. ఎంతోమంది రైతులు ఆయిల్ ఫామ్ మొక్కలు కావాలని అడిగారని వెంటనే వారికి మొక్కలను అందించాలన్నారు. నర్సరీలో ఉన్న మొక్కలపై ఎవరికి ఎలాంటి పట్టింపు లేదని, మొక్కల సంచుల్లో ఇసుక ఉందని కనీసం మీరు కూడా పట్టరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజులకు ఒకసారి అయినా అధికారులు నర్సరీని సందర్శించాలన్నారు.

# వార్డు అభివృద్ధే నా లక్ష్యం..!

☆ మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి

☆ ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం



**దుబ్బాక, జులై 09 (ప్రజాజ్యోతి)** దుబ్బాక మున్సిపాలిటీ 18వ వార్డులోని నీలకంఠ ఫంక్షన్ హాల్ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ పక్కన పిచ్చి మొక్కలు పెరిగి ప్రజలకు ఇబ్బందిగా మారడంతో 18వ వార్డు కౌన్సిలర్ శ్రీరాం సరస్వతి నరేందర్ వెంటనే స్పందించి మున్సిపల్ పారిశుద్ధ కార్మిక సిబ్బందితో వాటిని అక్కడి నుంచి తొలగించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీరాం సరస్వతి నరేందర్ మాట్లాడుతూ... వార్డు ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ముఖ్యంగా ఈ వర్షాకాలంలో ఇళ్ల చుట్టూ మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, మోరీలు, డ్రైనేజీ, పరిశుభ్రతకు సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆకుల భరత్, తదితరులు పాల్గొన్నారు.

# ఎరువులను అందించడంలో ప్రభుత్వం విఫలం

☆ ఎరువుల ధరలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు

☆ మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

**చిన్నకోడూరు, జులై 9, (ప్రజాజ్యోతి):-** రైతులకు ఎరువులను అందించటం లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శించారు. మండలం పరిధి చంద్లాపూర్ గ్రామంలో ఎరువుల దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న రైతులకు నాలుగు బస్తాల చొప్పున ఇవ్వాల్సింది పోయి రెండు బస్తాలు ఇస్తామని చెప్పటం సిగ్గుచేటన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రకాల ఎరువులపై ధరలను పెంచడంతో రైతులకు ఆర్థిక భారంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల బాధలను అర్థం చేసుకోకపోవడంతో



అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. యాప్ రద్దు చేసి నేరుగా రైతులకు యూరియా అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు అందించే యూరియా పై సీలింగ్ ఎత్తివేసి ఎంత యూరియా అవసరమైతే అంత యూరియాను అందించాలనే డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంగాపూర్, అల్లిపూర్ సొసైటీ చైర్మన్లు కనకరాజు, వెంకటరెడ్డి,పార్టీ నాయకులు రాధాకృష్ణశర్మ, కాముని శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ కీసర పాపయ్య, మాజీ ఎంపీటీసీలు దుర్గారెడ్డి, చంద్రమౌళి తదితరులున్నారు.



# ఎస్ఐఆర్ ఓటర్ నమోదును సద్వినియోగం చేసుకోవాలి

☆ కాంగ్రెస్ పార్టీ అక్బర్ పేట భూంపల్లిమండల అధ్యక్షులు గుండా శంకర్



**అక్బరుపేట్/భూంపల్లి, జులై 09(ప్రజా జ్యోతి)** ఓటర్ మహాశయులు ప్రతి ఒక్కరూ ఎస్ ఐ ఆర్ లో ఓటర్ యొక్క వివరాలను నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ అక్బర్పేట భూశీపల్లి మండల అధ్యక్షుడు గుండా శంకర్ అన్నారు. గురువారం మండలంలోని తాళ్లపల్లి,బేగంపేట గ్రామాల సర్పంచులు ప్రభాకర్ , చంద్రశేఖర్,మండల తహసిల్దార్ బాలరాజు తో కలిసి ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు గుండా శంకర్ మాట్లాడుతూ,ప్రజాస్వామ్య విధానంలో ప్రతి ఓటు అమూల్యమైనదన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క యువతీ యువకులు తమ పేరు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని తెలిపారు. పేరు లేకపోవడం, చిరునామా మారడంతో పాటుగా మరే విధమైన లోపాలతో నైనా విలువైన ఓటు హక్కును కోల్పోకూడదన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ఓటర్లు అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీధర్, సురేందర్ రెడ్డి, శ్రీనివాస్, చంద్ర సాగర్, ప్రదీప్ రెడ్డి, ప్రతాప్, ప్రభాకర్, రాజు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ఓటర్ నమోదును సద్వినియోగం చేసుకోవాలి

☆ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్యలో స్వామి




**దౌల్తాబాద్, జూలై 09 ( ప్రజా జ్యోతి )** ఎస్ఐఆర్ ఓటర్ ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలి మద్దెల స్వామి అన్నారు. గురువారం మండల పరిధిలోని గొడుగుపల్లి గ్రామంలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య విధానంలో ప్రతి ఓటు అమూల్యమైనదన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క యువతీ యువకులు తమ పేరు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని తెలిపారు. పేరు లేకపోవడం, చిరునామా మారడంతో పాటుగా మరే విధమైన లోపాలతో నైనా విలువైన ఓటు హక్కును కోల్పోకూడదన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ఓటర్లు అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ జహీర్, బి ఎల్ ఓ రేఖ, ఎఫె దుర్గని శ్రీనివాస్, సౌజన్య తో పాటు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలను గాలికొదిలేసి ప్రభుత్వ భూముల

# కబ్జాలపై కాంగ్రెస్ నేతల కన్ను!

**మండిపడ్డ బిఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి.**



**అబ్దుల్లాపూర్ మెట్టు జూలై 08(ప్రజాజ్యోతి) :** దోచుకో దోచింది దాచుకో అన్నట్లుగా కాంగ్రెస్ పాలన కొనసాగుతుం దని రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి కాంగ్రెస్ నాయకుల పై మండిపడ్డారు.అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మునగనూర్ గ్రామంలో సర్వే నెం. 44లో కబ్జాకు గురైన రూ.200 కోట్ల విలువైన 12 ఎకరాల ప్రభుత్వ భూమిని బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి పరిశీలించారు.అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మునగనూర్ సర్వే నెం.44లో ఉన్న 12 ఎకరాల ప్రభుత్వ భూమి గత 70 సంవత్సరాలుగా ప్రభుత్వ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగానే ఉన్నదని, తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కొందరి దృష్టి ఈ భూమిపై పడుతుందని గుర్తించి ఇది ప్రభుత్వ భూమి అని బోర్డులు ఏర్పాటు చేయించాం.15 సంవత్సరాల పాటు ఒక్క అంగుళం కూడా ఆక్రమణకు గురికాకుండా ఈ భూమిని కాపాడాం. భవిష్యత్తులో కాలనీవాసుల అవసరాల కోసం వినియోగించాలని భావించాం.కానీ ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కొందరు అధికారులతో కుమ్మక్కై ప్రభుత్వ భూములను కబ్జాకు పాల్పడుతున్నారు.మొదట ఈ వ్యవహారంపై ఎంపీ, ఎమ్మెల్యే మధ్య విభేదాలు వచ్చినా,తర్వాత రాజీ కుదుర్చుకుని పక్కా ప్రణాళికతో కబ్జా చేశారు.ముందుగా కంబాలపల్లి సులోచన పేరుపై, అనంతరం గోపాల్ పేరుతో రాత్రికి రాత్రే అధికారులపై ఒత్తిడి తెచ్చి రిజిస్ట్రేషన్లు జరిపించారు. ఈ వ్యవహారం వెనుక ఎంపీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే సోదరుడు కీలక పాత్ర పోషించారని, 15 సంవత్సరాలుగా ఎలాంటి వివాదం లేని ప్రభుత్వ భూములు ఇప్పుడు ఒక్కసారిగా ఎందుకు కబ్జాల గురవుతున్నాయని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకో దోచింది దాచుకో అనే విధానంతో వ్యవహరిస్తుందని అనుమానం బలపడుతుందన్నారు. ఇలాంటి అక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి పరోక్షంగా మద్దతు ఇస్తున్నట్లుగా పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ఇదే కాకుండా నియోజకవర్గంలో చాలా చోట్ల భూములు కబ్జాకు గురవుతున్నాయని ముందు ముందు అన్ని విషయాలు బయటపెడతామన్నారు. అధికారులకు ఇదే నా హెచ్చరిక మీరు 30,40 సంవత్సరాలు ప్రభుత్వ సర్వీసులో ఉంటారు. కేవలం ఐదు సంవత్సరాలు మాత్రమే రాజకీయాల్లో ఉండే రాజకీయ నాయకుల కోసం ప్రభుత్వ భూములను కబ్జా చేయించి మీ ఉద్యోగాలను మీ జీవితాలను ప్రమాదంలో పడేసుకోవద్దని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం టిఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన చివరి వరకు పోరాడుతుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ కబ్జాలను సహించే ప్రసక్తి లేదని ఆయన హెచ్చరించారు.

# ప్రజా పాలన పక్కనపెట్టి కబ్జాల పాలన కొనసాగిస్తున్నారు

**కాంగ్రెస్ నాయకుల తీరుపై మండిపడ్డ మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్**



**అబ్దుల్లాపూర్ మెట్టు జూలై 08 (ప్రజాజ్యోతి) :** ప్రజా పాలన అందిస్తామని ఎన్నికల ముందు హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన తర్వాత కబ్జాల పాలనకు తెర తీశారని భువనగిరి పార్లమెంట్ మాజీ సభ్యులు బూర నర్సయ్య గౌడ్ కాంగ్రెస్ నాయకులపై మండిపడ్డారు.బుధవారం మునగనూరు గ్రామంలో జిహెచ్ఎంసి53,56 డివిజన్ ల బిజెపి పార్టీ అధ్యక్షుడు ఎలిమినేటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో అధికార పార్టీ నాయకుల కబ్జాలపై విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి కాంగ్రెస్ నాయకుల కబ్జాల పర్వాన్ని ఎండగట్టారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములను ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు ఉపయోగించవలసింది పోయి కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ బిజెపి పార్టీ అధ్యక్షుడు ఎలిమినేటి నరసింహారెడ్డి గత ఏప్రిల్ నెలలోనే రెవెన్యూ అధికారులకు ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతుందని ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎనిమిది లక్షల ఎకరాల భూమి మార్పిడి జరిగి భూస్వాములకు అన్యాక్రాంతమైందన్నారు. 20 ఎకరాల భూమి ప్రొహిబిషన్ లిస్టులోకి వెళ్లిందన్నారు. తాను పార్లమెంటు సభ్యునిగా ఉన్న సమయంలోనే మునగనూరు సర్వేనెంబర్ 44 లో ఇక్కడ 40 ఎకరాల భూమి ఉన్న విషయం తనకు తెలుసునని,ఇక్కడ ప్రజలందరికీ ఉపయోగపడేలా క్యాన్సర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించాలని మాజీ సీఎం కేసీఆర్ కు నాడు లెటర్ రాయడం జరిగిందన్నారు. నాటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన కూడా సానుకూలంగా స్పందించారని, కొన్ని దుష్ట శక్తులు అడ్డుపడడంతో ఒక మంచి కార్యక్రమం నిలిచిపోయిందన్నారు. రంగారెడ్డి జిల్లా ప్రస్తుత కలెక్టర్ నారాయణరెడ్డి 2025 సంవత్సరం నవంబర్ నెలలో ఇది ప్రభుత్వ భూమి అని నిర్ధారించడం జరిగిందన్నారు.మీడియా ద్వారా ప్రభుత్వానికి తెలియజేసేది ఏమంటే కబ్జాకు గురవుతున్న 40 ఎకరాల ప్రభుత్వ భూమికి కంచె వేసి ఇది ప్రభుత్వ భూమి అంటూ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. లేని పక్షంలో తామే బుల్డోజర్లు ఏర్పాటు చేసుకొని కంచే వేసి బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. బిజెపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలందరికీ ఉపయోగపడేలా ఒక మంచి ప్రాజెక్టును ఇక్కడ ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం జిహెచ్ఎంసి 53,56 డివిజన్ ల బిజెపి పార్టీ అధ్యక్షులు ఎలిమినేటి నరసింహారెడ్డి మాట్లాడుతూ గత ఏప్రిల్ నెల 21న అబ్దుల్లాపూర్ మెట్టు తాసిల్దార్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వ భూములను సంరక్షించవలసిన అధికారి బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా వ్యవహరిస్తున్నాడని ఆయన విమర్శించారు. తక్షణమే అబ్దుల్లాపూర్ మెట్టు తహసిల్దార్ స్పందించి ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ సీనియర్ నాయకులు కందాల బలదేవరెడ్డి, బిజెపి పార్టీ నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

# సర్పంచ్‌లు, సెక్రటరీలకు సమగ్ర అభివృద్ధిపై శిక్షణ





- నేర్చుకున్న విషయాలు గ్రామ అభివృద్ధిలో తోడ్పాటు అందిస్తాయి
- అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్

**వికారాబాద్ ప్రతినిధి, జూలై 08(ప్రజా జ్యోతి) :** గ్రామాల అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి గాను సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. బంట్వారం, ధారూర్, కొటేపల్లి, మర్పల్లి, మొమిన్ పేట్, వికారాబాద్, నవాబ్‌పేట్ మండలాలకు చెందిన సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలు మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ శిక్షణలో గ్రామ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (జిపి-ఎస్ఏపి), వీబీ-జి రామ్ జి పథకం, సెంట్రల్ ఫైనాన్షియల్ గ్రాంట్స్ నిబంధనలు, ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు-2026, జల సిరి తదితర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి పథకాలపై విపులంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) ఉమా శంకర్ ప్రసాద్, మాట్లాడుతూ సర్పంచ్‌లు, సెక్రటరీలు శిక్షణలో నేర్చుకున్న విషయాలను గ్రామాల్లో సమర్థంగా అమలు చేసి, ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దాలని సూచించారు. అలాగే గ్రామ సమగ్ర అభివృద్ధి ప్రణాళికను ప్రజల భాగస్వామ్యంతో రూపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయ జిల్లా స్పెషల్ ఆఫీసర్ నీరజ రెడ్డి, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీపీవో జయసుధ, ఈఈ పీఆర్ ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఐవి నియంత్రణలో వికారాబాద్‌కు జాతీయ గుర్తింపు



- దేశవ్యాప్తంగా 70 జిల్లాల్లో ఒకటిగా ఎంపిక
- కలెక్టర్ దీపక్ తివారికి అభినందనలు

**వికారాబాద్ ప్రతినిధి, జూలై 8 (ప్రజా జ్యోతి) :** వికారాబాద్ జిల్లా హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ తో పాటు చికిత్సలో విశిష్ట ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి గుర్తింపును పొందింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి కి అభినందనలు వెల్లువెత్తాయి. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఎన్ ఏ సి ఓ) నిర్దేశించిన మార్గదర్శకాలను విజయవంతంగా అమలు చేసి, ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లాలకు అందజేసే "సాక్ష్యం సర్టిఫికెట్" ను వికారాబాద్ జిల్లా అందుకుంది. దేశవ్యాప్తంగా కేవలం 70 జిల్లాలు మాత్రమే ఈ గుర్తింపును పొందగా, అందులో వికారాబాద్ జిల్లా స్థానం దక్కించుకోవడం గర్వకారణమని అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ శ్రీ దీపక్ తివారి మార్గదర్శకత్వంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. సుధాకర్ లాల్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది కృషి ఫలితంగా ఈ లక్ష్యం సాధ్యమైంది. నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం జిల్లాలో హెచ్ఐవితో జీవిస్తున్న వారిలో కనీసం 95 శాతం మందికి తమ ఆరోగ్య స్థితి తెలిసేలా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మొత్తం 4,536 మందిని గుర్తించి, వారందరికీ యాంటీ రెట్రోవైరల్ థెరపీ (ఏ ఆర్ టి అయినా) చికిత్సను అందిస్తున్నారు. టెస్ట్ అండ్ ట్రీట్" విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయడం, చికిత్స నిరంతరంగా కొనసాగేందుకు కౌన్సిలింగ్, ఫాలోఅప్ సేవలు అందించడం ద్వారా ఈ విజయాన్ని సాధించారు. హెచ్ఐవితో జీవిస్తున్న వ్యక్తులు క్రమం తప్పకుండా మందులు తీసుకోవడం వల్ల వైరల్ లోడ్ తగ్గి, ఆరోగ్యంగా జీవించడమే కాకుండా ఇతరులకు వ్యాధి వ్యాప్తి తగ్గుతుందని వైద్య నిపుణులు తెలిపారు. ఈ విజయానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, రాష్ట్ర , జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థలు, ఏ ఆర్ టి కేంద్రాలు, ఆశా కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు ముఖ్యపాత్ర పోషించాయి. ప్రజలు హెచ్ఐవి పై ఉన్న అపోహలు, భయాలు, వివక్షను విడనాడి సమీప ప్రభుత్వ ఆసుపత్రులు లేదా ఐసిటిసి కేంద్రాల్లో ఉచితంగా పరీక్షలు చేయించుకుని, అవసరమైతే వెంటనే చికిత్స ప్రారంభించుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీ దీపక్ తివారి పిలుపునిచ్చారు.

# క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను పర్యవేక్షించిన ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్ శ్రీధరన్ - జిల్లా కలెక్టర్





**కొడంగల్ జులై 8 ప్రజా జ్యోతి :** రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్ వికారాబాద్ జిల్లా, కొడంగల్ నియోజకవర్గం కడ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో పర్యటించి యపనులను పరిశీలించారు. ఈ సందర్భంగా దుద్యాల్ మండలం హకీంపేట పరిధిలోని ఎడ్యుకేషన్ హబ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తో కలిసి ఆయన పరిశీలించారు. ఎడ్యుకేషన్ హబ్ లో చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్ కాంట్రాక్టర్లకు సూచించారు. ప్రతి బ్లాక్ కు ప్రత్యేక అధికారులను నియమించి ఇచ్చిన గడువులోపు పనులు పూర్తి అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. పనుల పురోగతిలో అధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలని ఆయన తెలిపారు. పనులన్నీ వేగవంతంగా జరగాలంటే మానవ వనరుల సామర్థ్యం పెంచడంతోపాటు రెండు షిఫ్టులుగా పనిచేయాలని ఆయన కాంట్రాక్టర్లకు సూచించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైని) సచిన్ బస్వరాజ్ గుట్టూరు, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, జడ్పీ సిఇఓ సుధీర్, ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు.

# వరి సాగు విస్తరణ మరియు విత్తనాల విక్రయాలపై వ్యాపార డీలర్లకు అవగాహన సదస్సు



**కల్పించిన వ్యవసాయ శాఖ అధికారులు**

**కొడంగల్, జులై 08 ప్రజా జ్యోతి :** వానాకాలం--2026 సీజన్‌లో ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఏడు సన్న వరి రకాల సాగు విస్తరణ మరియు ఓ ఎల్ ఎం ఎస్ సీడ్స్ (సాథీ సీడ్స్ )పోర్టల్‌లో రైతువారీ విత్తనాల విక్రయాల నమోదుపై ఇన్‌పుట్ డీలర్లకు అవగాహన కల్పించేందుకు కొడంగల్ డివిజన్ పరిధిలోని ఇన్‌పుట్ డీలర్ల సమావేశం బుధవారం ఉదయం 11.00 గంటలకు కోడంగల్ మండలము పర్సాపూర్ రైతు వేదికలో నిర్వహించడం జరిగిందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కొడంగల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఏడిఏ బి.వెంకటేశం మాట్లాడుతూ, ప్రభుత్వం సూచించిన ఏడు ప్రాధాన్య సన్న వరి రకాలను రైతులకు విస్తృతంగా ప్రోత్సహించాలని ఇన్‌పుట్ డీలర్లకు సూచించారు. ఆయా రకాల విత్తనాల విక్రయాల వివరాలను ఓఎల్ఎంఎస్ సీడ్స్ పోర్టల్‌లో రైతువారీగా, ఖచ్చితంగా మరియు సకాలంలో నమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి విక్రయాన్ని నమోదు చేయడం ద్వారా సన్న వరి రకాల ప్రోత్సాహానికి సహకరించాలని కోరారు. సమావేశంలో కొడంగల్ మండల వ్యవసాయ అధికారి శ్రీమతి ఎన్. శ్రీలత, దౌల్తాబాద్ మండల వ్యవసాయ అధికారి జి.తులసి, కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్, దుద్యాల్ మండలాల ఇన్‌పుట్ డీలర్లు తదితరులుఈ సమావేశంలో పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబాల సంక్షేమం కోసం డా.వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు మరువలేనివి

- డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఆశయాలే కాంగ్రెస్ పార్టీకి మార్గదర్శకం
- టిపిసిసి వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్



**కూకట్ పల్లి, జులై 08 (ప్రజా జ్యోతి) :** దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని గాయత్రి నగర్ మస్తాన్ రెడ్డి ఆధ్వర్యంలో, అల్లాపూర్ వాజిద్ పాషా ఆధ్వర్యంలో, కెపిహెచ్‌బి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో, ప్రశాంత్ నగర్ నాగార్జున, రమణ ఆధ్వర్యంలో, ఆంజనేయ నగర్ లో శంకర్ ఆధ్వర్యంలో ఆంప్రాంతాల్లో నిర్వహించిన జయంతి కార్యక్రమాలకు టిపిసిసి వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై డా వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగించి కోట్లాది ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. రైతులు, పేదలు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, నిరుపేద కుటుంబాల సంక్షేమం కోసం ఆయన ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్ సేవలు, జలయజ్ఞం, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ గృహాలు వంటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు చేపట్టిన చారిత్రాత్మక పాదయాత్ర ద్వారా డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి నిజమైన ప్రజానాయకుడిగా నిలిచారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత కాంగ్రెస్ పార్టీపై ఉందని అన్నారు. రాష్ట్రంలో ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని, మహానేత చూపిన బాటలోనే ప్రజాసేవ కొనసాగిస్తామని బండి రమేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డికి ఘన నివాళులు అర్పించారు.

## గృహ ప్రవేశానికి హాజరైన కొడంగల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్



**కోడంగల్ జులై 08 ప్రజా జ్యోతి :** కొడంగల్ మండలం ఇందనూర్ గ్రామం లో మహేష్ యాదవ్ నూతన గృహప్రవేశ కార్యక్రమనికి హాజరైన కొడంగల్ మున్సిపల్ రెండవ వార్డ్ మాజీ కౌన్సిలర్ ఆర్ మధుసూదన్ యాదవ్. కోడంగల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భీములు . ఆర్ రాహుల్ యాదవ్. తాంద్ర గౌరీ శంకర్. ఎనికే పల్లి మాజీ ఉప సర్పంచ్ రవీందర్ గౌడ్. వి రవీంద్ర చారి. ఇందనూర్ ఆశిరెడ్డి. మోటు రములు. తదితరులతో కలసి పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన కొడంగల్ మున్సిపల్ చైర్మన్



**కొడంగల్ జులై 8 ప్రజా జ్యోతి :** బుధవారం నాడు దుద్యాల్ మండలం, కుదురుమల్ల గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ కాలు విరిగి అస్వస్థతతో బాధపడుతున్న సమాచారం తెలవడంతో కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ గుప్తా తన అనుచరులతో కలిసి శ్రీనివాస్ ను మరియు వారి కుటుంబాన్ని పరామర్శించి భరోసా కల్పించారు. కార్యక్రమంలో కుదురుమల్ల గ్రామ నాయకులు తదితరులు ఉన్నారు.

## అన్నానగర్‌లో చెత్త సమస్యకు చెక్..

**బానుక నర్మదా మల్లికార్జున్ చొరవ**

- అధికారులతో సమన్వయం చేసి వెంటనే చెత్త తొలగింపు
- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని స్పష్టం



**బోయిన్ పల్లి, జులై 08 (ప్రజా జ్యోతి) :** కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మదా మల్లికార్జున్ రసూల్‌పూర్ వార్డు--2 పరిధిలోని అన్నానగర్ ప్రాంతంలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్త సమస్యపై వెంటనే స్పందించి అధికారులతో చర్చించి తక్షణ చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేశారు.ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు వెంటనే రంగంలోకి దిగి రోడ్డుపై పేరుకుపోయిన చెత్తను తొలగించే పనులు ప్రారంభించారు. బానుక నర్మదా మల్లికార్జున్ స్వయంగా అక్కడే ఉండి చెత్త పూర్తిగా తొలగించే వరకు అధికారులతో సమన్వయం చేస్తూ పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. దీంతో అన్నానగర్ పరిసరాలు పరిశుభ్రంగా మారాయి. ఈ సందర్భంగా బానుక నర్మదా మల్లికార్జున్ మాట్లాడుతూ, ప్రజలకు అసౌకర్యం కలిగించే ఇలాంటి సమస్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రజలు తమ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను నిర్భయంగా తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. రోడ్లపై ఎక్కడా చెత్త పేరుకుపోకుండా నిరంతర పర్యవేక్షణతో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. చెత్త సమస్యను వెంటనే పరిష్కరించి పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించిన కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మదా మల్లికార్జున్‌కు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపుతున్న చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వార్డు అధ్యక్షుడు మద్దుల శ్రవణ్, కంటోన్మెంట్ బోర్డు అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా.. డాక్టర్ వైఎస్సార్ 77వ జయంతి వేడుకలు

**విగ్రహానికి నివాళులర్పించిన బొంగునూరి కిషోర్ రెడ్డి**



**కుత్బుల్లాపూర్ జులై 8 (ప్రజాజ్యోతి) :** దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రివర్యులు, ప్రజల మనిషి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజ సకవర్గం 295,,277 డివిజన్ మహదేవపురం లోడాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం ఏర్పరచుకున్న మహనీయుడు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి రైతులకు ఉచిత విద్యుత్తు ఇందిరమ్మ ఇండ్లు మహిళలకు వడ్డీ లేని రుణాలు 2రూ కిలో బియ్యం విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, ఆరోగ్యశ్రీ పథకాలను ప్రజలకు అందించిన మహనీయుడు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి రెండు రాష్ట్రాల తెలుగు రాష్ట్రాల ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం ఏర్పరచుకున్న మహనీయుడు రాజశేఖర్ రెడ్డి అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు డివిజన్ నాయకులు శివారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్ సాదు యాదవ్ నరసింహారెడ్డి జనరల్ సెక్రెటరీ శ్రీధర్ రెడ్డి సల్మాన్ రాజ్ కృష్ణ యాదవ్ యూత్ నాయకులు నిఖిల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు వివిధ సంఘాల నాయకులు మరియు కాలనీ వాసులు కలిసి కేక్ కట్ చేసి జయంతి ఉత్సవాలు జరుపుకున్నారు.

# చిప్పలపల్లి సర్పంచ్ మచ్చేటి లక్ష్మణ్‌కు బీఆర్ఎస్ నాయకుల ఘన నివాళి

ముస్తాబాద్, జులై 9 ( ప్రజా జ్యోతి ):
రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి గ్రామ సర్పంచ్ మచ్చేటి లక్ష్మణ్ అకాల మరణం పట్ల బీఆర్ఎస్ పార్టీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన భౌతికకాయాన్ని చిప్పలపల్లిలోని నివాసంలో సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తోట అగన్న మాట్లాడుతూ, మచ్చేటి లక్ష్మణ్ గ్రామాభివృద్ధికి విశేష సేవలు అందించిన నాయకుడని కొనియాడారు. ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొంటూ, ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. లక్ష్మణ్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.
ఈ కార్యక్రమంలో మాజీ రైతు బంధు అధ్యక్షులు కల్వకుంట్ల గోపాల్‌రావు, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భోంపెల్లి సురేందర్‌రావు, మాజీ సర్పంచ్ గాడిచర్ల దేవయ్య, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు రాజమల్లు, కల్వకుంట్ల శ్రీనివాస్, పడిగె ఆంజనేయులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మచ్చేటి లక్ష్మణ్‌కు ఘనంగా నివాళులర్పించారు.

# వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ లూజ్ లైన్లపై ప్రత్యేక దృష్టి

ముస్తాబాద్, జూలై 9: ( ప్రజా జ్యోతి ):
రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ లూజ్ లైన్లను గుర్తించి వెంటనే సరిచేయాలని విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ వేణుమాధవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాల్లో లూజ్ విద్యుత్ లైన్లను గుర్తించి, అవసరమైన చోట కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ తీగలను బిగించాలని సూచించారు.



బుధవారం రోజున పోతుగల్, నామాపూర్ గ్రామాల్లో లూజ్ లైన్ల సమస్య పరిష్కారానికి కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇదే తరహాలో మండలంలోని మిగిలిన అన్ని గ్రామాల్లో కూడా విద్యుత్ లూజ్ లైన్లను సరిచేసి ప్రజలకు సురక్షితమైన విద్యుత్ సరఫరా అందించాలని ఎస్ఈ వేణుమాధవ్ స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు, విద్యుత్ స్తంభాలు, ఇతర పరికరాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి ప్రమాదాలను నివారించాలని, ప్రజల నుంచి వచ్చే విద్యుత్ సంబంధిత ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి మెరుగైన సేవలు అందించాలని సూచించారు.
ఈ ఆదేశాల అమలులో భాగంగా ఏడీఈ శ్రీనివాసులు, డీఈ అంజయ్య, ఏఈ విష్ణు తేజ, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు సమన్వయంతో మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

# భూ భారతి సర్వర్ మొరాయింపు.. 15 రోజులుగా నిలిచిన రిజిస్ట్రేషన్లు –

రైతులతో కలిసి నిరసన తెలిపిన బీఆర్ఎస్ నేత శీలం స్వామి

ముస్తాబాద్: జూలై 9 ( ప్రజా జ్యోతి):
ముస్తాబాద్ మండలంలో భూ భారతి వెబ్‌సైట్ సాంకేతిక సమస్యలతో మొరాయించడంతో గత దాదాపు 15 రోజులుగా భూముల రిజిస్ట్రేషన్లు పూర్తిగా నిలిచిపోయాయని బీఆర్ఎస్ పార్టీ యూత్ మండలాధ్యక్షుడు శీలం స్వామి ఆరోపించారు. రిజిస్ట్రేషన్ల కోసం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన రైతులతో కలిసి ఆయన కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శీలం స్వామి మాట్లాడుతూ, సర్వర్లు పనిచేయకపోవడంతో భూముల క్రయవిక్రయాలు నిలిచిపోయాయని,




స్లాట్ బుకింగ్‌లు పెండింగ్‌లో పడటంతో రైతులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇప్పటికే స్లాట్‌లు బుక్ చేసుకున్న రైతులు ప్రతిరోజూ తహసీల్దార్ కార్యాలయానికి వస్తున్నప్పటికీ, వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొన్నప్పటికీ ప్రభుత్వం సమస్య పరిష్కారంపై తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ సమర్థవంతంగా పనిచేసేదని, ప్రస్తుతం దాని పేరును భూ భారతిగా మార్చినా రైతులకు ఎలాంటి ప్రయోజనం కలగలేదని అన్నారు. ప్రతిరోజూ రాష్ట్రవ్యాప్తంగా జరగాల్సిన వేలాది భూ లావాదేవీలు నిలిచిపోవడంతో అప్పులు చేసి భూములు కొనుగోలు చేసినవారు, అత్యవసర అవసరాల కోసం భూములు విక్రయించాల్సిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సాంకేతిక లోపాలను సరిచేసి భూ భారతి వెబ్‌సైట్‌ను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

# వరికి ప్రత్యామ్నాయ పంటలపై రైతులను ప్రోత్సహించాలి

- వ్యవసాయ ఆధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో ఉండాలి
- కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ బ్యూరో, జులై 9( ప్రజాజ్యోతి ) జిల్లాలో లోటు వర్షపాతం నమోదవుతున్నందున, ఎల్ నినో ప్రభావం చూపే అవకాశం ఉన్నందున వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం, వానాకాలం సాగు, తదుపరి కార్యాచరణ అంశంపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వ్యవసాయ, నీటిపారుదల తదితర శాఖల అధికారులతో మాట్లాడారు.కరీంనగర్ జిల్లాలో ఇప్పటివరకు లోటు వర్షపాతం ఉందని, ఎల్ నినో ప్రభావం కూడా కనిపిస్తున్నందున రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని అన్నారు. రైతు వేదికల్లో వ్యవసాయ అధికారులు సమావేశాలు నిర్వహించి రైతులకు సూచనలు అందించాలన్నారు. ఆరుతడి పంటలు, పప్పు ధాన్యాలు, తృణ ధాన్యాలు, నూనె గింజలు, కూరగాయలు వంటి పంటల సాగు ఆవశ్యకత తెలియజేయాలని ఆదేశించారు. దీనివల్ల ఎల్ నినో ప్రభావాన్ని కొంతమేర అధికమించవచ్చని, రైతులకు నష్టం జరగకుండా ఉంటుందని సూచించారు. జిల్లాలో బావులు, బోరుబావుల ద్వారా కూడా ఎక్కువ మొత్తంలో పంటలు సాగు అవుతున్నందున, ఆరుతడి పంటలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, తక్కువ నీటితో పంట చేతికి వస్తుందని అన్నారు. ఆన్లైన్ ద్వారా యూరియా అమ్మకాల ప్రక్రియ కొనసాగుతున్నందున జిల్లాలో ఎరువుల పంపిణీకి ఎలాంటి ఇబ్బందులూ ఉండబోవని అన్నారు. యూరియా అమ్మకాల ప్రక్రియను వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వం సూచించిన ఏడు రకాల సన్న వడ్లను మాత్రమే సాగు చేయాలని, తద్వారా బోనస్ పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ రకాలను ప్రతి రైతుకు తెలియజేయాలని అన్నారు. ప్రతి రైతు వేదికను ఉపయోగించుకొని స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో రైతులకు వానాకాలం వ్యవసాయానికి సంబంధించిన ప్రతి సూచన తెలియజేయాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు నీటి లభ్యత, విడుదల తదితర అంశాలపై పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని, వ్యవసాయ, నీటిపారుదల శాఖలు సమన్వయంతో రైతు శ్రేయస్సు కోసం పనిచేయాలని తెలిపారు.



వ్యవసాయ శాఖ ద్వారా ప్రతి రైతుకు సాంకేతిక సలహాలు, వాతావరణ సూచన, పంటల ఎంపికపై మార్గదర్శకాలు ఇవ్వాలన్నారు. జిల్లాలో పరిస్థితిని ఎప్పటికప్పుడు మండలాల వారీగా సమీక్షిస్తానని తెలిపారు. అధికారుల సూచనలు రైతులు పాటించాలని, ఎలాంటి వదంతులను నమ్మవద్దని కోరారు. ఎల్ నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు నిత్యం అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. వీబీజిరామ్ జి పథకం అమలుకు సరైన ప్రణాళిక రూపొందించి కూలీలకు వీలైనన్ని ఎక్కువ పని దినాలు కల్పించాలని తెలిపారు.

# సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కృషి చేయాలి

- గ్రామాలపై పూర్తి అవగాహనతో సర్పంచులు పనిచేయాలి
- గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

కరీంనగర్ బ్యూరో,జూలై 9( ప్రజాజ్యోతి )

గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా సర్పంచులు, కార్యదర్శులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే పిలుపునిచ్చారు. గ్రామాలను ఉత్తమ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు గ్రామాలపై పూర్తి స్థాయి అవగాహనతో పాటు దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు.గురువారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ కె. అనిల్ కుమార్‌తో పాటు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామపంచాయతీలు కేవలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులపైనే ఆధారపడకుండా సొంత ఆదాయ వనరులను అభివృద్ధి చేసుకునే దిశగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. గ్రామాల ఆర్థిక గించుకుని గ్రామాల్లో మౌలిక వసతులు, ప్రజా సౌకర్యాలను మెరుగుపరచాలని సూచించారు. పంచాయతీరాజ్ చట్టం, గ్రామపంచాయతీల విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని, గ్రామపంచాయతీ ప్రొఫైల్ తయారీ,
ఆదాయ వనరుల గుర్తింపు, రానున్న మూడు సంవత్సరాలకు సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని





స్వావలంబన పెరిగితేనే స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.
ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న నిధులతో గ్రామాలను అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద కొత్తగా ప్రవేశపెట్టిన వీబీజీ–రామ్ జీ పథకం ద్వారా 318 రకాల అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని సర్పంచులు, కార్యదర్శులు సమర్థంగా వినియోసూచించారు. నిబద్ధతతో పనిచేస్తే ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ కే అనిల్ కుమార్, జెడ్పీ సీఈవో పవన్ కుమార్, డీపీఓ జగదీశ్వర్, డీఆర్‌డీఓ గీత, పంచాయతీరాజ్ డీఈ జనార్ధన్, మాస్టర్ ట్రైనర్లు, సర్పంచులు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నర్సరీల్లో పెంచే మొక్కలను సిద్ధం చేయాలి

కరీంనగర్ కార్పొరేషన్, జులై 9(ప్రజా జ్యోతి ):- వన మహోత్సవానికి నగరపాలక సంస్థ నర్సరీల్లో పెంచే మొక్కలను సిద్ధం చేయాలని కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన " వన మహోత్సవ " కార్యక్రమంలో భాగంగా గురువారం కరీంనగర్ నగరంలోని పద్మానగర్ బుల్ సెమన్ సెంటర్ ఆవరణలో గల నగరపాలక సంస్థ "నర్సరీ" ని ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సందర్శించారు. నర్సరీ పరిసరాల్లో పర్యటించి.. పెంపకం చేస్తున్న వివిధ రకాల పూల మొక్కలు, పండ్ల మొక్కలు, ఔషధ మొక్కలతో పాటు ఇతర మొక్కలను తనిఖీ చేసి పరిశీలించారు. నగరపాలక సంస్థ పరిదిలో చేపట్టబోయే " వన మహోత్సవానికి" నర్సరీల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న మొక్కల రకాలు, వాటి సంఖ్యా వివరాలను ఇంజనీరింగ్ అధికారులు, నర్సరీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పండ్ల మొక్కలు పూల మొక్కలు ఔషధ మొక్కలు వారిగా ప్రస్తుతం ఎన్ని మొక్కలు సిద్దంగా ఉన్నాయనే నివేదికను సేకరించారు. నర్సరీ లో పెంపకం చేస్తున్న మొక్కల సంరక్షణ చర్యల పై ఆరా తీశారు. పలు సూచనలు చేస్తూ... ఇంజనీరింగ్ అధికారులు, నర్సరీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.
ఈ సందర్భంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ... నగరపాలక సంస్థ పరిదిలో చేపట్టబోయే "వన మహోత్సవం" ను అధికారులు ప్రతిష్టాత్మకంగా తీస్కోవాలన్నారు. నగర వ్యాప్తంగా వివిధ పద్దతుల్లో మొక్కలు



నాటేందుకు నిర్దేశించుకున్న లక్ష్యానికి సరిపడా నర్సరీల మొక్కలను సిద్దం చేయాలన్నారు. నగర పాలక సంస్థ ద్వారా నర్సరీల్లో పెంచే మొక్కల సంరక్షణ చర్యల పై ఎలాంటి నిర్లక్ష్యం వహించ రాదని నర్సరీ సిబ్బందిని హెచ్చరించారు. నగర వ్యాప్తంగా చేపట్టే " వన మహోత్సవానికి " గుర్తించిన స్థలాల ప్రకారం మొక్కలు నాటేందుకు గుంతలను పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సీజన్ లో పెద్ద సంఖ్యలో వివిధ పద్దతుల్లో మొక్కలు నాటేందుకు అధికారులు చర్యలు తీస్కోవాలన్నారు. గుర్తించిన స్థలంలో ఉన్న సాయిల్ కు అనువైన మొక్కలను ఎంపిక చేయాలని... నాటిన ప్రతి మొక్క జీవించేలా రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. గుంతలు తీసిన స్థలాల్లో మొక్కలు నాటే ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ నర్సరీలను మరింతగా అభివృద్ధి చేసి, భవిష్యత్తు అవసరాలకు సరిపడా పెద్ద సంఖ్యలో నాణ్యమైన మొక్కలను పెంచేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులు, నర్సరీ సిబ్బందిని ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఈఈ లచ్చిరెడ్డి, ఏఈ నర్మధ, నర్సరీ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల అవసరాలకు అనుగుణంగా గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి

- ఇందిరమ్మ గృహాల అర్హుల జాబితాను గెజిటెడ్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలి
- ఎంపీడీవోలు సమన్వయంతో పారదర్శకంగా గృహాల ధృవీకరణ పూర్తి చేయాలి

పెద్దపల్లి ప్రతినిధి, జూలై 09 ప్రజా జ్యోతి;
గ్రామాల సమగ్రాభివృద్ధికి గ్రామాల అవసరాలకు అనుగుణంగా గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక ను రూపొందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,, గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని, చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, మంజూరైన నిధులతో పూర్తయిన పనులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గ్రామ వనరులను వినియోగించుకుని ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీ తమ పరిధిలో ఉన్న సహజ వనరులు, స్థానిక ఆదాయ మార్గాలను గుర్తించి, పంచాయతీ ఆదాయాన్ని పెంచుకునే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. ఆర్థికంగా బలోపేతం అయితేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని, గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని,ఘన వ్యర్థాల నిర్వహణ ప్రతి ఇంటి నుంచి ప్రారంభం కావాలన్నారు. తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా జాబ్ కార్డు కలిగిన ప్రతి గ్రామీణ పేద కుటుంబానికి 125 రోజుల పని దినాలు కల్పించాలని, తద్వారా కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, మహిళా సంఘాల కార్యకలాపాలకు ఉపయోగపడే వీఓ భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ప్రతి గ్రామ పంచాయతీ రాబోయే మూడు సంవత్సరాల కాలానికి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక ను రూపొందించుకోవాలని, ఇది కేవలం పత్రాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోరారు. ఇందిరమ్మ కమిటీ ప్రతిపాదించిన గృహాల అర్హుల జాబితాను గెజిటెడ్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ధృవీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ




ప్రక్రియలో మండల అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు) సమన్వయ బాధ్యతలు చేపట్టి, తమ పరిధిలోని గెజిటెడ్ అధికారులకు గృహాల ధృవీకరణ బాధ్యతలను కేటాయించాలని ,ధృవీకరణ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పి సీఈఓ నరేందర్, జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రాజేశ్వర్, సంబంధిత అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు, పాల్గొన్నారు.

# కరీంనగర్ డైరీ ఆధ్వర్యంలో పుస్తేమట్టెలు పంపిణీ

ఇల్లంతకుంట జూలై 9(ప్రజజ్యోతి)
రాజన్నసిరిసిల్లా జిల్లా ఇల్లంతకుంట మండలం ఓబులాపూర్ గ్రామంలో పాడిరైతు ఏనుగుల భాస్కర్–శిరీషల కూతురు లహరి



వివాహ్నానికి గురువారం రోజు హాజరై కరీంనగర్ డెయిరీ పుస్తెమట్టెలు అందజేసిన రూట్ సూపర్వైజర్ గుర్రం సతీష్ రెడ్డి ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ డెయిరీ అనేక సంక్షేమ కార్యక్రమాలు చెపట్టిందని అందులో భాగంగా కళ్యాణమస్తు పథకం ద్వారా ఆడబిడ్డ పెళ్ళికి పుస్తెమట్టెలు అందజేశామని తెలిపారు ఈకార్యక్రమంలో ఓబులాపూర్ పాల ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షులు ఏనుగుల సుధాకర్ సెక్రటరీ చింతలఠాణ లక్ష్మి రాజం టెస్టర్ ఏనుగుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం

..మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో శాస్త్రవేత్త డా. రాంచంద్రుడు పిలుపు

పెద్దపల్లి ప్రతినిధి, జూలై 9 ప్రజా జ్యోతి;
పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కోదూరుపాక గ్రామంలోని వాగుడ్డుపల్లిలో రైతు దేవరానేని రాజేశ్వర్‌రావు వ్యవసాయ భూమిలో గురువారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మెగా ప్లాంటేషన్ కార్యక్రమం



నిర్వహించారు. ఈ సందర్భంగా 20 ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా పెద్దవేగిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాంచంద్రుడు హాజరై రైతులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ దీర్ఘకాలిక ఆదాయ పంట అని, నాటిన మూడో సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమవుతుందని తెలిపారు. సరైన నీటి యాజమాన్యం, ఎరువుల నిర్వహణ పాటిస్తే అధిక దిగుబడులతో పాటు రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగు వైపు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిన్నకల్వల ఫాక్స్ చైర్మన్ దేవరానేని మోహన్‌రావు, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యాంప్రసాద్, తిరుమల ఆయిల్ పామ్ సీఈఓ కేషు కల్యాంకర్, ఉద్యాన అధికారి సుంకే మహేష్, ఉద్యాన విస్తరణ అధికారులు, ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీధర్, రైతులు దేవరానేని రాజేశ్వర్‌రావు, సంపత్‌రావు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మల్లన్న పల్లెలో రైతులకు అవగాహన కార్యక్రమం

చొప్పదండి, జూలై 9 (ప్రజా జ్యోతి):
చొప్పదండి మండలం మల్లన్న పల్లి గ్రామంలో గురువారం రైతులకు జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పథకంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టి ఆర్ వి కే శాస్త్రవేత్త మధుకర్ రావు మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయంలో జీవ ఎరువులు, వివిధ రకాల కషాయం తయారీ విధానాలు వివరించారు. ద్రవ జీవామృతం, ఘన



జీవామృతం, పురుగు నియంత్రణకు నీమాస్త్రం, అగ్ని శాస్త్రం, బ్రహ్మాస్త్రం తయారీ విధానాల గురించి తెలిపారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని తద్వారా నేలసారం పెరుగుతుందని పేర్కొన్నారు. మండల వ్యవసాయ అధికారి మమత, ఏ ఈ ఓ లు కవితా, రమ్య జ్యోత్స్న ,సంపత్ తదితరులు పాల్గొన్నారు.

### సొంతింటికల కాంగ్రెస్
## పార్టీతోనే సాధ్యం ఎమ్మెల్యే రాగమయి



**సత్తుపల్లి జూలై09(ప్రజా జ్యోతి)** ప్రతి మనిషి జీవితంలో స్థిరపడాలి అంటే కచ్చితంగా సొంతంగా ఇల్లు ఉండాలి అని,ఆ సొంతింటి కల నెరవేర్చేది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవు తుందని,సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. గురువారం పట్టణంలోని గాంధీ నగర్ రోడ్ నెంబర్ 6 గల మేకల అరుణ కుమారి కి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ఇటీవల మంజూరు చేసింది. ఇంటి యజమానులు నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసుకుని, గృహప్రవేశ ఏర్పాట్లకు గురువారం ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె నూతన గృహాన్ని ప్రారంభించి, దంపతులకు నూతన వస్త్రాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే నిరుపేదలు లబ్ధి పొందుతున్నారని, సొంత ఇంటి కల నెరవేరేది కూడా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్ , వైస్ చైర్పర్సన్ బొంతు సుమలత, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, గాదె చెన్నారావు, మండల పార్టీ అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి,చల్లగుండ్ల నరసింహారావు,పింగళి సామేలు, జీవన్,కాంగ్రెస్ నాయకులు,మహిళలు ఉన్నారు.

### నూతన వధూవు వరులను
## ఆశీర్వదించిన మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల



**చింతకాని జులై 09 ప్రజాజ్యోతి :**మండలం కొదుమూరు గ్రామానికి చెందిన రాచబంటి వెంకటేశ్వర్లు జయమ్మ గార్ల ఏకైక పుత్రుడు కిరణ్ వివాహం జ్యోతి ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఆ వివాహానికి ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ మండల నాయకులు మంకెన రమేష్, జిల్లా రైతు సంగం అధ్యక్షులు మాదినేని రమేష్, చింతకాని సొసైటీ వైస్ చైర్మన్ మాదినేని రవి,బొగ్గరపు రాంబాబు పిన్నెల్లి శ్రీనివాస్ అడ్వకేట్ కన్నెబోయిన నాగేశ్వర రావు,నన్నక నరసింహారావు, మాజీ సర్పంచ్ రచ్చబంటి రమేష్, మేకపోతుల సైదేశ్వర రావు,ఉప సర్పంచ్ చిట్టిమోదు రాంబాబు.

## నూతన బోర్ ప్రారంభించిన ఎమ్మెల్యే రాగమయి

● ప్రభుత్వ ఆసుపత్రి నీటి కొరతను తీర్చిన ఎమ్మెల్యే





**సత్తుపల్లి జూలై09(ప్రజా జ్యోతి)** పట్టణంలోని ఇటీవల నూతనంగా నిర్మించి, ప్రారంభించిన 100 పడకల ఆసుపత్రిలో నీటి సమస్య ఉందని,తెలుసుకున్న సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఇటీవల బోరు వేపించి, గురువారం మోటార్ ఏర్పాటు చేపించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు నీటి కొరత ఉండకూడదనే ఉద్దేశంతో,నూతన బోర్ శాంక్షన్ చేపించి ప్రారంభించి, వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకునే బాధ్యత మనదేనని తెలిపారు. రోగులకు సకల సౌకర్యాలు కావాలి కాబట్టి ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహ, ప్రభుత్వాసుపత్రి సూపర్డెంట్ సురేష్, మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్, వైస్ చైర్పర్సన్ బొంతు సుమలత, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, గాదె చెన్నారావు, చల్లగుండ్ల నరసింహారావు,పింగళి సామేలు, కాంగ్రెస్ నాయకులు అభిమానులు ఉన్నారు.

## ఎమ్మెల్యే అండదండలతో బుగ్గపాడును అభివృద్ధి చేస్తాం

● బుగ్గపాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు



**సత్తుపల్లి జూలై09 (ప్రజా జ్యోతి)** సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఇటీవల ప్రకటించిన బుగ్గపాడు కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు అందరూ కలిసి అధ్యక్ష పదవులు కార్యదర్శులు ఇచ్చినందుకు,వివిధ రకాల అధ్యక్ష పదవుల తరఫున ఆమెకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుగ్గపాడు అభివృద్ధి చేసేందుకు తామంతా ఏకతాటిపై ఉండి ,ఎమ్మెల్యే సహాయ సహకారాలతో క్షేత్రస్థాయి నుంచి అభివృద్ధి చేస్తామని, నిరుపేదలకు కావలసిన ఇందిరమ్మ ఇండ్లు,రోడ్లు, డ్రైనేజీలు, ఇళ్లస్థలాలు, పోడు భూములకు రావలసిన పట్టాలు,సోలార్ లైట్లు ఎక్కడ ఇబ్బంది ఉంటే అక్కడ సమస్యను తీర్చే విధంగా,సమస్యలు లేని బుగ్గపాడు గ్రామాన్ని తీర్చిదిద్దాలని, సమస్య వచ్చిన వారితో కలిసి సమస్య తీరిపోయేంతవరకు కచ్చితంగా అండగా ఉంటామని అన్నారు. ఏమైనా ఇబ్బంది ఉంటే మన మండల పార్టీ అధ్యక్షుడు ద్వారా గాని, ఎమ్మెల్యే ద్వారా గాని సమస్యకు సానుకూలంగా పరిశీలించేంతవరకు కృషి చేస్తామని తెలియజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించే విధంగా,మా సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. ప్రతి ఒక్క విధివిధానాల నుండి అధ్యక్ష కార్యదర్శులు పదవులు ఇవ్వటం ఎంతో ఆనందంగా ఉందని, ఆమెకు కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పరసా రాఘవరావు, బీసీ సెల్ అధ్యక్షులు మోదమూడి శ్రీనివాసరావు, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కూర మహేంద్ర, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కేసరి అరవింద్,మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కంచర్ల సీతామహాలక్ష్మి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోయినపల్లి సందీప్ కుమార్, ఎన్ ఎస్ యు గ్రామ అధ్యక్షులు అద్దం సాయి బాబా, రైతు కాంగ్రెస్ అధ్యక్షులు చిట్టి మాది నాగభూషణం, కార్మిక విభాగ అధ్యక్షులు జైగా సురేష్,సోషల్ మీడియా అధ్యక్షులు కేసరి వంశీ, ప్రచార కమిటీ అధ్యక్షులు పల్సర్ సాంబశివరావు, బూత్ కమిటీ అధ్యక్షులు పరసా నాగయ్య, సభ్యత్వ నమోదు కమిటీ అధ్యక్షులు పరసా జగదీష్ వీరిని శాసన సభ్యురాలు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల,హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు.

### నాగన్న గొంతు ఎత్తితే గోదావరి
## లోయంతా ఊగింది: సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ



**టేకులపల్లి, జూలై 09,ప్రజాజ్యోతి:** ప్రజాకళాకారుడు అమరుడు అరుణోదయ నాగన్న ప్రజా చైతన్యానికి తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత కళాకారుడని,ఆయన గొంతు ఎత్తితే గోదావరి లోయంతా ఉద్యమ స్ఫూర్తితో ఊగేదని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు అన్నారు.అమ రుడు అరుణోదయ నాగన్నకు నివాళులర్పిస్తూ గురువారం టేకులపల్లిలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ మండల కమిటీ అధ్వర్యంలో నిర్వహించిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఐఎఫ్టీయూ రాష్ట్ర నాయకులు డి. ప్రసాద్ మాట్లాడుతూ, నాగన్న తన గాత్రంతో ప్రజా సమస్యలను పాటల రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లి, పాలక వర్గాల దోపిడీని ఎండగట్టారని అన్నారు.దాదాపు ఐదు దశాబ్దాలపాటు అరుణోదయ సాంస్కృతిక సంస్థలో కొనసాగిన నాగన్న పాటలు, బుర్రకథలు, నాటికల ద్వారా గోదావరి లోయ ప్రాంతంతో పాటు పలు రాష్ట్రాల్లో ప్రజలను చైతన్యవంతం చేశారని పేర్కొన్నారు. అరుణోదయ సంస్థతో ఆయనకున్న అనుబంధం కారణంగా "అరుణోదయ"నే ఇంటిపేరుగా ప్రజల్లో గుర్తింపు పొందారని, పేద ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. నాగన్న ఆశయాల సాధన కోసం ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అవుతుందని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి ఎట్టి నరసింహారావు, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్తీ వెంకటేశ్వర్లు, మండల నాయకులు గుగులోతు రామచంద్, భూక్య హర్జా, మేకలవినోద్, భూక్య నర్సింగు, బానోతు వెంకట్రాం, ఆంబోతు బాలు, గుగులోతు చంద్యా, అనంతోజు చంద్రచారి, ధరావత్ వెంకన్న, పూనెంసమ్మయ్య తదితరులు పాల్గొని నాగన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### గౌతమ్ స్కూల్‌లో డిజిటల్
## తరగతులను ప్రారంభించిన ఎస్ఐ శ్రీనివాసరెడ్డి






**నేలకొండపల్లి, జూలై 09, ప్రజా జ్యోతి:** నేలకొండపల్లి మండల కేంద్రంలోని గౌతమ్ హైస్కూల్‌లో గురువారం డిజిటల్ క్లాస్ రూమ్‌లను స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) పి. శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. నేటి ఆధునిక యుగంలో డిజిటల్ క్లాస్‌రూమ్‌ల ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. దృశ్య, శ్రవణ మాధ్యమాల (డిజిటల్ క్లాసెస్) ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమవుతాయని, సాంకేతికతను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులకు ఎస్ఐ చేతుల మీదుగా ట్యాబ్‌లను అందజేశారు.

**సైబర్ భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన:**
డిజిటల్ తరగతుల ప్రారంభం అనంతరం విద్యార్థులతో ఏర్పాటు చేసిన సదస్సులో ఎస్ఐ శ్రీనివాసరెడ్డి గారు మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని, వాటిని తప్పనిసరిగా పాటించాలని కోరారు. అలాగే గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలను, వాటికి దూరంగా ఉండటం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. యువత మత్తు పదార్థాల బారిన పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.

**ఎస్ఐ ఘన సత్కారం:**
ఈ సందర్భంగా గౌతమ్ స్కూల్ యాజమాన్యం ఎస్ఐ శ్రీనివాసరెడ్డి ని శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ స్కూల్ కరస్పాండెంట్ కనపర్తి కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ కనపర్తి నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ చక్రధర్, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్న
## నేటి రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయండి

● ఎర్రుపాలెం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మధిర వర్గం చింతకాని మండలం జగన్నాధపురంలో ఈ నెల 10న అనగా రేపు నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఎర్రుపాలెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. గత నెల 30న మధిర నియోజకవర్గంలో జరగాల్సిన రైతు ఆశీర్వాద సభ భారీ వర్షాల కారణంగా వాయిదా పడిందని, అదే రైతు ఆశీర్వాద సభను నేడు మధ్యాహ్నం 2 గంటలకు జగన్నాధపురంలో నిర్వహిస్తున్న రైతు ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారని, అదే విధంగా ఉప ముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్క మల్లు రెవెన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు కూడా పాల్గొంటారని తెలిపారు. అదే విధంగా రైతు శ్రేయస్సే లక్ష్యంగా 9 రోజులలో 9000 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా నిధులు రైతుల ఖాతాలలో జమచేసి ప్రజా పాలన గా ప్రభుత్వం రికార్డు సృష్టించిందని కావున ఎర్రుపాలెం మండలం లోని రైతులు, కాంగ్రెస్ శ్రేణులు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటి చైర్మన్ బండారు నరసింహారావు, టీపీసీసీ నాయకులు శీలం ప్రతాప్ రెడ్డి, మాజీ భద్రాచలం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ఆయులూరి వెంకటేశ్వర రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ లు శీలం శ్రీనివాస్ రెడ్డి, కడియం శ్రీనివాసరావు, యన్నం పిచ్చిరెడ్డి, కంచర్ల వెంకట నరసయ్య, జిల్లా సెక్రటరీ సగ్గుర్తి వెంకట నారాయణ, మండల సీనియర్ నాయకులు అనుమోలు వెంకట క్రిష్ణారావు, సముద్రాల పురుషోత్తం, యూత్ కాంగ్రెస్ నాయకులు దేవరకొండ రాజీవ్ గాంధీ, పెగళ్లపాడు సర్పంచ్ కాకర్లమూడి అనిల్ తదితరులు నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి భూమికి భూధార్ యూనిక్ నంబర్ కేటాయింపు

● రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి లోకేష్ కుమార్





**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 9,(ప్రజా జ్యోతి)** రాష్ట్రంలో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపుగా భూధార్ యూనిక్ నంబర్ కేటాయించే లక్ష్యంతో చేపడుతున్న భూముల రీ సర్వేను సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్ లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భూముల రీ సర్వే, భూ భారతి దరఖాస్తుల పరిష్కారం, సర్వేయర్ల శిక్షణ, సాంకేతిక ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ మొదటి దశలో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీ సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. డీజీపీఎస్ రోవర్స్, జి ఐ ఎస్ సాంకేతికతను వినియోగించి ప్రతి భూమి సరిహద్దులను నిర్ధారించి, ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపుగా భూధార్ యూనిక్ నంబర్ కేటాయిస్తామని చెప్పారు. రీ సర్వే ప్రారంభానికి ముందు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజాప్రతినిధులు, రైతులు, భూ యజమానులకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. సర్వేయర్లకు సమగ్ర శిక్షణ ఇచ్చిన అనంతరమే రీ సర్వేను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా భూ భారతి కింద అందుతున్న దరఖాస్తులు 60 రోజులకు మించి పెండింగ్‌లో ఉండకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రజలకు రెవెన్యూ సేవలు అందేలా అన్ని జిల్లాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఐ డి ఓ సి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, జిల్లాలో రీ సర్వేను ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా అమలు చేసేందుకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడతామని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి, రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. భూ భారతి వెబ్‌సైట్‌లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను ముఖ్య కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లిన కలెక్టర్ అంకిత్, వాటి పరిష్కారానికి తగిన సాంకేతిక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వెబ్‌సైట్ సమస్యలు పరిష్కారమైతే దరఖాస్తుల పరిశీలన మరింత వేగవంతమై, ప్రజలకు సేవలు సకాలంలో అందుతాయని వివరించారు.

## మద్యం.. క్షణిక మత్తు, జీవితాంతం విషాదం

● ఒక వ్యక్తి వ్యసనం.. కన్నీళ్లలో మునిగిపోతున్న కుటుంబాలు ● మేల్కొనాల్సిన యువత, స్పందించాల్సిన సమాజం

**టేకులపల్లి, జూలై 09, ప్రజాజ్యోతి:** ఒక గ్లాసు మద్యం... ఒక కుటుంబం భవిష్యత్తును చిదిమేయడానికి చాలనేది నేటి సమాజంలో కనిపిస్తున్న చేదు వాస్తవం. సరదాగా మొదలయ్యే మద్యం అలవాటు, క్రమంగా వ్యసనంగా మారి యువత కలలను, కుటుంబాల ఆనందాన్ని, తల్లిదండ్రుల ఆశలను బూడిద చేస్తోంది. మద్యం మత్తులో తీసుకునే ఒక్క తప్పు నిర్ణయం జీవితాన్ని శాశ్వతంగా మార్చేస్తోంది. ఇటీవలి కాలంలో మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. రాత్రి ఇంటి నుంచి "వెళ్లి వస్తాను" అని చెప్పిన కుమారుడు తిరిగి రాకపోవడం, భర్త కోసం ఎదురు చూసిన భార్యకు ఆసుపత్రి నుంచి ఫోన్ రావడం, తండ్రి కోసం ఎదురుచూసే చిన్నారి చివరకు అతని ఫోటోకే పూలమాల వేయాల్సిన దుర్భర పరిస్థితులు సమాజాన్ని కలచివేస్తున్నాయి. ప్రమాదంలో ప్రాణాలు దక్కినా జీవితం మునుపటిలా ఉండదు. లక్షల రూపాయల వైద్య ఖర్చులు, అప్పుల భారం, శాశ్వత వైకల్యం, ఉపాధి కోల్పోవడం...ఇవన్నీ ఒక కుటుంబాన్ని ఆర్థికంగా, మానసికం గా కుంగదీస్తాయి. ఒకరి మద్యం వ్యసనం వల్ల భార్య కూలి పనుల కు వెళ్లాల్సి రావడం, పిల్లలు చదువును మధ్యలోనే మానేయ డం,వృద్ధ తల్లిదండ్రులు కుమారుడి పరిస్థితిని చూసి రోజూ కన్నీరు పెట్టుకోవడం వంటి సంఘటనలు తరచూ కనిపిస్తున్నాయి.మద్యం వ్యసనం కేవలం ఆరోగ్యాన్నే కాదు, మనిషి వ్యక్తిత్వాన్ని, గౌరవాన్ని, కుటుంబ బంధాలను కూడా నాశనం చేస్తుంది.ఒకప్పుడు గౌరవంగా చూసిన వ్యక్తిని సమాజం వ్యసనపరుడిగా చూడడం,బంధువులు దూరం కావడం, స్నేహితులు నిర్లక్ష్యం చేయడం, ఉద్యోగ అవకాశాలు కోల్పోవడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. చివరికి "మద్యం అతని జీవితాన్ని నాశనం చేసింది" అనే మాట మాత్రమే మిగులుతోంది. సామాజిక బాధ్యతలో భాగంగా అధికారులు మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, గ్రామాలు, పాఠశాలలు, కళాశాలల్లో వ్యసన నిర్మూలనపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ వారి అలవాట్లు, స్నేహాలు, ప్రవర్తనపై శ్రద్ధ చూపాలి. యువత క్షణిక మత్తు కోసం తమ బంగారు భవిష్యత్తును పణంగా పెట్టకుండా కుటుంబం,ఆరోగ్యం,విద్య, ఉపాధి, సమాజం పట్ల బాధ్యతతో ముందుకు సాగాలి.

**ఒక్క క్షణం ఆలోచించండి**
మీ కోసం ఎదురుచూస్తున్న అమ్మ కళ్లలో ఆనందం చూడాలా? లేక కన్నీటి ధారలు చూడాలా?మీ పిల్లలకు ఆదర్శంగా నిలవాలా? లేక వారి జీవితంలో తీరని విషాదంగా మిగిలిపోవాలా?మీ కుటుంబానికి అండగా ఉండాలా? లేక భారంగా మారాలా?మద్యం క్షణిక మత్తును మాత్రమే ఇస్తుంది... కానీ జీవితాంతం పశ్చాత్తాపాన్ని మిగులుస్తుంది. మద్యం కాదు... కుటుంబమే మన బలం.తాగి వాహనం నడపొద్దు. వ్యసనానికి బానిస కావొద్దు. మీ జీవితం అమూల్యమైనది... మీ కుటుంబానికి మీరు అవసరం.

**ఈ ఘటనే ఒక హెచ్చరిక**
టేకులపల్లి మండలంలో ఇటీవల జరిగిన ఒక రోడ్డు ప్రమాదం మద్యం వ్యసనం ఎంతటి విషాదానికి దారితీస్తుందో కళ్లకు కట్టినట్లు చూపించింది. స్థానికుల కథనం ప్రకారం, కోట్ల ఆశలు పెట్టుకుని డ్రైవర్‌గా ప్రారంభించి కష్టపడి లారీ యజమానిగా ఎదిగిన రాజ్‌కుమార్ తన వాహనాన్ని ఇంటి సమీపంలో నిలిపి విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో,ఇసుక లోడుతో వెళ్తున్న మరో లారీ అదుపుతప్పి ముందుగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొని, అనంతరం నిలిపి ఉన్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనతో రాజ్‌కుమార్ జీవితం ఒక్కసారిగా అంధకారంలోకి వెళ్లిపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ ప్రమాదానికి మద్యం మత్తు కారణమై ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో,అధికారుల విచారణలో వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది. అయితే ఒకరి నిర్లక్ష్యం, ఒకరి వ్యసనం మరొక కుటుంబానికి తీరని శాపంగా మారకూడదని ప్రజలు కోరుతున్నారు.మద్యం క్షణిక ఆనందాన్ని ఇవ్వొచ్చు... కానీ ఒక నిర్లక్ష్య నిర్ణయం అనేక కుటుంబాల జీవితాలను శాశ్వత విషాదంలోకి నెట్టివేయగలదు. మద్యం సేవించి వాహనం నడపొద్దు.మీ ప్రాణాలను, ఇతరుల ప్రాణాలను కాపాడండి.

## తెలంగాణలో భూముల రీ- సర్వే ముమ్మరం

### సీసీఎల్ఏ లోకేష్ కుమార్

ఆదిలాబాద్ బ్యూరో, జూలై 9, (ప్రజా జ్యోతి): రాష్ట్రంలో భూముల రీ–సర్వే ప్రక్రియను వేగవంతం చేయా లని భూ పరిపాలన ప్రధాన క మిషనర్ (సీసీఎల్ఏ) లోకేష్ కుమార్ అధికారు లను ఆదే శించారు. గురువారం హైదరా బాద్ నుండి సర్వే కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి రీ–సర్వే పురోగతి, తదు పరి చేపట్టాల్సిన చర్యలపై ఆ యన ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా భూపరిపాలన ప్ర ధాన





కమిషనర్ మాట్లాడు తూ రీ–సర్వే ప్రాజెక్ట్ కింద రా ష్ట్రంలోని నాన్–క్లస్టర్ పరిధిలో ని 373 గ్రామాలతో పాటు, ప్ర తి జిల్లా నుండి 70 గ్రామాల చొప్పున మొత్తం 2,200 గ్రా మాలను ఎంపిక చేయడం జ రిగిందని తెలిపారు. ఈ గ్రా మాల్లో సర్వేను వేగంగా పూర్తి చేసేందుకు వీలుగా రెగ్యులర్ సర్వేయర్లతో పాటు లైసెన్స్డ్ సర్వేయర్ల సేవలను సైతం వి నియోగించుకోవాలని నిర్ణ యించారు. రాబోయే నవంబ ర్ నాటికి దాదాపు 50 నుండి 60 శాతం రీ–సర్వే పనులను ముగించేలా స్పష్టమైన ప్రణా ళికతో ముందుకు సాగాలని అధికారు లకు ఆయన దిశా నిర్దేశం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుండి జిల్లా క లెక్టర్ రాజర్షిషా, అదనపు క లెక్టర్ ఆర్.ఎస్.చిత్రూ, ల్యాం డ్ సర్వే ఏడి ప్రభాకర్, తదిత రులు పాల్గొన్నారు.

## హాట్ టాపిక్‌గా కాంగ్రెస్ పంచాయితీ

### కొండా వర్సెస్, కడియం అన్నట్లుగా పరిస్థితులు
### మంత్రి పనితీరుపై కాంగ్రెస్ నేతలల్లో అసంతృప్తి

వరంగల్,జూలై9(ప్రజాజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ నేతల మధ్య కొనసాగుతున్న విభేదాలు జిల్లాలో అలజడి సృష్టిస్తున్నాయి. ఇప్పుడు కొండా వర్సెస్ కడియం లాగా పరిస్థితి మారింది. కొండా తీరుపైనా స్థానికంగా వ్యతిరేకత వస్తోంది. దేవాలయాలను గాలికి వదిలేశారని, అన్యాక్రాంత భూములపై చర్యలు తీసుకోవడం లేదని కాంగ్రెస్‌లోనే విమర్శలు ఉన్నాయి. ఇకపోతే తాజా వివాదం టీపీసీసీ దృష్టికి చేరాయి. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను బుధవారం కలిసి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖకు సంబంధించిన అంశాలపై తనకు సమాచారం ఇవ్వకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏకపక్షంగా సమీక్షా సమావేశం నిర్వహించారని, ఇది ప్రభుత్వ ప్రోటోకాల్‌కు విరుద్ధమని కొండా సురేఖ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై పార్టీ పరంగా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆమె టీపీసీసీ అధ్యక్షుడిని కోరారు. ఇదే విషయంపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ఆమె వివరించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా స్పందించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లాలో నెలకొన్న రాజకీయ పరిణామాలు, గ్రూపు రాజకీయాలపై పార్టీ ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటోందని చెప్పారు. కొండా సురేఖ, కడియం శ్రీహరి ఇద్దరితో త్వరలోనే మాట్లాడి వివాదాన్ని సామరస్యంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం, పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఎవరూ వ్యవహరించకూడదని, అలాంటి చర్యలను పార్టీ ఏమాత్రం సహించబోదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై అవసరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని ఆయన తెలిపారు.

## బిఆర్ఎస్ ఖాతాలోని 1400 కోట్లు పంచాలి

### అమరుల కుటుంబాలకు పంచి నిజాయితీ చాటాలి
### టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత డిమాండ్

భద్రాద్రికొత్తగూడెం,జూలై9(ప్రజాజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ఖాతాలోని రూ.1,400 కోట్లు అమరుల కుటుంబాలకు పంచాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఆ డబ్బు క్విడ్ ప్రోకో ద్వారా వచ్చింది కాదా?అని ప్రశ్నించారు. బాయిబాట కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెంలో కవిత పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మా పార్టీతో భయం లేదంటూనే ఈసీకి వెయ్యికి పైగా ఫిర్యాదులు ఇచ్చారు. టీఆర్ఎస్ పేరు నాకు రాకుండా కుట్రలు చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీకి నీతినియమాలు అంటూ ఏమీ లేవా? తల్లి, చెల్లి అనే సభ్యత మరిచి పార్టీ సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. నా కంఠంలో ప్రాణముండగా మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్లను. నా పోరాటాలు ప్రజల్లోకి వెళ్లకుండా కాంగ్రెస్, భాజపా చేతులు కలిపాయని ఆరోపించారు. ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు క్విడ్ ప్రోకో కింద కేటీఆర్ అక్రమ పర్మిషన్లు ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో హరీశ్‌రావు అనకొండ. బీఆర్ఎస్ పార్టీ ఇంకా ఆయన్నే ముందు పెడుతోంది. ఆ పార్టీ ఈ జన్మలో బాగుపడదు.. అధికారంలోకి రాదు. పెద్దాయనకు మరకలు అంటించిన ఆయనకు 3 నెలలు మంత్రి పదవి కావాలంట. కేటీఆర్ ఇటీవల రూ.188 కోట్లతో ఓ ఇంగ్లిష్ పత్రిక కొన్నారు. ఫీనిక్స్ సంస్థకు రూ.80వేల కోట్ల విలువైన భూముల కట్టబెట్టారు. ఆ సంస్థ రూ.33 లక్షల టన్నుల కలప కొట్టేస్తోందని కవిత ఆరోపించారు.

## బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్

హైదరాబాద్,జూలై9(ప్రజాజ్యోతి): కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కు ఊరట లభించింది. పోక్సో కేసులో అతడికి తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. షరతులతో కూడిన బెయిల్ ఇచ్చిన ఉన్నత న్యాయస్థానం.. దర్యాప్తునకు సహకరించాలని బండి భగీరథ్‌ను ఆదేశించింది. హైదరాబాద్‌లోని పేట్‌బషీరాబాద్ పీఎస్‌లో అతడిపై పోక్సో కేసు నమోదైంది. మే 16న పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై ఇటీవల వాదనలు ముగియడంతో తీర్పును హైకోర్టు వాయిదా వేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ భగీరథ్ విద్యార్థి అని, 45 రోజులకుపైగా జైలులో ఉండటంతో జీవితంలో చాలా కోల్పోయాడన్నారు. పరస్పర అంగీకారంతో జరిగిన దానిపై కేసులు నమోదు చేయడం చెల్లదని.. ఇదే విషయాన్ని హైకోర్టు, సుప్రీంకోర్టులు పలు తీర్పుల్లో వెల్లడించాయన్నారు. బెయిల్ మంజూరు చేస్తే కోర్టు విధించిన షరతులకు కట్టుబడి ఉంటారన్నారు.

# సీనియర్ జర్నలిస్ట్ కు శుభోదయ కాలనీ మాజీ ప్రెసిడెంట్ బెదిరింపులు

- కాలనీలో అద్దెకు ఉండేవాడివి వార్తలు రాస్తావా అంటూ అవమానం
- శుభోదయ కాలనీ నుండి ఇల్లు ఖాళీ చేసి పోవాలంటూ బెదిరింపు
- వాస్తవాలను బయట ప్రపంచానికి తెలియకుండా జర్నలిస్టుల నోరు నొక్కుతున్న వైనం

అబ్దుల్లాపూర్ మెట్టు జూలై 09 (ప్రజాజ్యోతి) గత 24 సంవత్సరాలుగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ జర్నలిజం వృత్తిలో కొనసాగుతూ అదే కాలనీలో నివసిస్తున్న ఓ సీనియర్ జర్నలిస్టును అదే కాలనీకి చెందిన ఓ మాజీ కాలనీ ప్రెసిడెంట్ బెదిరింపులకు పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే లెక్చరర్స్ కాలనీ డివిజన్ కుంట్లూరు రోడ్డులోని శుభోదయ కాలనీ రోడ్ నెంబర్1లో గత వారం రోజుల నుండి ఒక మటన్ షాపు వద్ద నిత్యం డ్రైనేజీ పొంగిపొర్లి కాలనీ రోడ్డు మొత్తం తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది.కాలనీ అధ్యక్షుడికి సమస్య గురించి వివరించిన పరిష్కారం కాలేదు.ఈ క్రమంలో సదరు రిపోర్టర్ ప్రజాజ్యోతి దినపత్రికలో డ్రైనేజ్ సమస్యకు సంబంధించిన వార్త కథనాన్ని రాసి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించేందుకు శుభోదయ కాలనీకి గురువారం రావడం జరిగింది.పక్కనే ఉన్న ఒక బిల్డింగ్ నుండి వచ్చే డ్రైనేజ్ పైప్ లైన్ చిన్నగా ఉండడంతో సమస్య వస్తుందని గుర్తించిన అధికారులు ఆ ఇంటి యజమానితో సమస్య పరిష్కారానికి పెద్ద పైప్ లైన్ వేసుకోవాలని సూచించడం జరిగింది.ఆ సమయంలో సదరు రిపోర్టర్ ఆ ఇంటి యజమానితో సమస్య వివరిస్తుండగా అక్కడకు వచ్చిన శుభోదయ కాలనీ



మాజీ ప్రెసిడెంట్ చిందులు తొక్కుతూ మొన్నటి నుండి చూస్తున్నాను చాలా రెచ్చిపోతున్నావు,మా కాలనీలో అద్దెకు ఉంటూ కాలనీ సమస్యల గురించి వార్తలు రాస్తావా ఈ కాలనీ నుండి దెం.... అంటూ వ్రాయలేని భాషలో పదజాలం ఉపయోగించి తీవ్రంగా అవమానించడం జరిగింది.సదరు మాజీ కాలనీ ప్రెసిడెంట్ తన వ్యాపారం కోసం అద్దెకు తీసుకున్న షాపు ఇంటి యజమాని ఒక రిపోర్టర్ ను అలా అవమానించడం తప్పు అని వారించే ప్రయత్నం చేశాడు.అద్దెకు ఉండే రిపోర్టర్లు ప్రజా సమస్యలపై వార్తలు రాసే హక్కు లేదా? అద్దెకి ఉండే వాళ్లు అంటే వీరికి ఎందుకు చులకన? జర్నలిస్టులు ఇలాంటి అవమానాలను భరిస్తూ మనశ్శాంతిని కోల్పోతూ సమాజంలో నెలకొన్న సమస్యలను వ్రాయడంపై దృష్టి సారించలేని పరిస్థితులు నెలకొంటున్నాయని సదరు రిపోర్టర్ వాపోయారు. శుభోదయ కాలనీ పార్కులో హైమాస్ట్ లైట్ పనిచేయనప్పుడు, కాలనీలో వీధి దీపాలు వెలగనప్పుడు,కాలనీ రోడ్లపై చెత్త పేరుకుపోయినప్పుడు, డ్రైనేజీ సమస్య ఏర్పడినప్పుడు తన కలం ద్వారా పత్రికలో వార్త రాసి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించింది ఈ రెంటల్ రిపోర్టర్ అనే విషయాన్ని



మరచిపోవద్దన్నారు.మరి గత వారం రోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లి కాలనీలో రాకపోకలు కొనసాగించే వాహనదారులు బాటసారులు ఇబ్బందులు పడుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు.మీరు పట్టించుకుంటే తన దైనందిన పనులు మానుకొని అధికారుల చుట్టూ తిరిగే శ్రమ తనకు ఉండేది కాదు కదా అన్నారు.నిత్యం ప్రజా సమస్యలపై వార్తలు రాసే తాను తన ఇంటి ముందు సమస్యను పరిష్కరించుకోకుంటే తను జర్నలిజం వృత్తిలో కొనసాగడం వృధా అన్నారు.ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకు



రావడం మీడియా బాధ్యత అని, దాన్ని అడ్డుకునేందుకు బెదిరింపులకు పాల్పడడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు.తనపై ప్రత్యక్షంగా పరోక్షంగా ఏదైనా దాడి జరిగితే సదరు వ్యక్తి బాధ్యత వహించాలన్నారు.రెంటల్ రిపోర్టర్ అని అవమానించిన సదరు కాలనీ మాజీ అధ్యక్షుడు తన వ్యాపారాన్ని ఒక అద్దె ఇంటిలోనే కొనసాగిస్తుండడం ఇక్కడ కొసమెరుపు.

### 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్

# ఆర్థిక వ్యవస్థ



మొదటిపేజీ తరువాయి..

వెలుపలకు తరలించాలని నిర్ణయించాం. పెరి అర్బన్ రీజియన్‌లో ప్రత్యేక మాన్యుఫ్యాక్చరింగ్ జోన్లు ఏర్పాటుచేస్తున్నామని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి,



పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాజకీయంగా ఎన్ని ఆరోపణలు వచ్చినా తమ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని సీఎం అన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు ఉంటాయని, ప్రస్తుతం రాష్ట్ర అభివృద్ధికి అందరూ సహకరించాలని ప్రతిపక్షాలను కోరారు. అధికారం కోల్పోయిన బాధ ఉన్నా అభివృద్ధిని అడ్డుకోవద్దని, తమ ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్న సీఎం.. అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో రాకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేస్తున్నామని చెప్పారు. అందుకే ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న సుమారు 2,100 చ.కి.మీ. ప్రాంతాన్ని ఏరియాగా అభివృద్ధి చేయాలని నిర్ణయించామని తెలిపారు. అలాగే రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్ ప్రాంతాలుగా విభజించి సమతుల అభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని వెల్లడించారు.

దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ 10శాతం వాటా సాధించేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజల సహకారంతో 2034 నాటికి రాష్ట్రాన్ని1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించాలంటే మెరుగైన మౌలిక సదుపాయాలు అవసరమని సీఎం అభిప్రాయ పడ్డారు. యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అందించేందుకు అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు, స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీతారాంపూర్‌లో సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్ ప్రారంభం కావడం సంతోషకరమని పేర్కొన్న సీఎం.. ఈ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన కుటుంబాలకు ఇంటి పట్టాలు ఇవ్వడంతో పాటు ఉపాధి కోసం వ్యాపార సముదాయాలు నిర్మించి అందించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా రైతులు చేసిన త్యాగాల వల్లే ఈ అభివృద్ధి సాధ్యమైందని సీఎం కొనియాడారు. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే బుద్వేల్ నుంచి కొడంగల్ వరకు 100 మీటర్ల వెడల్పుతో రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. సీతారాంపూర్‌లో నిర్మిస్తున్న ఆలయ ప్రారంభోత్సవానికి త్వరలో మరోసారి వస్తానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజల సహకారంతో తెలంగాణను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

### వ్యవసాయ రంగానికి

# పెద్దపీట



మొదటిపేజీ తరువాయి..

జగన్నాథపురం మత్కేపల్లి క్రాస్ రోడ్డులో రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతు ఆశీర్వాద సభకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేబినెట్ మంత్రులు అందరినీ ఆహ్వానించామని పేర్కొన్నారు. పదేళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ రైతు భరోసాకు రూ.75 వేల కోట్లు ఖర్చు చేసిందని మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాకు కేవలం రెండున్నరేళ్లలో రూ.35 వేల కోట్లను రైతులకు అందజేసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో క్రాప్ డ్యామేజ్‌కి ఒక్క రూపాయి కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో రైతుల కోసం పని చేస్తోందని స్పష్టం చేశారు. రైతుభరోసా కింద కేవలం తొమ్మిది రోజుల్లో ఎనిమిది ఎకరాల చొప్పున పూర్తిస్థాయిలో అందరికీ రూ.8759 కోట్లు ఇచ్చామని వెల్లడించారు. రైతు ఆశీర్వాద సభలో మరో రూ.1900 కోట్లు రైతు భరోసాకు తొమ్మిది ఎకరాల నుంచి యాభై ఎకరాల వరకూ విడుదల చేయనున్నామని తెలిపారు. అన్నదాతలు రైతు ఆశీర్వాద సభకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాధపురంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న మెగా రైతు మేళాను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, జిల్లా కలెక్టర్ దివాకరతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ సాంకేతికతపై అవగాహన కల్పించడమే ఈ మెగా రైతు మేళా ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు.మెగా రైతు మేళా ప్రాంగణంలోనే శుక్రవారం మధ్యాహ్నం రైతు ఆశీర్వాద సభ నిర్వహించనున్నారు. ఈ సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాలు, వ్యవసాయ అభివృద్ధి చర్యలపై సీఎం రైతులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వంపై భట్టి విక్రమార్క విమర్శలు గుప్పించారు. దశాబ్దాల క్రితం నిర్మించిన నాగార్జునసాగర్, ఎస్ఆర్ఎస్పీ, కడెం వంటి ప్రాజెక్టులు ఇప్పటికీ బలంగా ఉన్నాయని, బీఆర్ఎస్ నిర్మించిన ప్రాజెక్టుల పరిస్థితి రాష్ట్ర ప్రజలకు తెలిసిందేనని వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లాకు గత ప్రభుత్వాలు తగిన నీటి వనరులు అందించలేదని, ఆ విషయాన్ని చరిత్రతో సహా నిరూపిస్తామని అన్నారు. బీఆర్ఎస్ ప్రజలను మాటలతో మోసం చేసే పార్టీ అని, 2023 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పార్టీ నేతలు జిల్లాల పర్యటనలు చేస్తూ విమర్శలు చేస్తున్నప్పటికీ ప్రజలు నమ్మే పరిస్థితి లేదని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదవుతోందని, రైతులు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. తక్కువ కాలంలో దిగుబడి వచ్చే పంటలు, ఆరుతడి పంటలు, పప్పుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు. నాగార్జునసాగర్‌లో నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో సీతారామ ప్రాజెక్టు, రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా వైరా ప్రాజెక్టుకు నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. ఆ నీరు ఇవాళ లేదా రేపటిలోగా వైరా రిజర్వాయర్‌కు చేరుతుందని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. మధిర నియోజకవర్గంలోని మొక్కజొన్న రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరడంతో రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలు చేపట్టినట్లు తెలిపారు. ప్రకృతి, కేంద్ర ప్రభుత్వ సహకారం పూర్తిస్థాయిలో లేకపోయినా రైతుల కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు.

## హైదరాబాద్ ఒలింపిక్స్ క్రీడలు నిర్వహించాలి

మొదటిపేజీ తరువాయి..

గుర్తు చేశారు. పీటీ ఉషతో కలిసి యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ వర్సిటీని సీఎం ప్రారంభించారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌లో జరిగిన ఈ వేడుకలో స్పోర్ట్స్ వర్సిటీ వెబ్‌సైట్, లోగోను పీటీ ఉషతో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. 8వ ఖేలో ఇండియన్ గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రభుత్వ విధానాలే స్పోర్ట్స్‌లో దేశ దుస్థితికి కారణమని, అందుకే క్రీడాకారులను సరైన దిశలో నడిపించడానికి స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. 1990–2004 మధ్య హైదరాబాద్ చాలా స్పోర్ట్స్ ఈవెంట్స్‌కు ఆతిథ్యం ఇచ్చిందని, గత 20 ఏళ్లలో తెలంగాణలో ఎలాంటి పెద్ద స్పోర్ట్స్ ఈవెంట్స్ పెట్టలేదని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు.



హైదరాబాద్ ఒలింపిక్స్ క్రీడలు నిర్వహించాలనేది తమ డ్రీమ్ అని, 2034లో భారత్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వనుందని, దానికి హైదరాబాద్ వేదిక కావాలని కోరుకుంటున్నానని వెల్లడించారు. ఒలింపిక్స్ పతకాల్లో భారత్ ఎప్పుడూ చివరనే ఉంటుందన్న సీఎం కొంతమంది ఒలింపిక్స్, ఇతర గేమ్స్‌లో రాణించినా దేశానికి సరైన గుర్తింపు రావట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాలే స్పోర్ట్స్‌లో దేశ దుస్థితికి కారణమని విమర్శించారు. క్రీడాకారులను సరైన దిశలో నడిపించడానికే స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేశామని, క్రీడలను ప్రోత్సహించడానికే స్పోర్ట్స్ పాలసీ తీసుకువచ్చామని పేర్కొన్నారు. పీటీ ఉష మనందరికి స్ఫూర్తి అని, పీటీ ఉష ఆటల్లో, రాజకీయాల్లో, కెరియర్‌లో అందరికీ స్ఫూర్తి అని రేవంత్ రెడ్డి తెలిపారు. 2018 ఓటమి తర్వాత రేవంత్ రెడ్డి పనైపోయిందని అన్నారని, కానీ లోక్‌సభ ఎన్నికల్లో అతి పెద్ద నియోజకవర్గం నుంచి గెలిచానని, తర్వాత పార్టీ అధ్యక్షుడిని, సీఎం అయ్యానని గుర్తు చేశారు. నవంబర్‌లో ఖేలో ఇండియా గేమ్స్‌కు ఆతిథ్యం ఇస్తున్నామని, చదువుకుంటే ఉద్యోగం వస్తుందో లేదో తెలియదని, ఆటలు ఆడితే మాత్రం కచ్చితంగా ఉద్యోగం వస్తుందని పేర్కొన్నారు. స్పోర్ట్స్ వర్సిటీ ప్రారంభోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందని పీటీ ఉష తెలిపారు. స్పోర్ట్స్ వర్సిటీ యువ ఆటగాళ్ల ప్రతిభను వెలికితీయడానికి ఉపయోగపడుతుందని అన్నారు. స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. పెద్ద కల కనండి, కష్టపడండి, సాధించండని పేర్కొన్నారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967